www.prajasakti.com

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 37 సంచిక : 237
12 + స్నేహ + 12 పేజీలు వెల : 5.00

విజయవాడ, ఆదివారం 27 ఆగస్టు 2017

facebook/prajasakti,
twitter/prajasakti

Sunday Special



నిర్లక్ష్యం ఫలితం

36 ప్రాణాలు

డేరా బాబా అరెస్టుతో హింసాకాండ - 552 మందికి గాయాలు

శాంతి భద్రతలను కాపాడటంలో ఘోరంగా విఫలమైన బిజెపి ప్రభుత్వం

- భారీగా ప్రభుత్వ, ప్రయివేటు ఆస్తుల ధ్వంసం
- చేతులెత్తేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- తీవ్రంగా ఆక్షేపించిన హైకోర్టు



సిర్సా / పంచకుల : హర్యానాలో బిజెపి ప్రభుత్వ నిర్లక్ష్యానికి 36 నిండు ప్రాణాలు బలైపోయాయి. వందలాది మంది గాయపడ్డారు. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ, ప్రయివేటు ఆస్తులు అగ్నికి ఆహుతయ్యాయి. హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో డేరా బాబా అరెస్టు అనంతరం జరిగిన పరిణామాలు, హింసాత్మక ఘటనల్లో అడుగడుగానా ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. హైకోర్టు నేరుగా హెచ్చరికలు జారీ చేసినా శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలో ఘోరంగా విఫలమైంది. డేరా బాబాతో బిజెపి నేతలకు విడదీయరాని బంధముందన్న ఆరోపణల నేపథ్యంలో ప్రస్తుతం హర్యానా ప్రభుత్వం వ్యవహరించిన తీరు స్వామి భక్తిని చాటుకునే చందంగా ఉందని విమర్శలొస్తున్నాయి. హైకోర్టు సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ఆక్షేపించడంతో ఈ విమర్శలకు మరింత బలం చేకూరింది. మరోవైపు హింసాత్మక ఘటనలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్రంగా ఖండించారు. హింస చెలరేగడంపై సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హర్యానా ముఖ్యమంత్రి మిగతా 8లో



హర్యానాలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర ఆందోళన చెందాను. పరిస్థితిపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నా. జాతీయ భద్రత సలహాదారు, హోంశాఖ కార్యదర్శితో పరిస్థితిని సమీక్షించాం.

ట్విట్టర్‌లో ప్రధానమంత్రి మోడీ

ముఖ్యమంత్రి ఖట్టర్, ఆయన ఎమ్మెల్యేలు గతంలో డేరా బాబా ఆశీస్సులు పొందినట్లు కథనాలు వచ్చాయి. ఆ ఆశీస్సుల ప్రభావంతోనే ఇప్పుడింత హింసాకాండ చెలరేగుతున్నా ప్రభుత్వం ఆందోళన కారుల పట్ల దయార్థ్రంగా వ్యవహరిస్తోంది. శాంతి భద్రతల పరిరక్షణలో విఫలమైన ముఖ్యమంత్రిని తక్షణమే తొలగించాలి.

- సిపిఎం పొలిట్‌బ్యూరో

బిజెపికి మాత్రమే ప్రధానా?

- హర్యానా, పంజాబ్ ఏమైనా సవతి పిల్లలా
- ప్రభుత్వ వైఫల్యం వల్లే హింసాకాండ
- రాజకీయ ఉద్దేశాలకు పట్టణాలను తగలేస్తారా?
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైన నిప్పులు చెరిగిన హైకోర్టు

మరిన్ని కథనాలు 3, 8 పేజీలలో

మేటి నగరంగా కాకినాడ

చంద్రబాబు ఎన్నికల హామీ

టిడిపి, బిజెపి అభ్యర్థులను గెలిపించాలని వినతి



కాకినాడ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడను ప్రపంచంలోనే మేటి నగరంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో శనివారం ఆయన పాల్గొన్నారు. కాకినాడలోని నాగమల్లి తోట సెంటర్ నుంచి గొడారిగుంట, డిమార్ట్ ఏరియా, రేచర్లపేట అంబేద్కర్ సెంటర్, మసీదు సెంటర్, భానుగుడి, అచ్చంపేట సెంటర్లలో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆయన ప్రసంగించారు. తిరుపతి, విశాఖ తర్వాత కాకినాడకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఇప్పటికే కాకినాడను రూ.410 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. ప్లాన్ సిటీగా ఉన్న కాకినాడను సుందర స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని చెప్పారు. 2014కు ముందు కాంగ్రెస్ హయాంలో కాకినాడ ఎటువంటి అభివృద్ధికీ నోచుకోలేదన్నారు. కాకినాడకు రూ.410 కోట్లు కేటాయించి డ్రైనేజీ వ్యవస్థను మిగతా 9లో

చట్టసభలు

చర్చలకు వేదికలవ్వాలి



ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడును సన్మానిస్తున్న గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబు

- ఉప రాష్ట్రపతి వెంకయ్య ఆకాంక్ష
- రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా పౌర సన్మానం
- 2.25 లక్షల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజ్యసభ ఛైర్మన్‌గా చర్చల స్థాయిని పెంచేందుకు ప్రయత్నిస్తానని, కొత్త ప్రమాణాల్ని నెలకొల్పేందుకు సభ్యుల సహకారాన్ని తీసుకుంటానని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టసభలు సరిగా పనిచేయకపోతే ప్రజాస్వామ్యం బలహీనపడి విఫలమయ్యే ప్రమాదముందని అభిప్రాయపడ్డారు. చట్టసభలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, చర్చలకు వేదిక కావాలే తప్ప ఘర్షణలకు తావివ్వకూడదని సూచించారు. దేశాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లేవిధంగా చట్టసభలుండాలన్నారు. రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడుకు వెలగపూడిలోని మిగతా 9లో

ప్రజలకు నరక యాతన

ఉపరాష్ట్రపతి సన్మానంతో స్తంభించిన విజయవాడ

- ట్రాఫిక్ వలయంలో ప్రయాణికులు
- మూడుగంటలు నిలబడ్డ విద్యార్థులు
- ప్రజల్ని తరలించిన పౌరసరఫరాలశాఖ

2

కూకట్‌పల్లి కాలనీల్లోకి

నురగ ప్రవాహం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ కూకట్‌పల్లిలోని లోతట్టు కాలనీలను కాలుష్య నురగ ముంచేసింది. పరిశ్రమల నుంచి వదిలే వ్యర్థ జలాలు, వర్షపు నీటితో కలిసిన వరద ఇళ్లల్లోకి వచ్చింది. గత అనుభవాల దృష్ట్యా పరిస్థితిని ముందే అంచనావేసిన స్థానికులు ఇళ్లు వదిలి బయట తలదాచుకున్నారు. కొంతమంది నురగలోనే చిక్కుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో నాలుగు గంటల వ్యవధిలోనే 14 సెంటీమీటర్ల వర్షం కురిసింది. భారీవర్షానికి కూకట్‌పల్లి ప్రాంతంలో ఉన్న చెరువులన్నీ పొంగి పొర్లాయి. చెరువులకు ఎగువ ప్రాంతంలో ఉన్న పరిశ్రమల నుంచి వ్యర్థ జలాల వరద పెరిగి ఎల్లమ్మ, నల్ల చెరువుల్లోకి వచ్చి చేరడంతో ఆనీరు నురగగా మారి చుట్టుపక్కల ప్రాంతాలను ముంచెత్తింది. ధరణినగర్ కాలనీని నురగ కమ్మేసింది. సమస్యను మిగతా 9లో



ప్రభుత్వ రంగ సంస్థలన్నీ పరిరక్షించుకోవాలని కోరుతూ విశాఖపట్నంలో నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్న బివి రాఘవులు వార్త 7లో

పళని సరికొత్త వ్యూహం

- వ్యూహం వెనుక బిజెపి
- 20 మంది డిఎంకె ఎంఎల్‌ఏలపై వేటుకు సిద్ధం
- శిబిరంలోని వారికి స్పీకర్ నోటీసులు

ప్రజాశక్తి - చెన్నయ్ ప్రతినిధి


పళని స్వామి సర్కారును గట్టెక్కించేందుకు వెనుక నుంచి బిజెపి వ్యూహం రచిస్తోంది.. 233 మంది ఎంఎల్‌ఏలలో డిఎంకె నుంచి 20 మందిని, దినకరన్ శిబిరంలో ఉన్న మరో 21 మంది ఎంఎల్‌ఏలను సస్పెండ్ చేయడం ద్వారా తమ మెజారిటీని చూపించుకొని ప్రభుత్వాన్ని నడపాలన్న ధీమాతో ముఖ్యమంత్రి పళని స్వామి ఉన్నట్లు సమాచారం. తమిళనాడు రాష్ట్రంలో అధికార పార్టీలో రాజకీయ సంక్షోభం నెలకొన్న విషయం విదితమే. పళనిస్వామి ప్రభుత్వానికి తాము మద్దతు ఉపసంహరించుకున్నట్లు శశికళ మిగతా 9లో

నంద్యాల ఫలితంపై ఉత్కంఠ

- ఎవరి ధీమా వారిదే
- అంచనాల్లో గందరగోళం రేపుతున్న టిడిపి, వైసిపి సర్వేలు
- రేపు ఓట్ల లెక్కింపు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

నంద్యాల ఉప ఎన్నికల పోలింగ్ రికార్డు స్థాయిలో జరగడంతో నంద్యాల విజేత ఎవరనే దానిపై ఉత్కంఠ నెలకొంది. బరిలో ఉన్న ప్రధాన పార్టీలు గెలుపు తమదేనంటూ ధీమాను వ్యక్తం చేస్తుండడం చర్చనీయాంశమైంది. గతంలో ఎన్నడూలేని విధంగా నంద్యాల ఉప ఎన్నికల్లో 79.2శాతం పోలింగ్ నమోదు కావడంతో పెరిగిన పోలింగ్‌శాతంపై ఎవరికి వారే తమకు అనుకూలమైన పద్ధతులలో అంచనాలు వేసుకుంటూ గెలుపు తప్పక తమకేనంటూ ధీమాను వ్యక్తం చేస్తున్నారు. నంద్యాల నియోజకవర్గంలో 2.18 లక్షల ఓట్లకు గాను 1.73 లక్షల ఓట్లు పోల్ అయ్యాయి. గోస్పాడు మండలంలో 90.18 శాతం, నంద్యాల రూరల్‌లో 87.61 శాతం, నంద్యాలలో 74.06 శాతం నమోదైంది. నంద్యాలలో టిడిపికి అనుకూల వాతావరణం ఉన్న గోస్పాడు, నంద్యాల రూరల్ ప్రాంతాల్లో భారీగా పోలింగ్ జరగడంతో గెలుపు తమదేనంటూ వైసిపి వర్గాలు అంచనా వేస్తున్నాయి. నంద్యాల రూరల్, గోస్పాడు మండలాల కంటే మిగతా 9లో



నంద్యాల పందేలపై చర్యలు చేపట్టాలి

డిజిపికి రఘువీరా లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నంద్యాల ఉప ఎన్నిక ఫలితంపై రాష్ట్రంలో భారీగా జరుగుతున్న పందేలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన డిజిపి ఎన్ సాంబశివరావుకు శనివారం లేఖ రాశారు. అదే విధంగా రాయలసీమలో ఫేక్షన్ తగాదాలను నివారించేందుకు ముందుగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక పథకం ప్రకారమే అధికార, ప్రతిపక్షాలు తమ రాజకీయ ప్రయోజనాలకోసం పరస్పరం ఒకరిపై ఒకరు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసుకొంటున్నారన్నారు.

పేద మహిళలందరికీ బతుకమ్మ చీరలు

తెలంగాణ సిఎం కేసిఆర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బతుకమ్మ పండుగను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన పేద మహిళలందరికీ చీరలను కానుకగా ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రకటించారు. రాష్ట్రంలోని కోటి 4లక్షల 57వేల 610 మందికి సెప్టెంబర్ 18,19,20 తేదీలలో ఈ చీరలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. రేషన్ దుకాణాల వారీగా మహిళలకు అందజేస్తామని, ఏదైనా గుర్తింపుకార్డు చూపించి తీసుకోవచ్చన్నారు. కుల, మతాలకు అతీతంగా పేద మహిళలందరికీ చీరలు పంచనున్నట్లు తెలిపారు.

ప్రజలకు నరకయాతన

- ఉపరాష్ట్రపతి సన్మానంతో స్తంభించిన విజయవాడ
- ఎయిర్‌పోర్టు నుండి విజయవాడ వరకు ఓపెన్‌టాప్ జీపులోనే
- ట్రాఫిక్ వలయంలో ప్రయాణికులు
- రాజకీయ సన్మానంలా ఉందన్న విమర్శలు ?
- మూడుగంటలు నిలబడ్డ విద్యార్థులు
- ప్రజల్ని తరలించిన పౌరసరఫరాలశాఖ





ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం తరపున జరిగిన ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు సన్మాన కార్యక్రమం విజయవాడ నగరవాసులకు ప్రత్యక్ష నరకాన్ని చూపించింది. మూడుగంటల పాటు నగరం స్తంభించింది. ప్రయాణికులు, ఉద్యోగులు, పాఠశాలలకు వెళ్లే పిల్లలతో పాటు ప్రతి ఒక్కరూ నరకయాతన పడ్డారు. ఉదయం ఎనిమిది గంటల నుండే ట్రాఫిక్ ఆంక్షల్ని పెట్టడంతో ఎటూ వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. వెంకయ్యకు ఆహ్వానం పలికేందుకు విద్యార్థులను తరలించాలన్న విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ఉదయం ఎనిమిది గంటలకే పిల్లల్ని తరలించారు. గన్నవరం ఎయిర్‌పోర్టు నుండి విజయవాడ ప్రకాశం బ్యారేజీ వరకు రోడ్డుకిరువైపులా విద్యార్థులు, డ్వాక్రా మహిళలు, తెల్లకార్డుహోల్డర్లు గంటల తరబడి నిలబడాల్సి వచ్చింది. ప్రతి డీలరూ పదిమందిని తీసుకురావాలని పౌర సరఫరాల అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. తీసుకొచ్చిన వారికి మంచినీరు కూడా ఇవ్వలేదు. ముగింపు సమయంలో బిస్కెట్ ప్యాకెట్ ఇచ్చి పంపించారు. ఎయిర్‌పోర్టు నుండి ఉప రాష్ట్రపతి ఓపెన్‌టాప్ జీపులోనే వచ్చారు. మరోవైపు గన్నవరం ఎయిర్‌పోర్టు నుండి చినఅవుటపల్లి వరకు కార్లు, ద్విచక్ర వాహనాలు నిలిచిపోయాయి. తాడేపల్లి వైపు కూడా కిలోమీటర్ల మేర వాహనాల్ని నిలిపేశారు. కార్లలో ఉన్న వృద్ధులు మంచినీరు లేక నానా అవస్థలు పడ్డారు. గన్నవరం నుంచి విజయవాడ మధ్య ఉండే చిన్న చిన్న గ్రామాల నుండి రోడ్డుపైకి ప్రజలను రానీయలేదు. గంటల తరబడి నిలిపేయడంతో ఆఫీసులకు వెళ్లాల్సిన ఉద్యోగులు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. నగరంలో వెంకయ్య ర్యాలీ వచ్చే రూట్‌లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. గన్నవరం ఎయిర్‌పోర్ట్ వద్ద ఉదయం 9.20కు మొదలైన ర్యాలీ ప్రకాశం బ్యారేజీకి చేరుకునే సరికి 11.30 అయ్యింది. ఎయిర్‌పోర్టులోకెళ్లే వారిని సైతం నిలువరించడంతో కొందరు పోలీసులతో వాదులాటకు దిగారు.

విద్యార్థులు, మహిళలే సమిధలు

ప్రభుత్వం నిర్వహించే ఏ కార్యక్రమంలోనైనా విద్యార్థులు, మహిళలు సమిధలుగా మారుతున్నారు. వెంకయ్యానాయుడు ర్యాలీలోనూ ఇదే ధోరణి కనిపించింది. విద్యార్థులు, డ్వాక్రా మహిళల్ని రోడ్డుకిరువైపులా గంటల తరబడి నిలబెట్టి స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేశారు. ఎక్కువ సేపు నిలబడటంతో చాలా మంది ఇబ్బందులు పడ్డారు. విజయవాడతో పాటు చుట్టు పక్కల గ్రామాల మహిళలు, విద్యార్థుల్ని ఈ కార్యక్రమానికి వాహనాల్లో తరలించారు. కార్యక్రమానికి రాకపోతే డ్వాక్రా రుణాలను నిలుపుదల చేస్తామంటూ బెదిరించారని కృష్ణాజిల్లా బాపులపాడు మండలం ఉమామహేశ్వరపురానికి చెందిన కొందరు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపైనే గంటల కొద్దీ నిలబెట్టారని రామలింగేశ్వరనగర్ డ్వాక్రా గ్రూపునకు చెందిన ఓ మహిళ తెలిపింది.

చంద్రబాబు ఆర్భాటంతో ఇబ్బందులు
విద్యార్థి, ప్రజా సంఘాలు

సిఎం చంద్రబాబు ప్రచార ఆర్భాటం వల్లే రాష్ట్రంలోని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నూర్ మహ్మద్ విమర్శించారు. ర్యాలీల పేరుతో విద్యార్థుల్ని ఇబ్బంది పెట్టడంపై వెంకయ్య సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ చర్యపై కేంద్ర మానవ వనరులశాఖకు, మానవ హక్కుల కమిషన్‌కు, బాలల హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు నూర్ మహ్మద్ తెలిపారు. పౌరసన్మానం పేరుతో విద్యార్థులు, డ్వాక్రా మహిళల్ని తరలించి రోడ్లపై నిలబెట్టడాన్ని ఐద్వా రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. విద్యార్థులను, మహిళలను రోడ్డుపై నిలబెట్టిన వారిపై కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది.

డీలర్లకు నమస్కారం

డీలర్లకు నమస్కారం. విజయవాడ నగర పౌరసరఫరాల డీలర్లందరికీ వినాయకచవితి పండుగ శుభాకాంక్షలు. పండుగ సందర్భంగా అత్యంత సంతోషపడాల్సిన విషయం అచ్చతెలుగు మనిషి ముప్పవరపు వెంకయ్యానాయుడు ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టడం. శనివారం తొలిసారిగా మన రాష్ట్రానికి వస్తున్నారు. గన్నవరం ఎయిర్‌పోర్టు నుండి ప్రకాశం బ్యారేజీ వరకు ఓపెన్‌టాప్ జీపులో మనందరి నుండి అభివాదం స్వీకరిస్తారు. కనుక ప్రతి రేషన్‌షాపు డీలరూ పదిమంది కార్డుహోల్డర్లను తీసుకురావాలి. రెండు, లేదా మూడు ఆటోలు పెట్టి ఉదయం ఏడు గంటలకు సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకోవాలి. అక్కడ డీలర్ల అటెండెన్స్ తీసుకోబడుతుంది. అలాగే ఎంతమందిని తరలించారో నోట్ చేసుకోవడమూ జరుగుతుంది. దీన్ని మీరందరూ తప్పకుండా పాటించాలి.

-సహాయ సరఫరాల అధికారి
ఉదయభాస్కర్, విజయవాడ

ప్రజ్ఞ

1. ఇన్ఫోసిస్ నూతన సిఇఒ ఎవరు?
2. రైల్వే బోర్డు నూతన ఛైర్మన్ ఎవరు?
3. కేంద్ర విదేశాంగ శాఖ తొలిసారిగా ఏ నగరంలో 'విదేవీ భవన్'ను ప్రారంభిస్తోంది?
4. 'ఐ డూ వాట్ ఐ డూ' పుస్తకాన్ని రాసిన మాజీ ఆర్‌బిఐ గవర్నర్ ఎవరు?
5. పరిచారికలపై అత్యాచారం చేసిన కేసులో సిబిఐ కోర్టులో దోషిగా నిలిచిన బాబా ఎవరు?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

వాతావరణం

నేడు, రేపు కోస్తాలో భారీ వర్షాలు

24 గంటల్లో అల్పపీడనంగా మార్పు
పిడుగులు పడే ప్రమాదం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

వాయువ్య బంగాళాఖాతంలో ఉత్తర ఒడిశా-పశ్చిమ బెంగాల్‌కు ఆనుకుని ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు భారత వాతావరణ కేంద్రం తెలిపింది. 24 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశాలున్నాయని శనివారం ప్రకటించింది.. వీటి ప్రభావంతో 27, 28 తేదీల్లో కోస్తాలో, ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన వర్షం, అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. రాయలసీమ లోనూ అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడతాయని తెలిపింది. మరోవైపు ఒడిశా నుంచి కోస్తాంధ్ర, రాయల సీమ మీదగా దక్షిణ తమిళనాడు వరకు ద్రోణి స్థిరంగా కొనసాగుతోందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని వివరించింది. శనివారం ఉదయానికి వర రామచంద్రా పురంలో 7.2, వీరఘట్టం 5.5, కారంచేడు, అద్దంకి 5.1, వేలాయిర్పాడు 3.9, పాతపట్నం 3.8, బాపట్ల, గజపతినగరం 3.5, కూనవరం, అర్ధవీడు 3.3, సంతమాగులూరు 3.2, అరకు వేలీ 3.1, హోలగుండ 4.1, బత్తులపల్లె 2.8, ఆలూరు 2.5, ఆస్పరి 2.2 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

ప్రతి రైతుకూ రూ. 10 వేలు కరువు పింఛనివ్వాలి : జెట్టి గురునాథం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : రాష్ట్రంలో కరువు అధికమైన నేపథ్యంలో ప్రతి రైతుకూ నెలకు రూ. 10వేలు కరువు పింఛనివ్వాలని కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాథరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కరువుతో అల్లాడుతున్న రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రజల్ని ఆదుకోవాలన్నారు. రైతాంగాన్ని, ప్రజల్ని ఆదుకోవడానికి సహాయక చర్యలు, శాశ్వత కరువు నివారణా చర్యలు చేపట్టాలన్నారు. రైతు కూలీలకు నెలకు రూ.5 వేలు పింఛనివ్వాలన్నారు.

600 హామీల బాబుకు బుద్ధిచెప్పండి

- వైసిపి నేత రోజా
- విస్తృతంగా వివిధ పార్టీల ప్రచారాలు



రోడ్‌షోలో ప్రసంగిస్తున్న వైసిపి ఎమ్మెల్యే రోజా



టిడిపి, బిజెపి కండువాలతో బిజెపి నాయకురాలు పురంధేశ్వరి

ప్రజాశక్తి - కాకినాడ/కార్పొరేషన్

2014 ఎన్నికల్లో 600 హామీలనిచ్చిన చంద్రబాబు గద్దెనెక్కి మూడేళ్లకుపైగా అయినా వాగ్దానాలు నెరవేర్చలేదని వైసిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, నగరి ఎంఎల్ఎ రోజా విమర్శించారు. హామీలిచ్చి అమలు చేయని చంద్రబాబుకు వ్యతిరేకంగా ఓటు వేసేకాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కాకినాడలోని 32, 33, 10, 11, 12, 13, 31, 29, 28, 27 డివిజన్లలో ఆమె రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాపాలన పక్కనపెట్టి చంద్రబాబు, కొడుకు లోకేష్, ఇతర మంత్రులు దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. 13 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు కాలంలో కాకినాడలో అభివృద్ధి ఏమీ జరగలేదన్నారు. ఎన్నికలు పెట్టకుండా దోచుకోవాలనే ఉద్దేశంతోనే మూడేళ్లుగా కాకినాడలో ఎన్నికలు పెట్టలేదని ఆరోపించారు. డ్వాక్రా మహిళలనూ, నిరుద్యోగులను చంద్రబాబు మోసం చేశారని అన్నారు. కాకినాడ యాంకరేజ్ పోర్టు అభివృద్ధి చేసి కార్మికులకు ఉపాధి మరింత పెరిగే విధంగా చేస్తామని టిడిపి పాలకులు నమ్మించి, ఇప్పుడు పోర్టును నిర్వీర్యం చేశారని వైసిపి రాష్ట్ర నాయకులు ధర్మాన ప్రసాదరావు విమర్శించారు.

మంత్రుల విస్తృత ప్రచారం

ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప, ఆర్థికశాఖా మంత్రి యనమల రామక ష్ణుడు, విద్యుత్ శాఖా మంత్రి కిమిడి కళా వెంకట్రావుతోపాటు మంత్రులు జవహర్, సిద్ధా రాఘవరావు, కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడు, ఆనందబాబు తదితరులు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు మద్దతుగా శనివారం ప్రచారం నిర్వహించారు. 30వ డివిజన్‌లో అభ్యర్థి బాదం బాలకృష్ణకు మద్దతుగా సిద్ధా రాఘవరావు, చిన్నరాజప్ప ప్రచారం చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర 37వ డివిజన్ అభ్యర్థి లంకె హేమలతకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కాకినాడలో టిడిపి అభ్యర్థులకు మద్దతుగా సినీ హాస్య నటుడు వేణుమాధవ్ కూడా ప్రచారం చేశారు.

మిత్రధర్మం పాటించాల్సిందే : పురంధేశ్వరి

ఎన్నికల పొత్తులో భాగంగా టిడిపి, బిజెపిలు మిత్రధర్మం పాటించాల్సిందేనని బిజెపి నాయకులు దగ్గుపాటి పురంధేశ్వరి అన్నారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా 9వ డివిజన్ నుంచి పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాలకొండయ్యకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. టిడిపితో పొత్తులో భాగంగా మెడలో బిజెపి, టిడిపి కండువాలను వేసుకుని ప్రచారం చేశారు.

కేంద్రం ' డిటెన్షన్ ' కు తెలుగు రాష్ట్రాలు వ్యతిరేకం

- డ్రాపవుట్స్ పెరిగే ప్రమాదముందని ఆందోళన
- మరోసారి తీర్మానాన్ని పంపేందుకు సిద్ధం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టాలనుకుంటున్న డిటెన్షన్ విధానం పట్ల తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వ్యతిరేకిస్తున్నాయి. పాఠశాల విద్య స్థాయిలో 5,8 తరగతుల్లో డిటెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీనిపై అభిప్రాయాలు చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాల్ని కేంద్రం కోరగా తెలుగు రాష్ట్రాలు అందుకు సుముఖత వ్యక్తం చేయడంలేదు. ఈ విధానం అమలైతే ప్రస్తుత విద్యావిధానం మరింత బలహీన పడుతుందని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రెండు రాష్ట్రాలు కూడా జాతీయ అక్షరాస్యతా శాతం కంటే వెనుకబడ్డాయి. జాతీయ అక్షరాస్యత శాతం 74.88 శాతముంటే ఆంధ్రప్రదేశ్‌లో అక్షరాస్యత 67.02శాతం, తెలంగాణలో అక్షరాస్యత 66.46శాతం ఉన్నాయి. మరోపక్క ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య కూడా రోజురోజుకూ తగ్గుతోంది. ఈ విధానం అమలైతే అక్షరాస్యత శాతం మరింత తగ్గే అవకాశముందని రెండు రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నిర్ణయం వల్ల డ్రాపవుట్స్ పెరుగుతాయని, పేద పిల్లలు, ప్రభుత్వ పాఠశాలలకే నష్టం వాటిల్లుతుందని రెండు రాష్ట్రప్రభుత్వాలు పేర్కొంటున్నాయి. ఉన్నత చదువులకు పేద విద్యార్థులు దూరమవుతారని, ఫలితంగా బాల కార్మికులుగా మారే ప్రమాదముందని భావిస్తున్నాయి. ఇప్పటికే ఆందోళనలో ఉన్న బాలికల విద్య కూడా మరింత దిగజారి బాల్య వివాహాలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు విద్యావేత్తలు కూడా ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఎనిమిదో తరగతి వరకు విద్యార్థులను ఫెయిల్ చేయరాదనే నిబంధన 2010 విద్యాహక్కు చట్టం సెక్షన్ 16లో ఉందని, డిటెన్షన్ కోసం విద్యాహక్కు చట్టాన్ని మార్పు చేయాల్సి ఉంటుందని వారంటున్నారు. విద్యార్థి వ్యక్తిత్వ వికాసాన్ని అభివృద్ధి చేసేదిగా విద్య ఉండాలే తప్ప, కేవలం పరీక్షల్లో వచ్చే మార్కులు, గ్రేడ్‌లతో విద్యార్థుల జ్ఞానాన్ని కొలవడం సరైన విధానం కాదని సూచిస్తున్నారు. ఈ విధానానికి వ్యతిరేకమని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా కేంద్రం నిర్ణయం పట్ల వ్యతిరేకంగానే ఉంది. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలతో 2015లో పాఠశాల విద్యాశాఖ నిర్వహించిన వర్క్‌షాపులో డిటెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానించారు. మరలా ఇదే అంశంపై కేంద్రప్రభుత్వం రాష్ట్రాన్ని కోరడంతో అప్పటి తీర్మానాన్ని మరోసారి కేంద్రానికి పంపాలనే ఆలోచనలో ఉన్నారు.

నంద్యాల ఖర్చుపై ఎన్నికల సంఘం ఆరా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధికార, ప్రతిపక్షాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నంద్యాల ఉప ఎన్నిక ఖర్చుపై కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి సారించింది. ప్రచారం కోసం అభ్యర్థులు చేసిన ఖర్చుపై నివేదిక సమర్పించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారిని ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం నుంచి వచ్చిన ఆదేశాలను రిటర్నింగ్ అధికారికి పంపినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ తెలిపారు. దీంతో ప్రముఖుల ఎన్నికల ప్రచార ఖర్చులు మొత్తం అభ్యర్థి ఖాతాలో జమ చేయనున్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 77 ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యే సీటుకు పోటీ చేస్తున్న అభ్యర్థి ఎన్నికల ప్రచారానికి గరిష్టంగా రూ.28 లక్షలు ఖర్చు చేసుకునే వీలుంది. అయితే అభ్యర్థి తరపు ప్రచారం నిర్వహించే వారి ప్రచారానికయ్యే ఖర్చుకు, అభ్యర్థి తన ప్రచారానికి చేసే ఖర్చుకు ఎలాంటి సంబంధం ఉండదు. కానీ అభ్యర్థి తరపున ఎవరెవరు ప్రచారం నిర్వహిస్తారో.. వారందరి పేర్లను ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వారంలోగా ఎన్నికల కమిషన్‌కు అందించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో జూలై 29న నోటిఫికేషన్ వెలువడగానే ఆగస్టు 2న తమ పార్టీ తరుపున ప్రచారం చేసే నేతల వివరాలను ఎన్నికల సంఘానికి వైసిపి అందజేసింది.

వైద్య విద్యలోనూ మిగులుతున్న సీట్లు

- జాతీయ విద్యాసంస్థలవైపే విద్యార్థులు మొగ్గు
- మూడో విడత కౌన్సెలింగ్‌లోనూ మిగిలిన సీట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంజనీరింగే కాదు...ఎంబిబిఎస్, బిడిఎస్‌లలోనూ సీట్లు భారీగా మిగిలిపోతున్నాయి. విద్యార్థులు రాష్ట్ర విద్యా సంస్థల కంటే జాతీయ విద్యా సంస్థల వైపే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. దీంతో రాష్ట్ర స్థాయిలోని కళాశాలల్లో సీట్లు మిగిలిపోతున్నాయి. కౌన్సెలింగ్‌లో సీటు ఖరారైనప్పటికీ..వారిలో చాలా మంది కళాశాలలో రిపోర్ట్ చేయడం లేదు. ముఖ్యంగా టాప్ ర్యాంకర్లు మొత్తం జాతీయస్థాయి కళాశాలలైన ఎయిమ్స్, జిప్‌మర్ వంటి విద్యా సంస్థల్లో చేరడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ ఏడాది మూడు విడతల కౌన్సెలింగ్ ముగిసిన నేపథ్యంలో కన్వీనర్ కోటాలోనే సీట్లు మిగిలిపోయాయి. ఎంబిబిఎస్‌లో ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో 1475 సీట్లు, శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ పధిలో 1252 సీట్లు, స్టేట్‌వైడ్ పరిధిలో 150 సీట్లున్నాయి. బిడిఎస్‌లో ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో 425 సీట్లు, శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలో 225 సీట్లున్నాయి. అయితే మూడో విడత కౌన్సెలింగ్ పూర్తయ్యే నాటికి ఎంబిబిఎస్‌లో 60 సీట్లు ఖాళీగా ఉండగా, బిడిఎస్‌లో 320 సీట్లు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు "బీ", "సీ" కేటగిరిల్లోనూ సీట్లు మిగిలిపోయాయి. "బీ" కేటగిరిలో 126 సీట్లు, "సీ" కేటగిరిలో 162 మిగిలాయి. మైనార్టీ కళాశాలల్లో ఎంబిబిఎస్, బిడిఎస్‌లలో కలిసి "బీ" కేటగిరిలో 10 సీట్లు మిగిలిపోగా, "సీ" కేటగిరిలో 119 సీట్లు మిగిలాయి. దీంతో గతేడాది మాదిరిగానే మరో విడత కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. ప్రభుత్వ, ప్రయివేటు, మైనారిటీ కళాశాల్లోని ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సులతో పాటు ఆయుష్ వైద్య విద్య సీట్ల భర్తీని నీట్ ద్వారానే చేపట్టనున్నారు.ఇదే సమయంలో ఎయిమ్స్, జిప్‌మర్ వంటి జాతీయ స్థాయి విద్యా సంస్థలతో పాటు ప్రతిష్టాత్మకమైన పూణెలోని ఏఎఫ్ఎంసీలో ప్రవేశాలకు ఆయా సంస్థలు నిర్వహించే ప్రవేశ పరీక్షల ద్వారా సీట్లు భర్తీ చేస్తారు. ఆయా విద్యా సంస్థలకు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల విద్యార్థులతో పాటు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు పోటీ పడుతున్నారు. అయితే మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరై సీటు రిజర్వు చేసుకుని, ఆ తరువాత జాతీయ విద్యా సంస్థల్లో సీటు రాగానే అక్కడికి వెళ్లి పోతున్నారు. దీంతో రాష్ట్రస్థాయి కళాశాలల్లో సీట్లు మిగిలిపోతున్నాయి. ఆయా సీట్ల భర్తీ కోసం మరోసారి కౌన్సెలింగ్ నిర్వహించాల్సి వస్తోంది.

సీట్లు పొందిన వారికి నాలుగో విడతలో నోఛాన్స్ : ఎన్టీఆర్‌హెచ్‌యూ ఇంచార్జి వీసీ రవిరాజు

సీట్లు భారీగా మిగిలిపోతుండటంతో గతేడాది మాదిరిగానే ఐదు విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఇంచార్జి వీసీ రవిరాజు తెలిపారు. ఇప్పటికే కౌన్సెలింగ్‌లో పాల్గొని సీటు ఖరారైన అభ్యర్థులకు నాలుగో విడత కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అవకాశం లేదని స్పష్టం చేశారు. మూడో విడత కౌన్సెలింగ్‌లో పాల్గొని సీటు పొందిన విద్యార్థులకు ఈ నెల 24 వరకు కళాశాలలో రిపోర్టు చేయాలని సూచించామని, అయితే చాలా మంది విద్యార్థులు వారికి కేటాయించిన కళాశాలలో రిపోర్టు చేయలేదని తెలిపారు. నాలుగో విడత కౌన్సెలింగ్‌లో అలాంటి వారికి మళ్లీ కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశం లేదన్నారు. నాలుగో విడత కౌన్సెలింగ్‌లో కన్వీనర్ కోటా సీట్లు పూర్తిగా భర్తీ అయ్యే అవకాశం ఉందన్నారు.



మాజీ మంత్రి ఆలపాటి వెంకట్రామయ్య జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు తదితరులు

మహనీయుల స్ఫూర్తితో సమాజ సేవ

ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అభివృద్ధికి ప్రతీకలైన మహనీయుల జీవిత చరిత్రలను చదవి, వారిని స్ఫూర్తిగా తీసుకుని, యువత సమాజ సేవకు పాటుపడాలని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు అన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో శనివారం సాయంత్రం నిర్వహించిన మాజీ మంత్రి ఆలపాటి వెంకట్రామయ్య శత జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. వెంకట్రామయ్య విగ్రహాన్ని, జీవిత చరిత్ర సావనీర్‌ను వెంకయ్యానాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలపాటి వెంకట్రామయ్య 48 ఏళ్లు మాత్రమే జీవించినా రాష్ట్రంలో నూరేళ్లపాటు గుర్తుండేలా అభివృద్ధి పనులు చేపట్టారని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎంతో మంది మహనీయులు వారి జీవితాలను త్యాగం చేసి రాష్ట్రాభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. పోలవరానికి 1981 నుంచి 2014 వరకూ అనేకసార్లు శంకుస్థాపన చేసినా ఇప్పుడే పనులు వేగం పుంజుకున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ కోడెల శివప్రసాదరావు, మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, కామినేని శ్రీనివాస్, ఎంపి గల్లా జయదేవ్, ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, వెంకట్రామయ్య కుటుంబీకులు పాల్గొన్నారు.



నేపాల్ ప్రధాని షేర్ బహదూర్‌కు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న టిటిడి అధికారులు

విభేదాలను చర్చలతో పరిష్కరించుకోవాలి

తిరుమలలో నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా

ప్రజాశక్తి-తిరుమల

భారత్, చైనా మధ్య విభేదాలను చర్చలతో పరిష్కరించుకోవాలని నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా అన్నారు. ప్రపంచ మానవాళికి శ్రీవారి ఆశీస్సులు అందించాలని ప్రార్థించినట్లు చెప్పారు. అంతకుముందు శనివారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. నేపాల్, భారతదేశాల మధ్య సాంస్కృతికంగా, భౌగోళికంగా విడదీయరాని సంబంధం ఉందన్నారు. శ్రీవారిని దర్శించుకోవడం సంతోషకరమని తెలిపారు. షేర్ మీడియాతో మాట్లాడే సమయంలో ఆయన వ్యక్తిగత కార్యదర్శి వద్దని చెప్పడంతో ఆయన మాట్లాడకుండా బయల్దేరడం గమనార్హం. తొలుత ఆలయం వద్దకు చేరుకున్న నేపాల్ ప్రధానికి టిటిడి ఈవో అనీల్‌కుమార్ సింఘాల్, తిరుమల జెఈవో కె.ఎస్.శ్రీనివాసరాజు, అర్చకుల బందం కలిసి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం టిటిడి ఈవో, జెఈవో కలిసి శ్రీవారి తీర్థప్రసాదాలను, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రి కాల్వ శ్రీనివాసులు, కలెక్టర్ పిఎస్.ప్రద్యుమ్న, టిటిడి సివిఎస్‌వో రవికష్ణ, శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈవో కోదండరామారావు, రిసెప్షన్ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఓఎస్‌డి లక్ష్మీనారాయణయాదవ్ పాల్గొన్నారు.

గుర్మీత్‌తో బిజెపి, కాంగ్రెస్ గతబంధాలు

న్యూఢిల్లీ : డేరా సచ్చా సౌదా సంస్థ సామాన్య ప్రజానీకంలో విపరీతమైన ఆదరాభిమానాలు సంతరించుకుంది. నిజానికి ఇది 1948లో ఏర్పాటైన షా మస్తానా బెలూచిస్తానీ అనుబంధ సంస్థ. దీనికి సిక్కులలోనూ, ముస్లింలలోనూ, క్రైస్తవులలోనూ, దళిత, బలహీనవర్గాలలో విపరీతమైన ఆదరణ ఉంది. ప్రజాబలం కారణంగానే హర్యానా, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాలలో ఎన్నికల సమయంలో ఏ పార్టీ విజయావకాశాలనైనా ప్రభావితం చేయగల స్థితికి డేరా సచ్చా సౌదా ఎదిగింది. ఈ కారణంగానే గతంలో ప్రముఖ రాజకీయపార్టీలు అది బీజేపీ అయినా, కాంగ్రెస్ అయినా మరో పార్టీ అయినా ఆయన మద్దతు కోసం ఆయన ముందు మోకరిల్లారనటంలో అనుమానం లేదు. ఒకపక్క తాను రాజకీయాలకు అతీతం అంటూనే 2007లో డేరా సచ్చా సౌదా సంస్థ నేత గుర్మీత్ రాం రహీం రాజకీయ విభాగాన్ని ఏర్పాటుచేశారు. 2014 ఎన్నికల సమయం వరకూ నిజానికి గుర్మీత్ పేరు అంతగా ప్రచారంలో లేదు. లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీ గుర్మీత్ మద్దతు కోరింది. అందుకు స్వయంగా అప్పటి ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోడీ నుంచి గుర్మీత్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. అదే విధంగా మోడీ ప్రధాని బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రారంభించిన స్వచ్ఛభారత్‌కు గుర్మీత్ మద్దతు ప్రకటించింది, అందుకు మోడీ నుంచి ప్రశంసలు అందుకున్నారు.

హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో కలిసి ఆ సమయంలో గుర్మీత్ స్వయంగా చీపురుపట్టి రోడ్లను శుభ్రం చేసిన ఫొటోలు మీడియా దృష్టిలో పడ్డాయి. హర్యానాలో గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్ర బీజేపీ నేత కైలాశ్ విజయవర్గీయ తన పార్టీ అభ్యర్థులు 44 మందిని స్వయంగా గుర్మీత్ ఆశ్రమానికి తీసుకెళ్లి ఆయన ఆశీస్సులు కోరిన విషయం, ఆ తర్వాత ఎన్నికల్లో పార్టీ విజయం సాధించడం అందరికీ తెలిసిందే. అయితే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం గుర్మీత్ ప్రచారం బీజేపీకి యోగపడలేదు.



స్వచ్ఛభారత్‌లో భాగంగా డేరా బాబాతో కలిసి రోడ్డు ఊడుస్తున్న హర్యానా ముఖ్యమంత్రి ఖట్టర్

ఇక కాంగ్రెస్ విషయం చూస్తే గుర్మీత్‌కు నలుగురు పిల్లలు. వారిలో కుమారుడైన జస్మీత్‌కు ప్రముఖ కాంగ్రెస్ నేత హర్మీందర్ సింగ్ కుమార్తెతో వివాహం అయింది. 2007 ఎన్నికల్లో గుర్మీత్ కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు. అప్పటికి అధికారంలో ఉన్న శిరోమణి అకాలీదళ్ తన అనుయాయులను వేధిస్తున్నదే ఆగ్రహంతో కాంగ్రెస్‌కు అండగా నిలిచారు. అయితే అప్పుడు కాంగ్రెస్‌కు ఆయన మద్దతు ఉపయోగపడలేదు. ఎన్నికల్లో ఓటమిపాలైంది. 2012 ఎన్నికల్లో ఆయన ఏ పార్టీకి మద్దతు ఇవ్వలేదు. పంజాబ్ ఎన్నికల సమయంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండు ఆయన మద్దతు కోసం ప్రయత్నించాయి. ఆయన బీజేపీకి మద్దతు ఇచ్చినా ఆ పార్టీకి ఓటమి తప్పలేదు.

బీజేపీ మంత్రులు పెద్ద మొత్తంలో నిధులు అందించేవారు. 2014 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మద్దతు బీజేపీకి లాభించకపోయినా దాదాపు గత ఆగస్టు నుంచి ఇప్పటివరకూ కోటి రూపాయలకు పైనా వారు గుర్మీత్‌కు సమర్పించినట్లు సమాచారం. కేవలం రెండు వారాల క్రితం హర్యానా విద్యా శాఖ మంత్రి రాం విలాస్ శర్మ గుర్మీత్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఏడాది క్రితం మరో ప్రముఖ మంత్రి అనిల్ విజ్ రూ. 50 లక్షలు స్పోర్ట్స్ వ్యాప్తి పేరుతో డేరా సంస్థకు సమర్పించారు. మరో మంత్రి రూ. 11 లక్షలు తన విచక్షణ ఆధారంగా అందజేశాడు. నిజానికి ఇవాళ కోర్టు కేసులో దోషిగా నిలబడే వరకు గుర్మీత్‌కు అందించిన జెడ్ క్యాటగెరీ భద్రత ఇదివరకటి కాంగ్రెస్ సర్కారు మంజూరు చేసిందే.

ఆరాధించే వ్యక్తిపై ఆరోపణలా ?

సాక్షి మహారాజ్ వివాదాస్పద వ్యాఖ్య

న్యూఢిల్లీ పంచశిల కోర్టులో రేపిస్టుగా నిరూపించబడిన డేరా సచ్చా సౌధా సారధి గుర్మీత్ రాం రహీం సింగ్ విషయంలో వివాదాస్పద ఎంపీ సాక్షి మహారాజ్ సంచలనం కలిగించే వ్యాఖ్యలు చేశాడు. ఆయనను కోర్టు అపరాధిగా ప్రకటించిన వెంటనే ఆయన స్పందిస్తూ కోట్లాది మందికి ఆరాధ్యుడైన వ్యక్తి దోషి ఎలా అవుతాడు. అలాంటి వ్యక్తిపై ఆరోపణలు చేసిన మహిళ చెప్పేది సత్యమేనని ఎలా విశ్వసించడం అంటూ సాక్షి మహారాజ్ వ్యాఖ్యానించారు. కోర్టు తీర్పు రాగాన్ ఆయన మద్దతుదారులు సృష్టించిన విధ్వంసం గురించి ప్రశ్నించగా, ఇదే ప్రశ్న జుమ్మా మసీదు షాహీ ఇమామ్‌ను అడగగలరా ? ఆయనపై కూడా చాలా ఆరోపణలు ఉన్నాయి కదా అని ఎదురు ప్రశ్నిస్తూ, గుర్మీత్ సాధారణ వ్యక్తి అయినందుననే ఆయనను వేధిస్తున్నారని సాక్షి మహారాజ్ ఆరోపించారు. ఇక ఎప్పుడూ సంచలనాలకు మారు పేరుగా నిలిచే రాజ్యసభ ఎంపీ సుబ్రహ్మణ్య స్వామి ట్విట్టర్ వేదికగా తన అభిప్రాయం వ్యక్తంచేస్తూ సాధువులకు రాజకీయవేత్తల నుంచి వారి ఆశ్రమాలలోని వారి నుంచే పెద్ద ముప్పు ముంచుకొస్తోందని, వారిని జైళ్లకు పంపి ఆశ్రమ ఆస్తులను చేజిక్కించుకోవాలన్న ధోరణి పెరిగిపోతోందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంలో ఆయన కంచి ఆచార్య, బాబా రాందేవ్, శ్రీరవిశంకర్‌ల పేర్లు ప్రస్తావించారు. కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ స్పందిస్తూ టీవీ చానెల్స్ సంయమనం పాటించాలని పరిస్థితిని మరింత అధ్వాన్నం చేసే ప్రసారాలు నిలుపుచేయాలని సూచించారు. మరో ట్వీట్‌లో హింస, విధ్వంసాలను తీవ్రంగా ఖండించారు.

నేరాలు.. వివాదాలు

అత్యాచారాల కేసు

2002లో సిర్సాలో ఉన్న ప్రధాన ఆశ్రమంలో గుర్మీజీ తమపై అత్యాచారానికి పాల్పడ్డాడని డేరా సచ్ఛా సౌధకు చెందిన ఇద్దరు మహిళలు ఆరోపణలు చేశారు. ఈ విషయమై అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయికి ఆకాశ రామన్న లేఖలు రాశారు. దీంతో ఈ వ్యవహారంపై దర్యాప్తుకు ఆదేశించారు. ప్రస్తుతం గుర్మీజీ దోషిగా తేలింది ఈ కేసులోనే.

అపహరణ కేసు

2005లో డేరా బాబాపై కిడ్నాప్ ఆరోపణలతో క్రిమినల్ కేసు నమోదైంది. తన భార్య గుడీ దేవిని గుర్మీజీ అపహరించారని జైపూర్‌కు చెందిన కమలేష్ కుమార్ ఫిర్యాదు చేయడంతో బాబాపై ఈ కేసు నమోదైంది.

జంట హత్యలు



2002 జులై 10న డిఎస్ఎస్ సభ్యుడు రంజీత్ సింగ్ హత్యకు గురయ్యారు. 2002 అక్టోబర్ 23న సిర్సా కేంద్రంగా నడుస్తున్న 'పూరా సచ్' దినపత్రిక సంపాదకులు రామ్ చందేర్ ఛత్రపతి కూడా హత్యకు గురయ్యారు. ప్రస్తుతం డేరా బాబా దోషిగా తేలిన కేసులో కీలకమైన 'ఆకాశరామన్న లేఖ'ను ప్రచురించింది ఈ పత్రికే. ఈ లేఖకు, రంజీత్‌కు సంబంధమున్నట్లు భావిస్తున్నారు. చందేర్ హత్యపై ఇంకా కేసు నడుస్తోంది.

'నపుంసక మార్పిడి' ఆరోపణలు

సిర్సాలోని ఆశ్రమ నిర్వాహకులు గుర్మీజీ ఆదేశానుసారం దాదాపు 400 మందిని నపుంషకులుగా మార్చి నట్లు ఆరోపణలు న్నాయి.

డేరా సచ్ఛా సౌథ అధిపతి రామ్ రహీం సింగ్ ఆధ్యాత్మిక ముసుగులో సాగించిన నేరాలు, ఆయన చుట్టూ సాగిన వివాదాలకు లెక్కలేదు. వాటిలో కోర్టుల వరకూ వెళ్లిన కొన్ని నేరాలు, వివాదాలు కొన్నే. అవేంటో చూద్దాం.



సాయుధ శిక్షణ

2014లో గుర్మీజీ తన అనుచరులకు సాయుధ శిక్షణ ఇస్తున్నట్లు ఆన్‌లైన్‌లో కథనాలు రావడంతో డేరా సచ్ఛా సౌథ కార్యకలాపాలపై దర్యాప్తు సాగించాలని హర్యానా, పంజాబ్ ప్రభుత్వాలను పంజాబ్–హర్యానా ఉమ్మడి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

సిక్కుల ఆగ్రహం

2007లో సిక్కుల పదో గురువైన గురు గోవింద్ సింగ్ వేషదారణలో డేరా బాబా ఒక వాణిజ్య ప్రకటనలో కనిపించడం అప్పట్లో సిక్కులలో కొందరికి ఆగ్రహం తెప్పించింది. గుర్మీజీ తమ దైవాన్ని కించపర్చా రని దైవ దూషణ నేరంగా పరిగణించా లంటూ ఆరోపణలు చేయడం అప్పట్లో తీవ్ర కలకలం రేపింది.


నేడే చూడండి...గుర్మీజీ సమర్పించు..

2015లో డేరా బాబా వివాదాలు వెండి తెరకెక్కాయి. ఆయన నటించిన 'ఎంఎస్‌జి' చిత్రం వివాదాలను మూటగట్టుకుంది. ఈ చిత్ర ప్రదర్శనకు ఫిల్మ్ సర్టిఫికేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ అనుమతించడంతో నాటి సెన్సార్ బోర్డు ఛైర్మన్ లీలా సమ్సాన్ ఆ పదవికి రాజీనామా చేశారు. ఎంఎస్‌జి విడుదలను నిరసిస్తూ సిక్కు సంస్థలు ఆందోళనలు చేపట్టాయి. పంజాబ్, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలు హైఅలర్ట్ ప్రకటించాల్సినంత తీవ్రతతో ఆ ఆందోళనలు సాగాయి.



బిజెపికి మాత్రమే ప్రధానా?

- హర్యానా, పంజాబ్ ఏమైనా సవతి పిల్లలా
- ప్రభుత్వ వైఫల్యం వల్లే హింసాకాండ
- రాజకీయ ఉద్దేశాలకు పట్టణాలను తగలేస్తారా?
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైనా నిప్పులు చెరిగిన హైకోర్టు



ఛండీగఢ్ : డేరా బాబా అరెస్టు తర్వాత హర్యానా, పంజాబ్‌లో చెలరేగిన హింసాకాండను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యంపై పంజాబ్–హర్యానా ఉమ్మడి హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. న్యాయస్థానం ఆగ్రహం నుంచి ప్రధానికి కూడా మినహాయింపు లభించలేదు. 'ఆయన (మోడీ) ఒక్క బిజెపికే ప్రధానమంత్రి కాదు, యావత్ భారతదేశానికి ప్రధాని' అని శాంతిభద్రతల పరిరక్షణలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బాధ్యతను న్యాయస్థానం గుర్తు చేసింది. శుక్రవారం జరిగిన హింస రాష్ట్రానికి సంబంధించిన వ్యవహారమంటూ కేంద్ర ప్రభుత్వం తరుపున వాదించిన అడిషనల్ సొలిసిటర్ జనరల్ సత్య పాజ్ జైన్ పేర్కొనడంతో కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 'హర్యానా భారతదేశంలో భాగం కాదా? పంజాబ్, హర్యానా ఏమైనా సవతి పిల్లలా?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. అత్యాచారం కేసులో గుర్మీత్‌ను దోషిగా తేలిన అనంతరం హర్యానా, పంజాబ్‌లో చోటుచేసుకున్న హింసాకాండ, ఇతర అంశాలపైనా శాంతిభద్రతలపైనా ఉమ్మడి హైకోర్టు పూర్తి స్థాయి ధర్మాసనం శనివారం ప్రత్యేక విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాన్ని న్యాయమూర్తులు తీవ్రంగా తప్పుబట్టారు. ప్రధానంగా హర్యానాలోని మనోహర్ లాల్ ఖట్టర్ ప్రభుత్వంపై న్యాయస్థానం నిప్పులు చెరిగింది. రాజకీయ ఉద్దేశ్యాలకు పంచకుల లాంటి పట్టణాన్ని తగలేస్తారా? అంటూ ఆగ్రహించింది.

గుర్మీత్‌ను దోషిగా ప్రకటించిన వెనువెంటనే కోర్టు వెలుపల ఆయన మద్దతుదారులు ఒక్కసారిగా హింసాకాండకు పాల్పడ్డారు. కార్లను తగులబెట్టారు. కోర్టు పక్కనే ఉన్న ఇళ్లపైనా దాడులకు పాల్పడ్డారు. నిమిషాల్లోనే హర్యానా, పంజాబ్‌లోని ఇతర పట్టణాలకు హింసాత్మక ఘటనలు విస్తరించాయి. ప్రభుత్వ, ప్రయివేటు ఆస్తులు పెద్ద ఎత్తున ధ్వంసమయ్యాయి. 31 మంది ప్రాణాలు కోల్పోయారు.

వందలాది మంది గాయపడ్డారు. ఇంత హింసాకాండ జరుగుతుంటే ప్రభుత్వ యంత్రాంగం ఏం చేస్తోందంటూ హైకోర్టు నిలదీసింది. 'పరిస్థితి హద్దు మీరిపోయేలా చేసింది మీరే. మీరు పరిస్థితికి పూర్తిగా లొంగిపోయారు' అంటూ హర్యానా ప్రభుత్వాన్ని కోర్టు ఆక్షేపించింది. హింసాత్మాక ఘటనల నియంత్రణా వైఫల్యానికి బాధ్యుణ్ని చేస్తూ పంచకుల డిసిపిని తొలగించడాన్ని కూడా హైకోర్టు తప్పుబట్టింది. 'పంచకుల డిసిపి వంటి చిరుద్యోగిని తొలగించి మీరు చేతులు దులిపేసుకుంటే సరిపోతుందా? తప్పుడు దిశానిర్దేశాలు జారీ చేసిన రాజకీయ నేతల సంగతేంటి?' అని హర్యానా ప్రభుత్వాన్ని న్యాయమూర్తులు నిలదీశారు. శుక్రవారం మధ్యాహ్నం సిర్సాలోని ఆశ్రమం నుంచి రామ్ రహీం కోర్టుకు వచ్చేటప్పుడు పెద్ద సంఖ్యలో కాన్వాయ్‌ని ఎందుకు అనుమతించారని కూడా హర్యానా ప్రభుత్వాన్ని కోర్టు ప్రశ్నించింది. డేరా బాబా భక్తగణంలో నేరగాళ్లు కలిసిపోయారని శుక్రవారం రాత్రి ముఖ్యమంత్రి ఎంఎల్ ఖట్టర్ చేసిన వ్యాఖ్యలను కూడా కోర్టు ప్రస్తావించింది. 'డేరా భక్తుల్లో నేరగాళ్లు కలిసిపోయారని మీ ముఖ్యమంత్రి అంటారు. దానర్థమేంటి. మేమేమీ చేయలేమని చేతులెత్తేశామని సంకేతమివ్వడమే కదా? మీరు ఇప్పటికీ వారినే (ఆందోళనకారులను) సమర్థిస్తున్నారు. ఇదంతా జరగడానికి కారకులు మీరే' అంటూ పంజాబ్, హర్యానా ప్రభుత్వాల తరుపున హాజరైన అడ్వకేట్ జనరల్స్ అతుల్ నందా, బలదేవ్ రాజ్ మహాజన్‌లను ఉద్దేశించింది హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

'కాకినాడ' ఎన్నికల్లో ధన ప్రవాహం

- ఓటుకు రూ.2 వేలు!
- అక్కడక్కడ కేసులు నమోదు
- పట్టించుకోని పాలనా యంత్రాంగం

ప్రజాశక్తి–కాకినాడ ప్రతినిధి

కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో ధన ప్రవాహం విచ్చలవిడిగా సాగుతోంది. ఎన్నికల ప్రచారానికి ఒకరోజు మాత్రమే గడువు ఉన్నందున ప్రచారంతో పాటు నోట్ల పంపిణీలో అభ్యర్థులు తలమునకలయ్యారు. అధికార పార్టీ నేతలు ఓటుకు రూ.2 వేలు, రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేస్తున్నట్లు తెలిసింది. ప్రతిపక్ష వైసిపి అభ్యర్థులు కూడా డబ్బుల పంపిణీలో భాగస్వాములవుతున్నారని సమాచారం. ఇదంతా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇప్పటికే నగరంలోని 48 డివిజన్లలోనూ టిడిపి, వైసిపిలు ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తోన్నాయి. ఎక్కువ డివిజన్లు కైవసం చేసుకోవాలనే ఉద్దేశంతో ఇరు పార్టీలు తమ అభ్యర్థులతో విపరీతంగా డబ్బు ఖర్చు చేయిస్తున్నాయి. అధికార టిడిపి నాయకులు ఒక్కో అభ్యర్థితో కనీసం రూ.25 లక్షల వరకూ ఖర్చు చేయిస్తున్నట్లు తెలిసింది. అధిష్టానం నుంచి రూ.10 లక్షల నుంచి రూ15 లక్షల వరకూ ఒక్కో డివిజన్‌కు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. మేయర్ అభ్యర్థి డివిజన్‌లో రూ.25 లక్షల వరకూ అభ్యర్థికి అందజేసినట్లు సమాచారం. ప్రతిపక్ష వైసిపి అభ్యర్థి నుంచి రూ.15 లక్షలు, పార్టీ నుంచి రూ.5 లక్షలు ఖర్చు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. అధికార పార్టీ నాయకులు, డివిజన్ ఇన్‌చార్జి డబ్బుల ఖర్చు, పంపిణీ ఎలా జరుగుతుందో పరిశీలించేటట్లు ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం.

రెండ్రోజులుగా రాత్రి వేళలో అన్ని డివిజన్లలోనూ డబ్బుల పంపిణీ జరిగినట్లు తెలిసింది. శనివారం ఉదయం కూడా అధికార పార్టీ నేతలు పంపిణీ చేస్తున్నట్లు పలువురు ఫిర్యాదులూ అందాయి. ఇప్పటికే కాకినాడ త్రీ టౌన్, ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్లలో డబ్బులు పంపిణీ చేస్తున్న కొందరిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్లు సమాచారం. 11, 12, 19, 20, 21, 50, 49, 3 డివిజన్లలో శనివారం ఉదయమే బహిరంగంగా డబ్బుల పంపిణీ జరిగిపోయినట్లు సమాచారం.

కొన్ని డివిజన్లలో వైసిపి అభ్యర్థులు టిడిపి డబ్బుల పంపిణీని అడ్డుకున్నారు. దీంతో అక్కడక్కడ ఘర్షణలు చోటుచేసుకున్నాయి. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరు పార్టీల నాయకులను చెదరగొట్టారు. 30వ డివిజన్‌లో వైసిపి మేయర్ అభ్యర్థిని ఓడించేందుకు అక్కడి టిడిపి అభ్యర్థి తరపున డబ్బుల పంపిణీ జరిగినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి వైసిపి నేతలు కాపు కాసి టిడిపి పంపకాలను అడ్డుకున్నారు. 20వ వార్డులో వైసిపి కార్యకర్తల డబ్బుల పంపిణీపై ఇంద్రపాలెం స్టేషన్‌లో కేసు నమోదైంది. అదేవిధంగా మద్యం విచ్చలవిడిగా సరఫరా అవుతోంది. ప్రతీ డివిజన్‌లోనూ మందు బాటిళ్ళు ముందుగానే డంప్ చేసి పంపిణీ చేసినట్లు సమాచారం. ఇప్పటికే కొన్ని డివిజన్లలో ప్రత్యర్థి అభ్యర్థులు మద్యం బాటిళ్ల పంపిణీపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టిడిపి బెదిరింపులు

కొన్ని డివిజన్లలో ప్రభుత్వ పథకాలు అందాలంటే ఓటు తమ పార్టీకే వేయాలని, లేనిపక్షంలో మీకు అందాల్సినవి కూడా అందవని టిడిపి నాయకులు బెదిరింపులకు దిగుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. జన్మభూమి కమిటీ సభ్యులు దౌర్జన్యం చేస్తూ ఇప్పుడున్న పథకాలు యధావిధిగా అమలు జరగాలంటే టిడిపికే ఓటు వేయాలని డిమాండ్ చేస్తున్నట్లు కాకినాడ జగన్నాధపురంలోని పలు డివిజన్లలో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్వే పేరుతో ..

సర్వే పేరుతో కొందరు వ్యక్తులు ఓటర్లను ఆధార్ కార్డు, బ్యాంకు వివరాలను అడుగుతున్నారని, తొలుత వివరాలు సేకరించి రాత్రికి వచ్చి కలుస్తామని చెబుతున్నట్లు ఫిర్యాదులందాయి. ఈ నేపథ్యంలో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 35వ డివిజన్‌లో ఈ బృందం పర్యటనపై వైసిపి అభ్యర్థి బెండా విష్ణుమూర్తి ఫిర్యాదుతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద పటిష్టమైన భద్రత

జిల్లా ఎస్‌పి గోపినాథ్‌జెట్టి

ప్రజాశక్తి – కర్నూలు క్రైం

నంద్యాల ఉప ఎన్నికల ఓట్లలెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తి చేస్తామని కర్నూలు జిల్లా ఎస్‌పి గోపినాథ్‌జెట్టి తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇవిఎంలను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచి ప్యారామిలటరీ దళాలతో పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశామని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన ప్రజలకు, రాజకీయపార్టీలకు, మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 28న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని, ఇందుకు సంబంధించి అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టి బలగాలను అప్రమత్తం చేశామన్నారు. లెక్కింపు సందర్భంగా ఒక అదనపు ఎస్‌పి, ఐదుగురు డిఎస్‌పిలు, 17 మంది సిఐలు, 38 మంది ఎస్‌ఐలు, 74 మంది ఎఎస్‌ఐ/హెడ్‌కానిస్టేబుల్స్, 250 మంది కానిస్టేబుల్స్, 20 మంది మహిళా కానిస్టేబుళ్లు, 44 ఏఆర్ సిబ్బంది, 10 స్పెషల్ పార్టీలు, 1 కంపెనీ సిఆర్‌పిఎఫ్ దళం, 5 ప్లటూన్‌ల ఎపిఎస్‌పి బలగాలను బందోబస్తుకు నియమించామన్నారు. గ్రామాల్లో అల్లర్లు జరగకుండా స్ట్రైకింగ్ ఫోర్స్, పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేశామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని ఈ సందర్భంగా ఎస్‌పి హెచ్చరించారు.

కాపులు బానిసలుగానే బతకాలా? : ముద్రగడ

ప్రజాశక్తి–కిర్లంపూడి, జగ్గంపేట(తూర్పుగోదావరి)

'కాపులు ఎప్పటికీ బానిసలుగానే బతకాలా? మాకు రిజర్వేషన్లు ఉండకూడదా? రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి మూడేళ్లుగా కాలయాపన చేస్తున్నారే కాపులపై మీకెందుకు పక్షపాతం?' అని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ముఖ్యమంత్రి చంద్రబాబుపై విరుచుకుపడ్డారు. ముద్రగడ చేపట్టిన పాదయాత్రను 30వ రోజూ పోలీసులు అడ్డుకోవడంతో గేటువద్ద శిబిరంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ కాపులకు ఇచ్చిన హామీని అమలుచేయాలని రెండున్నరేళ్ల నుంచీ రోడ్డెక్కి నిరసన తెలిపినా చంద్రబాబు పట్టించుకోవడం లేదన్నారు. కాపులతో పాటు ఇతర సామాజిక వర్గాల మద్దతు తీసుకుని చలో కిర్లంపూడికి తరలివచ్చేలా చూడాలని నేతలను కోరారు. కిర్లంపూడికి వచ్చే కాపులపై కూడా కేసులు పెట్టి, వాహనాలను సీజ్ చేసి భయభ్రాంతులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మీ మీటింగ్‌లకు భారీగా వాహనాలు తరలించుకుంటూ, ఆందోళనకు మద్దతు పలకడానికి వచ్చే వారిని పోలీసుల చేత వేధింపులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీలను అమలు చేయకపోతే కాపులు చంద్రబాబుకు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో కాపు జెఎసి నాయకులు ఆకుల రామకృష్ణ, వాసిరెడ్డి ఏసుదాసు తదితరులు తదితరులు పాల్గొన్నారు. ముద్రగడకు మద్దతుగా మహిళలు, కాపులు కిర్లంపూడిలో రహదారిపై రాస్తారోకో చేశారు.



కిర్లంపూడిలో మాట్లాడుతున్న ముద్రగడ

వామపక్షాలు, స్వతంత్ర అభ్యర్థులను గెలిపించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి–కాకినాడ

కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వామపక్షాలు, స్వతంత్ర అభ్యర్థు లను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దడాల సుబ్బారావు ప్రజలను కోరారు. 2, 20వ డివిజన్లలో సిపిఎం అభ్యర్థులు తిరుమలశెట్టి నాగేశ్వర రావు, జిఎస్‌అర్.కష్ణకు మద్దతుగా ఆయా డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో వామపక్ష నాయకులు ప్రచారం చేశారు. 35వ డివిజన్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న దూసర్లపూడి రమణ రాజుకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా దడాల సుబ్బారావు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న టిడిపి, బిజెపిలకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. స్మార్ట్‌సిటీ పేరు గొప్పగా ఉన్నా అభివృద్ధి ఎక్కడా లేదని విమర్శించారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో కొద్దిపాటి వర్షానికే ప్రధాన రోడ్లు మోకాళ్ల లోతులో నడవాల్సి వస్తుందని చెప్పారు. ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించేందుకు ఎన్నికల్లో వామపక్షాలు, ఇండిపెండెంట్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



కాకినాడలోని 20వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుబ్బారావు, వామపక్ష నేతలు

ప్రేమజంట ఆత్మహత్య

ప్రజాశక్తి – పొందూరు

ప్రేమ విషయం పెద్దలకు తెలిసి వారిని విడదీయడంతో తట్టుకోలేక ఇద్దరు ప్రేమికులు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన శ్రీకాకుళం జిల్లాలో శుక్రవారం చోటుచేసుకుంది. ఘటనలో రాజాం మండల కేంద్రానికి చెందిన ఇజ్జవరపు విజయ్‌కుమార్(19), పొందూరు మండల కేంద్రంలోని ఆగండి వీధికి చెందిన ఆచంటి మహాలక్ష్మి(19) మృతిచెందారు. డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విజయ్‌కుమార్, మహాలక్ష్మి రాజాంలోని జిసిఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో గతేడాది డిగ్రీ ప్రథమ సంవత్సరం చదివినప్పుడు ప్రేమ మొదలైంది. వీరి ప్రేమ విషయం మహాలక్ష్మి తల్లిదండ్రులకు తెలియడంతో నెల రోజుల కిందట జిసిఎస్‌ఆర్ కళాశాల నుంచి ఆమె టిసి తీసుకొని, శ్రీకాకుళంలోని సన్ డిగ్రీ కళాశాలలో చేర్పించారు. ఈ ఘటనతో విజయ్‌కుమార్‌ను జిసిఎస్‌ఆర్ కళాశాల యాజమాన్యం నెల రోజుల పాటు సస్పెండ్ చేసింది. ముందుగా అనుకున్న ప్రకారం శుక్రవారం వేకువజామున మూడు గంటల సమయంలో తన తండ్రి ద్విచక్రవాహనంపై పొందూరుకు వచ్చి తను ఉన్న చోటుకు రావాలని మెసేజ్ చేశాడు. ఇంట్లో ఎవరికీ తెలియకుండా మహాలక్ష్మి అక్కడకు చేరుకున్నాక 3.10 గంటలకు వారిరువురూ తమ తల్లిదండ్రులకు 'మేము చనిపోతున్నాం. మా చావుకు ఎవరూ బాధ్యులు కాదు. దయచేసి మా తల్లిదండ్రులను పోలీసులు ఇబ్బంది పెట్టొద్దు' అని మెసేజ్ పెట్టి, విశాఖపట్నం నుంచి పలాస వైపు వెళ్లే రైలు కింద పడి మృతిచెందారు.



మహాలక్ష్మి



విజయ్‌కుమార్

టిడిపి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో నాలుగు చోట్ల శిక్షణా తరగతులు నిర్వహిస్తోంది. 2019లో ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అప్పటి వరకూ ఈ కేంద్రాలను కొనసాగించేందుకు ఆ పార్టీ అధిష్టానం నిర్ణయించినట్టు సమాచారం. నిష్ణాతులైన ప్రొఫెసర్లకు తరగతుల బాధ్యత అప్పగించినట్లు తెలిసింది. విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలకు విజయనగరంలోనూ, కృష్ణా, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు పశ్చిమగోదావరి జిల్లా తణుకులోనూ, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, కడప జిల్లాలకు తిరుపతిలోనూ, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాలకు ప్రకాశం జిల్లా కందుకూరులోనూ శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో భోజనం, వసతి సదుపాయాలతోపాటు వారిని ఆకర్షించేందుకు అపోలో ఆసుపత్రి యాజమాన్యంతో 25 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు సమాచారం.

కవిత్వం



పోస్టుమార్టం

ఒక్కరా ఇద్దరా
ఊరు ఊరంతా
దిక్కులు పిక్కటిల్లేలా
విలపిస్తుందక్కడ !
వీధికొక పసిప్రాణాన్ని
కృష్ణాష్టమి ఉట్టి పాడెక్కిస్తూ
ప్రాణవాయువునందించలేని రాజ్యానికి
చావు కూడా వేడుకయ్యిందిప్పుడు!

రేపటి పౌరులకు ప్రాణ రక్షణనీయలేని
ప్రభుత్వాన్ని ఉరికంబానికి వేళ్ళాడదీయకుండా
చోద్యం చూస్తున్న ప్రజాస్వామ్యమా నువ్వెక్కడ?
అరక్షణానికో చావులోనా?
ప్రాణవాయువందక ప్రాణాలు విడిచిన శిశువుల్లోనా?
అర ఘడియకో అత్యాచార రాజ్యంలోనా?
అణగారిన జాతుల ఆకలి ఆక్రందనల్లోనా?
ఎక్కడ? నీ జాడెక్కడ?

అన్నీ శవ పంచనామాలే ఇక్కడ
పేరుకే ప్రజాస్వామ్యం
భూమి పరిధి విస్తృతమౌతున్న కొద్దీ
అభివృద్ధి కుంటి నడక నడుస్తోందిక్కడ
స్వేచ్ఛావాయువు నందించలేని రాజ్యమిప్పుడు
పసిబిడ్డల చావుల మోతను అలంకరించుకుని
70 ఏళ్ల స్వతంత్ర్యాన్ని పరిహసిస్తోంది
రండి .. చూసి తరిద్దాం
ఇదే ఇదే మన ప్రజాస్వామ్య రాజ్యమని
నాలుగక్షరాలు రాసుకుని
నాలుగు కన్నీటి చుక్కల నివాళులర్పిద్దాం!!

– వైష్ణవి శ్రీ

89772 37345

రచనలకు ఆహ్వానం

ప్రజాశక్తి సవ్వడి పేజీలో ప్రచురణార్థం రచయిత (త్రు)ల నుంచి రచనలు ఆహ్వానిస్తున్నాం. ప్రగతిశీల సాహిత్యంపై వ్యాసాలూ, సమీక్షలు; సమకాలీన సాహిత్య ధోర ణులపై విశ్లేషణలూ రాసి పంపవచ్చు. కళారంగంపైనా, నాటకాలపైనా విశ్లేషణలు రాయవచ్చు. రచనలను ఈమెయిల్లో కూడా పంపించవచ్చు. కాపీలను పేజీ మేకర్ ఫైలుతో పాటు పిడిఎఫ్‌గా మార్చి పంపాలి.

email id : **prajasavvadi@gmail.com**

సందర్భం

ఆకాశవాణి సాహితీ సేవ

ఆకాశవాణి తెలుగు సాహిత్యానికి చేసిన కృషి గురించి సాహిత్య అకాడమీ హైదరాబాదులో ఈనెల 28, 29 తేదీల్లో ఒక సదస్సు నిర్వహిస్తోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆకాశవాణి చేసిన సారస్వత కృషిని రేఖామాత్రంగా వివరించే ప్రయత్నం ఈ వ్యాసం.

1938లో మొదలైన అప్పటి మదరాసు (నేటి చెన్నయ్) కేంద్రం నుంచి పలు ఆకాశవాణి కేంద్రాలు విభిన్నమైన కృషి చేస్తున్నాయి. ఎవరైనా ఆసక్తిగల పరిశోధకులు దీనికి సంబంధించి ఎంతో దృష్టిపెట్టవచ్చు. ఆకాశవాణి ఏటా దేశంలోని అన్ని ప్రధాన భాషల కవిత్వంతో సమ్మేళనం నిర్వహిస్తూ, అనువాదం సహా అందుబాటులోకి తెస్తోంది. కొన్ని సంవత్సరాల సమ్మేళనాలు పరిశీలించి ఒక్కో భాషలోని ధోరణులను చెప్పవచ్చు. భాషా అనువాదాల పోకడల గురించి మరింత విస్తృతంగా పరిశోధించవచ్చు. హైదరాబాద్ నుంచి వెలువడే 'మూసి' మాసపత్రిక దశాబ్దానికి మించి ఏటా ఫిబ్రవరి లేదా మార్చి సంచికలో ఆ సంవత్సరం మొత్తం అనువాద కవితలను ప్రచురిస్తోంది. ఆసక్తిగల కవి తన కవిత 22 భాషల అనువాదాలను సేకరించి ఒక పుస్తకంగా ప్రచురించుకుని, దేశంలోని భాష వైవిధ్యాన్నీ, దాంతోపాటు ఉండే ఏకీభావాన్నీ చాటవచ్చు. చాలామంది కవులు తమ రేడియో కవితలను సంకలనాలుగా వెలువరించారు. కవితారూపం, కవిధోరణి, మొగ్గ వంటి విషయాల్లో కూడా సమభావం, ఉదారవాదం రేడియోలో కనబడుతుంది. ఏ ఆకాశవాణి కేంద్రంలోనైనా ఎవరికివారు ప్రయోగాలు చేశారు. చేస్తున్నారు.

1991–92 కాలంలో అనంతపురం జిల్లా వయోవృద్ధులైన, ప్రముఖులైన కవులతో పెనుకొండ గ్రామంలో కవి సమ్మేళనం జరిపింది. 2012లో ప్రతి రేడియో కేంద్రం నుంచి ఒక కవి చొప్పున ఆహ్వానించబడిన వారితో హైదరాబాద్‌లో కవిసమ్మేళనం జరిగింది. 1999 దీపావళికి విజయవాడ ఆకాశవాణి తొమ్మిది మంది సినిమా కవులతో కవి సమ్మేళనం ఏర్పాటు చేస్తే – అంతమంది ప్రేక్షకశ్రోతలు మరే కవి సమ్మేళనానికి రాలేదు. ఇందుకు మరుసటిరోజు తెలుగు పత్రికల వార్తలే సాక్ష్యం. 2005లో విశాఖ ప్రాంత నేపథ్యంగా అంగళకుర్తి విద్యాసాగర్ రాసిన 13 కవితలు ధారావాహికంగా విశాఖపట్నం కేంద్రం నుంచి ప్రసారమయ్యాయి. ఇందులో చేసిన చమత్కారమేమిటంటే విద్యాసాగర్ తన కవిత వినిపిస్తారు. తరువాత కవిత నేపథ్యం, ధోరణి, వస్తువు, శిల్పం, లక్ష్యం వంటి విషయాల గురించి ఐదు నిమిషాల పరిచయంలో చర్చించేవాడిని. ఒక రకంగా ఇది కవితాస్వాదనను, అభిరుచిని పంచడమే! దీనినే పూర్తిస్థాయిలో ఒక కావ్యానికి చేశాను. కవిత్వంతోపాటు మాధ్యమం, లోటుపాట్లు తెలిసిన కవి విద్యాసాగర్. కనుక విశాఖ నా విశాఖ ప్రయోగం బాగా రక్తి కట్టింది. డాక్టర్ సి.నారాయణరెడ్డి, డాక్టర్ గోపి జలగీతం హైదరాబాదు ఆకాశవాణిలో ధారావాహికంగా ప్రసారమయ్యాయి. 2011 జనవరి నుంచి జాతీయ కవిసమ్మేళనం తెలుగు అనువాదం ఉదయం పున:ప్రసారం ప్రారంభించాం. నిజానికి ఈ జాతీయ కవిసమ్మేళనం అనేది సంబంధిత అధికారి సామర్థ్యానికి ఒక పరీక్ష. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి రూపొందించే కార్యక్రమం. రాత్రి 11 గంటల 10 నిమిషాలకు మొదలై అర్ధరాత్రి తర్వాత ముగుస్తుంది. దీనిని జనవరి 26 ఉదయం రెండు, మూడు భాగాలుగా పున:ప్రసారం చేయాలనీ నిర్ణయించి, ప్రారంభించాం.

ఈ శతాబ్ది తెలుగు కవిత్వం వంటి పేరుతో నాగభైరవ కోటేశ్వరరావు నాలుగు భాగాల ప్రసంగమాలిక 2001లో విజయవాడ ఆకాశవాణిలో చేశాం. 20వ శతాబ్దపు ప్రముఖ కవులు కలసి 'భువన విజయం' లాంటి సదస్సులో పాల్గొంటే ఎలా ఉంటుందనే భావనతో 2000 జనవరిలో విజయవాడ బుక్ ఎగ్జిబిషన్ ప్రాంగణంలో ఆకాశవాణి నిర్వహించింది. ఈ కొత్త తరహా భువనవిజయాలు ఒకటి, రెండు సంవత్సరాల పాటు రకరకాల ఆలోచనలతో తెలుగు పట్టణాల్లో స్వైరవిహారం చేయడానికి బీజం ఈ కార్యక్రమమే! ఒంగోలు పట్టణంలో 'శతవసంత కవితారవళి' కార్యక్రమాన్ని 2001లో నిర్వహించాం. అది కూడా విభిన్నమైనదే! ఇలా తెలుగు ప్రసారాలున్న 12 కేంద్రాలతోపాటు తెలుగు కార్యక్రమాలున్న మద్రాసు, అండమాన్, బెంగుళూరు వంటి చోట్ల కూడా ఎంతో కవిత్వం ప్రసారమవుతోంది. కవిత్వ అనుబంధమైన ప్రసంగాలు, పరిచయాలు, చర్చలు రూపొందించబడుతూ ఉంటాయి. యువవాణి, మహిళామండలి, వయోవృద్ధుల కార్యక్రమం, కార్మికుల కార్యక్రమం... ఇలా పలుచోట్ల విభిన్న నేపథ్యాలు, విభిన్న వయసున్న కవులు, కవయిత్రులు పాల్గొనడం అన్ని రకాల వైవిధ్యాన్ని సంతరింపజేస్తోంది.

రేడియోలో కథాసాహిత్యం

రేడియోకు కథ అనే ప్రక్రియ అతికినంత మరే ప్రక్రియ అతకదు. ఈ టెక్నాలజీ అంతా రాకముందు కేవలం అవ్వ కథ చెప్పడమన్నది మనకు తెలుసు. ఎక్కువ మందికి చెప్పగలిగే వీలుండేది రేడియో కథ. చదివే కథ, వినే కథ, చూసే కథ అని స్థూలంగా విభజించవచ్చు. ఇందులో ఒకటవదీ, మూడవదీ కావాలంటే పాఠకుడి లేదా వీక్షకుడి చూపు కావాలి. పత్రికలు లేదా పుస్తకంలో అందుబాటులోకి వచ్చే కథ అక్షరాస్యులకు మాత్రమే! కెమేరా చెప్పేది – చూసేకథ, చూపు లేకుండా వినగలిగే సౌకర్యం మాత్రం ఉన్నవారికి వినే కథ. కనుక ఈ కథల నిర్మాణం వేరుగానే ఉంటుంది. మధురాంతకం రాజారాం, రావూరి భరద్వాజ, పోరంకి దక్షిణామూర్తి, గొల్లపూడి, నగ్నముని, సింగంనేని నారాయణ కథలు వినడానికి చక్కగా ఉంటాయి. అలాంటి కథ రాయాలంటే రచయిత మనోఫలకం నుంచి కాగితం చేరే ముందు రేడియోకు అవసరమైన హంగులు ధరించాలి. మామూలుగా కథే ఎక్కువ మంది శ్రోతలను ఆకట్టుకోగలదు మిగతా ప్రక్రియల కన్నా. వస్తువు, కథనం, శ్రోతలకు అందించే వైనం ఆధారంగా రేడియోల్లో కథ రంజింపజేయాలి. ఒక అంచనా ప్రకారం ఆకాశవాణిలో కవితల కన్నా కథలే ఎక్కువ ప్రసారమై ఉండవచ్చు. 1990– 91 నుంచి ఆదిలాబాదు, మార్కాపురం, అనంతపురం వంటి చోట్ల ఆకాశవాణి కేంద్రాలు రావడంతో లెక్కకు మించిన సంఖ్యలో కథలు ప్రసారమవుతున్నాయి. ఒక కథా రచయిత తన గొంతుకతోపాటు ఎక్కువ మందిని చేరడానికి తొలుత దోహదపడే సాధనం ఆకాశవాణి. పూర్తి సమాచారం లేకుండా అంచనా వేయడం సబబు కాదు కానీ, గత పాతికేళ్లలో అన్ని తెలుగు ఆకాశవాణి కేంద్రాలూ వేలాది కథలను ప్రసారం చేసే ఉంటాయి. థీమ్ ఇచ్చి కథలు రాయించడం ఒక విధానం. నలుగురైదుగురు ఒక్కో వారం ఒక్కొక్కరుగా కథ నడపడం గొలుసు కథ. కథాతోరణాలు, కథాసమ్మేళనాలు నిర్వహించని ఆకాశవాణి కేంద్రం లేదంటే నమ్మలేం. కథలు నాటికలుగా మారిన సందర్భాలున్నాయి. కథా సంకలనాలకు రాయల్టీ చెల్లించి ధారావాహికంగా చదివిన సంఘటనలున్నాయి.

కథా సాహిత్యానికీ, కథాపరిణామానికీ సంబంధించిన ప్రసంగాలు, పరిచయాలు, చర్చలు మాత్రమే కాకుండా సదస్సులు, సమ్మేళనాలు నిర్వహించిన కేంద్రాలున్నాయి. టెక్నాలజీపరమైన పరిమితులు రేడియోకు పత్రికలతో పోల్చినపుడు ఉండటంతో రేడియో ప్రసారం చేసిన అంశాలను వ్యక్తులు దాచుకున్న సందర్భాలు ఇటీవల కాలంలో పెరిగాయి కానీ, గతంలో లేవు. రేడియో కథను కథకులే చదువుతారు. కనుక మాండలిక భాషను వినడానికిగానీ, అర్థం చేసుకోవడానికిగానీ శ్రమ ఉండదు. ఈ రెండు కారణాలతో రేడియో కథలో భాషాపరమైన వైవిధ్యం విశేషంగా ఉంటుంది.

కథలను ఆకాశవాణి నేరుగా ఆహ్వానించి, ప్రసారం చేసిన తరువాత అవి పత్రికలలోనో, పుస్తకాలలోనో చేరతాయి. నవలల విషయంలో వ్యతిరేక దిశ కనబడుతుంది. రేడియోకు నవలలు రాసిన దృష్టాంతాలు పెద్దగా కనబడవు. ప్రజాదరణ పొందిన నవలలు ఎన్నో ఆకాశవాణి ద్వారా మరింత ప్రాచుర్యం పొందాయి. దీనికి మినహాయింపు లేకపోలేదు. విజయవాడ ఆకాశవాణి విశ్వనాథ సత్యనారాయణతో 'బద్దన్న సేనాని' నవలను చదివించి ప్రసారం చేసింది. 'నవలాస్రవంతి' అనే మాట నవలాపరంగా ఆకాశవాణి రూపొందించింది. శారదాశ్రీనివాస్, చిరంజీవి వంటివారు ఆకాశవాణిలో చదివిన నవలలు ఇప్పటికీ ఎంతో మంది మనోఫలకంపై ప్రతిధ్వనిస్తున్నాయి. సీమకథలు సంకలనం వెలువడి దశాబ్దం గడచిన నేపథ్యంలో 2004లో ఆకాశవాణి అనంతపురం ద్వారా అవి చదివించబడ్డాయి. ఆకాశవాణి కడప కేంద్రం 2012లో పున:పరిచయం చేసింది.

రేడియోకే పరిమితమైన 'రేడియో కార్టూన్' బాగా రక్తికట్టింది. రెండు, మూడు గొంతులతో మూడు నాలుగు నిమిషాల వ్యవధిలో చక్కని మాండలికంతో 'ఔరా' అనిపించి మురిపించేది రేడియో కార్టూన్. ఇది తక్కువ వ్యవధి కార్యక్రమం కావచ్చుగానీ రేడియో మాధ్యమం మర్మాలు తెలిసికొన్న వారే దీనిని పరిశీలించగలరు. గాడేపల్లి సూర్యనారాయణ (వీరి కుమార్తెను దేవులపల్లి కృష్ణశాస్త్రి వివాహం చేసుకున్నారు), ప్రయాగ నరసింహశాస్త్రి మద్రాసులో ప్రారంభించిన 'బావ గారి కబుర్లు' ప్రాచుర్యం పొందడమే కాదు, ఇతర కేంద్రాలకూ వ్యాపించాయి. ఆదివారం కార్మికుల కార్యక్రమంలో ముగ్గురి మధ్య నడిచే సంభాషణ కూడా శ్రోతలకు బాగా గుర్తుంది. ఇలాంటి ప్రయోగాల ద్వారా రేడియో భాష, వ్యక్తీకరణ ఏమిటో తెలుసుకోవచ్చు. ఇలాంటిదే పాడి పంటలు సంభాషణ కూడా! వీటిల్లో వ్యక్తిపరమైన పరిమితులుగానీ, నైపుణ్యాలుగానీ కార్యక్రమాలను విశేషంగా ప్రభావితం చేస్తాయి.

రేడియో నాటకాల గురించి కొంత అధ్యయనం జరిగింది. శ్రీశ్రీ, గోరాశాస్త్రి, పివి రాజమన్నారు మొదలుకుని ఎంతోమంది రేడియోకు నాటికలు, నాటకాలు సృజించారు. ఆయా రేడియో నాటకాల రాత ప్రతులను ప్రచురించారు కూడా. ఏటా రేడియో నాటకోత్సవం పేరున వివిధ కేంద్రాల నాటకాలు ఇవ్వడం పరిపాటి అయింది. సైన్స్ ఫిక్షన్ విషయంలో ఆకాశవాణి ముఖ్యంగా హైదరాబాదు, విజయవాడ కేంద్రాలు చేసిన కృషి విశేషమైంది. సంగీతం ఆధారంగా సృజించబడిన సాహిత్యం, అన్నమయ్య కీర్తనలు, భద్రాచల రామదాసు కీర్తనలు వగైరా ఆకాశవాణి ద్వారా బహుళ ప్రచారం పొందాయి. ఇది భక్తి సంగీతం కాగా లలిత సంగీతం, సంగీత రూపకాల గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ఎంతోమంది కవులకు గొప్పకీర్తిని సాధించింది. లలిత సంగీతం, సంగీత రూపకాలు అంటే దేవులపల్లి కృష్ణశాస్త్రి వేసిన రాచబాట నేటికీ ఏ కొలబద్దతో అయినా అవి ప్రామాణికాలే. కందుకూరి రామభద్రకవి, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ వంటివారు రాసిన రూపకాలు ఎంతోమందికి గుర్తే. శాస్త్రీయసంగీతం, జానపద సంగీతం వంటివాటికి ఆకాశవాణి ఇచ్చిన తోడ్పాటు, ప్రాచుర్యం విశేషమైంది.

డాక్యుమెంటేషన్ మరింత కావాలి

రేడియో పూర్తిగా కొత్త మాధ్యమం. మాట్లాడటం మనకు తెలిసి ఉండవచ్చు. మౌఖికంగా సమగ్ర ప్రక్రియల ద్వారా సమగ్ర జ్ఞానాన్ని నూతన సాంకేతిక విజ్ఞానాన్ని మేళవించుకుంటూ సాగడంతో వ్యక్తుల కృషి విశేషమైనది, విలక్షణమైనదీ! ఆసక్తి, అవలోకన, దార్శనికత, ప్రణాళిక, పరిశ్రమ, సృజన కారణంగా మాత్రమే రేడియోలో ప్రముఖులందరూ రాణించారు. ఈ లక్షణాలు అప్పటికి సిద్ధంగా లేవు. అందువల్లనే నేటికీ ఈ రంగాల్లో నూతనంగా అడుగిడేవారికి సరైన మేధోవసతులు లేవనే చెప్పాలి. పుస్తకాలు కూడా ఎక్కువ సంఖ్యలో లేవు. విద్యాపరమైన కోర్సులు కూడా సంతృప్తికరంగా లేవు. అందువల్ల రేడియో ప్రముఖులు రాసిన జ్ఞాపకాలు, అనుభవాలు వంటివి మాత్రమే కొన్ని ఉన్నాయి. 'కథానిలయం' లాగా ఆకాశవాణికి సంబంధించి పుస్తకాలు, వ్యాసాలు వగైరా ఎవరైనా సేకరిస్తే చాలా బావుంటుంది.

– డాక్టర్ నాగసూరి వేణుగోపాల్

94427 32392

స్మరణ

శత వసంతాల ప్రజా కళామూర్తి

'అలనాటి భరతుడు మొదలుకొని ఈనాటి డాక్టర్ పోణంగి శ్రీరామ అప్పారావు వరకూ వెలువడిన గ్రంథాలను పరిశీలించి, వివిధ నాటకరంగ ప్రయోక్తలు, ప్రవక్తలు అందించిన అనుభవ సారాన్ని ఆస్వాదించి, సమస్తాంధ్ర దేశంలోని నాటకరంగ రీతులను, జానపద కళారూపాలను స్వయంగా సమాలోకించి, ఎన్నెన్నో విషయాలను దారి బత్తెంగా స్వీకరించి, చివరికి గమ్యం చేరుకున్న అవిశ్రాంత యాత్ర.... మిత్రులు మిక్కిలినేని రచించిన ఈ చరిత్ర.'



రంగస్థల, సినీనటుడు మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి రచించిన 'ఆంధ్ర నాటక రంగ చరిత్ర' గురించి, సాహితీదిగ్గజం, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా॥ నారాయణరెడ్డి కితాబు అది.

రెండు తరాల ముందువరకు, తెలుగు చలన చిత్ర పరిశ్రమలోని నటీనటుల్లో అత్యధికులు, నాటకరంగం నుంచి వెళ్లినవారే. అలా వెళ్లినవారిలో కన్నతల్లి వంటి రంగస్థలం గురించి పట్టించుకున్నవారు మాత్రం అరుదు. కానీ, తాను ఓనమాలు దిద్దిన నాటకరంగం గురించి, తెలుగు సినీ రంగంలో ఏ ఒక్కరు చేయని (చేయలేని) నిరుపమాన కృషి చేసిన చరితార్థుడు డాక్టర్ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి.

1916 ఆగస్టు 26వ తేదీన గుంటూరు జిల్లా లింగాయపాలెంలో ఆయన జన్మించారు. ఎదిగింది, చదివింది అంతా కృష్ణా జిల్లా కొలవెన్ను గ్రామంలో. పాఠశాల విద్యార్థి దశలోనే ఆయనలో నటనాభిలాష మొగ్గ తొడిగింది. తొలినాళ్లలో అనేక నాటకాల్లో స్త్రీ పాత్రలు కూడా ధరించి ప్రశంసలందుకున్నారు. యువకునిగా జాతీయోద్యమంలో పాల్గొని పలుమార్లు జైలుశిక్ష అనుభవించారాయన. స్వాతంత్ర్యోద్యమంతో పాటు, ఆనాటి యువకులను ప్రభావితం చేసిన యువజనోద్యమం, గ్రంథాల వైజ్ఞానిక, వయోజన విద్యా ప్రచార ఉద్యమాల్లో క్రియాశీల పాత్ర వహించారు.

స్వాతంత్ర్యానికి పూర్వమే తెలుగునాట కళాభిమానులను ఉర్రూతలూగించింది పద్యనాటకం. అది వ్యాపారాత్మకంగా మారిపోయి, కళాత్మక విలువల్ని కోల్పోతున్న దశలో, అసలైన జానపద ప్రజా కళారూపాలను ఆధునికాభ్యుదయ విలువలతో మేళవించి నాటకాలను ప్రదర్శించింది ఆంధ్ర ప్రజానాట్యమండలి. అప్పటికి స్వతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహిస్తోన్న కాంగ్రెస్ భావజాలానికి, సిద్ధాంతాలకు దూరమైన మిక్కిలినేని కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాల పట్ల ఆకర్షితులయ్యారు. డా॥ గరికపాటి రాజారావు, కోగంటి గోపాలకృష్ణయ్య, చదలవాడ, పెరుమాళ్ళు, కోసూరి పున్నయ్య, కోడూరి అచ్చయ్య వంటి ప్రజా కళాకారులతో కలిసి ఆంధ్ర ప్రజా నాట్యమండలి ఆవిర్భావంలో ప్రధాన పాత్ర వహించారు. వీధి నాటకం, బుర్రకథ, జముకుల కథ, కోలాటం వంటి జానపద కళారూపాల కళాకారునిగా పలు ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన పలు శిక్షణ శిబిరాల్లో పలువురు కళాకారులకు శిక్షణ ఇచ్చారు. 'మా భూమి', 'ముందడుగు', 'పరివర్తన', 'ఈనాడు', 'పోతుగడ్డ' వంటి గొప్ప నాటకాల్లో నటించారు.

ఆంధ్ర నాటక రంగ చరిత్రలో కీలక మలుపుగా నిలిచిన ఆంధ్రనాటక కళా పరిషత్ కార్యవర్గ, సలహా సభ్యులుగా అనేక ఏళ్ల పాటు పని చేశారు. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ సభ్యులుగా, అకాడమీ అనుబంధ విభాగాలైన రీసెర్చ్, ట్రైనింగ్, పబ్లికేషన్ శాఖలకు స్టాండింగ్ కమిటీ సభ్యునిగా వ్యవహరించారు. జానపద కళారూపాల చరిత్ర పట్ల ఆయనకు ఉన్న అపారమైన అవగాహనను గుర్తించిన కేంద్ర సంగీత నాటక అకాడమి, ఆయన్ని మద్రాస్ సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో 'తోలుబొమ్మలాట' విభాగానికి అడ్వైజరీ కమిటీ సభ్యునిగా నియమించింది. ఓపక్క సినిమాల్లో నటిస్తూనే, నాటక రంగానికి సంబంధించిన పలు అధికార, అనధికార సంస్థల్లో పని చేయడం, తన అనుభవ సంపదను కళల పరిరక్షణకు వినియోగించడం– ఆయనలోని కళారాధనకు నిదర్శనం. చారిత్రక ఆధారాలతో ఆయన రాసిన 'ఆంధ్ర నాటక రంగ చరిత్ర' గ్రంథానికి తెలుగు భాషా సమితి అవార్డును బహూకరించింది. అప్పటి 'ఆంధ్రప్రభ' వారపత్రిక సంపాదకులు విద్వాన్ విశ్వం ప్రోద్బలంతో 'నటరత్నాలు' శీర్షికన వందలాదిమంది తొలి తరం నటీనటుల, జీవిత విశేషాలను తెలుగు పాఠక లోకానికి అందించారు. సమాచార సాంకేతికాభివృద్ధి లేని ఆరోజుల్లో ఈ విశేషాల సేకరణకు మిక్కిలినేని పడిన శ్రమ అనితరసాధ్యమైనది. ఈ కృషిని గుర్తించిన ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆయనకు 'కళాప్రపూర్ణ' బిరుదునిచ్చి సత్కరించింది.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నేపథ్యంలో కమ్యూనిస్ట్ పార్టీ కార్యకలాపాలపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఆ కాలంలో అనేకమంది ప్రజానాట్యమండలి కళాకారులు సినీ పరిశ్రమకు తరలిపోయారు. ప్రజానాట్య మండలి ప్రముఖులైన తాతినేని ప్రకాశరావు దర్శకత్వంలో 1948లో నిర్మించిన 'దీక్ష' చిత్రం ద్వారా మిక్కిలినేని సినీరంగ ప్రవేశం చేశారు. అది మొదలు అనేక సాంఘిక, జానపద, పౌరాణిక చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి మంచి నటునిగా గుర్తింపు పొందారు.

పాండవ వనవాసం, నర్తనశాల చిత్రాల్లో 'కంకుభట్టు', 'దుశ్శాసనుడు' వంటి విభిన్న మనస్తత్వాల మిక్కిలినేని నటన ప్రశంసనీయం. ఏ పాత్ర పోషించినా సజీవమైన నటనతో తన గుర్తింపును కాపాడుకున్నారు. 'తెలుగు సినిమా రంగ చరిత్ర' రచించారు. తనను ప్రజా కళా ఉద్యమకారునిగా తీర్చిదిద్దిన ఆంధ్ర ప్రజానాట్య మండలి ప్రస్థానాన్ని తెలిపే 'ప్రజా పోరాటాల రంగస్థలం : ఆంధ్ర ప్రజానాట్యమండలి' పేరిట అలనాటి ఉద్యమ విశేషాలను గ్రంథస్థం చేశారు. అన్ని వర్గాల నాటకరంగ ప్రియులను విజ్ఞానవంతులను చేసే 'ఆంధ్ర నాటకరంగ చరిత్ర', 'నటరత్నాలు' రచనలతో తెలుగు నాటక రంగ చరిత్రలో తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. తొలినాళ్ల క్రమశిక్షణ, ఆహార నియమాలతో ఆరోగ్య సంపన్నుడైన ఆయన 95 ఏళ్లు జీవించి, 2011 ఫిబ్రవరి 21వ తేదీన కన్నుమూశారు. తన జీవనయాత్రకు వాహికగా పనిచేసిన నాటకరంగం రుణం తీర్చుకున్న మిక్కిలినేని విశేష కృషి తెలుగు నాటక రంగం ఉన్నంతవరకూ దేదీప్యమానంగా వెలుగొందుతూనే ఉంటుంది.

(ఇది మిక్కిలినేని శతజయంతి ముగింపు వత్సరం)

– బివి.అప్పారావు

9347039294

అక్షరం



కవిత్వం ఎవరికోసం ...?

కవి అని ఎవరినంటారు? కవిత్వం రాసినవారంతా కవులేనా? కవి అని అనిపించుకోవడం ఒక హోదా కావచ్చు. కానీ సమాజంలో జరుగుతున్న పరిణామాల పట్ల స్పందించని, స్పందించడానికి ప్రయత్నించిన సృజనకారులు కవులవుతారా? కవిత్వం ఎందుకు, ఎవరికోసం రాయాలో, రాస్తున్నారో..!? ఇత్యాది ప్రశ్నలకు సరైన సమాధానాలు దొరక్క – వస్తువు ఆలోచనయితే ఆ ఆలోచనలు నడిపించేది కవి అవుతారా? అనుకొంటూ – తెలియని తనంతో నవ కవుల్లో జనాన్ని బాధించే స్తబ్దత నెలకొంటున్నదని అనుకోవాలేమో....!? మనిషి జీవితం వేగాన్ని పుంజుకున్నాక, పరిమాణ ప్రమాణంగా కవిత్వ రూపంలో మార్పు వచ్చింది. కవిత్వం చదవడానికి ఎక్కువ స్థలమూ సమయమూ దొరకని పరిస్థితీ కలిసి కవిత్వాన్నీ కాస్తంతా వెనుకబాటు తనానికి గురిచేయడం జరిగిందేమో..!

గతంలో చాలామందికి కథలేకాని, కవిత్వంతో పెద్దగా సంబంధం లేదు. ఇప్పుడిప్పుడే ఉద్వేగానికి ఆలోచన తోడై కవిత్వం వస్తోంది. అంటే ఒక తాత్త్విక స్థాయి వచ్చింది. అందుకే పోయిట్రీ తక్కువ వస్తున్నట్లు కనిపిస్తుంది. కాకపోతే కవులే అధికంగా కథలు రాస్తుండటం వల్ల కూడా, ఎక్కువ మంది నుంచి అధికంగా కవిత్వం రావడం లేదేమో..!?

జీవితాన్ని యదార్ధ దృష్టితో, సామాజిక స్పృహతో వీక్షించినప్పుడు మాత్రమే కవిత్వంలో కచ్చితంగా భావాలు అభివ్యక్తం చేయడం సాధ్యమవుతుంది. సమాజాన్ని అంత: చక్షువుతో పరిశీలిస్తూ, మనసు పొరల్లోంచి పొంగిన ఆర్ద్రతతో, వస్తు వైవిధ్యంతో, భావనైపుణ్యంతో, అనన్య సామాన్యమైన శిల్పంతో కవిత్వం మలచబడుతుంది.

కవిత్వం ఒక ప్రసవ వేదన. వేదన లేకుండా కవిత్వం రాదు. దు:ఖాన్ని ఒడిసి పట్టుకోగలవాడే నిజమైన కవి. అంటే కన్నీటికి భాష్యం చెప్పేది కవిత్వమే కదా. కాలాన్ని కాంతి వాహికగా చేసుకొని కవితకు వస్తువుగా మార్చి, శిల్పాన్నీ వస్తువునూ సమపాళ్లలో రంగరించి, మనిషి అవసరాలు, ఆలోచనలు, ఆచరణలు మారిపోతున్న ఈ కాలంలో మనిషిని నిరంతరం హెచ్చరిస్తూ జాగరూకతకు కవిత్వం గురిచేస్తుంది.

నిజానికి సింటాక్సు అంటేనే నిబద్ధత.. దాన్ని అనిబద్ధం చెయ్యటం, అదీ మనసు తెలీనంత జాగ్రత్తగా చెయ్యటం, ఒక టెక్నిక్కు. అణిచిన కోరికలు సుప్తచేతనలో వివిధ రూపాల్లో విజృంభిస్తాయి. అప్పుడప్పుడూ కొందరు అసంబద్ధత స్వప్న కవిత్వం పరివ్యాప్త పరుస్తుంటారు. వారి దృష్ట్యా మన: క్లేశాల్ని గుర్తించాలి. కాలంతోపాటే ఉంటూ రాబోయే కాలాన్ని వాటి స్థితిగతుల్నీ ముందుగా వూహించి, సృజనాత్మకంగా అక్షరీకరించగలిగేవాడు అసలైన కవి. నిజాయితీ నిబద్ధత గల కవులు కొందరు సంఘంగా ఏర్పడడం, అది సాంస్కృతిక ఉద్యమంగా మారడం సామాన్యమైన విషయం కాదు. అలా సమాజంపై తనదైన ప్రత్యేక కవితాముద్ర వేయడం ప్రశంసనీయం.

కొన్ని కవితలు కవి పేరు వల్ల ప్రసిద్ధిలోకి వస్తాయి. ఇంకొన్ని కవిని ప్రసిద్ధిలోకి తెస్తాయి. మరికొన్ని విషయ ప్రామాణ్యాన్ని బట్టి పాఠకులను ఆకర్షిస్తాయి. మరికొన్ని చదివినప్పుడు ఈ విషయానికి ఇంత ప్రామాణ్యం ఉందా అని ఆశ్చర్యపరుస్తాయి. ఇంకొన్ని చదివాక ఇతరుల చేత కూడా చదివించుదామనిపిస్తాయి.

కవి తన సర్వేంద్రియాలను తాత్త్వికతకు ఒదిగే లక్షణంపై ఎంతో ఏకాగ్రత చూపిస్తేనే, భావం స్థిరపడి కవిత్వావిష్కరణ జరుగుతుంది. ఈ కవిత్వంలో ఆర్ధ్రత, తాత్త్వికత, నైపుణ్యం భావధారగా ఉంటాయి. ఈ కవిత్వం చదివాక ఒక గాఢమైన తాత్త్వికత వెలుగులు చిమ్ముకుంటూ భావాంశాల్ని ఎగరేసుకుపోతే అది నిజమైన, బలమైన కవిత్వం అవుతుంది.

ఒకే ఒక్క వస్తు కేంద్రంగా చెప్పాలనుకున్నప్పుడు... ఇవన్నీ మనిషిలోని మనిషితనం పరాయీకరింపబడటం గురించి పడిన ఆవేదనను మనిషి ఆస్థిపంజరంలోని సజీవ సంచలన రక్తమాంసాలను మళ్లీ ప్రోదిచేసి మనిషితనాన్ని, మంచితనాన్ని, మహనీయ కవిత్వాన్ని ఆవిష్కరించడం జరుగుతుంది. ఏదో రాయాలనే తపన, రాసింది నూరుశాతం ఉత్తమ స్థాయిలో ఉండాలనే ఆలోచన, ఏళ్ల తరబడి అన్వేషణ సాగించిన తర్వాత రచనకు ఓ రూపం వస్తుంది. అయినా తృప్తి అసంతృప్తి మధ్య మనసు ఊగిసలాట. పరిశీలన కోసం పరిశోధన కోసం ప్రముఖులచేతికి కాపీలు పంపటం, కొందరు ఎందుకొచ్చిన గొడవని బాగుందని చెప్పగా, మరికొందరు కానీ... అంటూ సవరణ తోకలు తగిలిస్తారు. కవి సవరణ తోకలు అంగీకరిస్తే బలహీనత, అంగీకరించకపోతే మెరుగుదల మెరుపు. తృప్తి – అసంతృప్తి మధ్య ఊగిసలాట. కొంతమంది కవులకి సజీవమైన సామాజిక భావచైతన్యం అనన్య సామాన్యంగా ఉంటుంది. ఈ చైతన్యం వివిధ కవిత్వాంశాలుగా వెల్లి విరుస్తుంది. రచన సామర్థ్యం శిల్పంగా భాసిస్తుంది. తమదైన ప్రత్యేక శైలీ తేజస్సు వారి మెరుపు లీనుతూ ఉంటుంది.

మనం కవిత్వాన్ని చదువుతున్నామా? ఇది వినడానికి చిత్రంగా అనిపించినా, ఇవాళ అందరం వేసుకోవలసిన ప్రశ్న ఇది. కవిత్వాభిమానులం అని చెప్పుకొనే వారి దృష్టిలోంచి చూసినా ఈ ప్రశ్నకు చాలా అసంతృప్తికరమైన సమాధానమే లభిస్తుంది. కవిత్వాన్ని అధ్యయనం చేయవలసిన అవసరం, చదవడం వచ్చిన ప్రతి వారికీ ఉంది. ఎందుకంటే అది మనలో సంస్కారాన్ని పెంచే గొప్ప ఉపకరణం కాబట్టి.

– ఎస్ఆర్ భల్లం

98854 42642



సంగీతరంగంలోనూ.. ఆడ, మగ అనే వివక్ష ఎప్పటి నుంచో ఉంది. అది ఎవ్వరూ కాదనలేని సత్యం. అందులో వాయిద్య కళారంగాన మహిళలు అరుదుగా కనిపిస్తారు. దీనికి కారణం.. సరైన ప్రోత్సాహం లేకపోవడం.. మహిళలు క్లిష్టతరమైన వాయిద్యకళల్లో అంతగా కష్టపడలేరనే ఒక తేలికపాటి భావన. అలాంటి స్థితిలో .. మిగతా ఆడపిల్లల్లా గాత్రమో, వయోలీన్, వేణువు వంటి వాయిద్యాలను ఎంచుకోకుండా మృందంగ కళపై మక్కువ పెంచుకున్నారామె. అందుకుతగ్గ సాధన చేశారు. మృదంగ విద్యలో ఎక్కాల్సిన మెట్లూ ఎక్కారు. ఫలితంగా అప్పటిదాకా పురుషులకే పరిమితం అనుకునే కళలో శభాష్ అనిపించుకున్నారామె. ఈ కళలో సుదీర్ఘ అనుభవాన్ని రంగరించుకుని, దేశంలోనే ప్రత్యేకతగల కళాకారిణిగా పేరు తెచ్చుకుంటున్న సీనియర్ మృదంగ కళాకారిణి సుమతీ రామ్మోహన్ కళా'జీవన'యానం ఆవిడ మాటల్లోనే..



మృదంగం ఆమె జీవన నాదం



మాది పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు. నిడుమూరు రాఘవయ్య, వెంకటరత్నమ్మ మా తల్లిదండ్రులు. మేము మొత్తం 14 మంది సంతానం. నేను ఎనిమిదవ సంతానాన్ని. నాకు ఆరుగురు అన్నదమ్ములు, ఏడుగురు అక్కచెల్లెళ్లు. మా తాతగార్లు అయిన నిడమోలు సుబ్బయ్య, భీమవరపు నరసింహమూర్తి ప్రఖ్యాత నాదస్వర విద్వాంసులు. మా తండ్రి డోలు, మృదంగం, ఘటం, కంజీరా విద్వాంసులుగా పేరు తెచ్చుకున్నారు. అలా నాకు ఈ కళ వారసత్వంగా వచ్చిందనే చెప్పొచ్చు.

నేర్చుకోనని ఏడ్చేశాను

నాకు ఊహతెలియని వయసులోనే నాన్న మొదటగా జంతర్ అనే చెక్కతో తయారుచేసిన పరికరం మీద వాయించడం నేర్పారు. నా చేతులకు బొబ్బలు రావడంతో నేర్చుకోనని వెక్కి వెక్కి ఏడ్చేదాన్ని. ఆ సమయంలోనే అమ్మా, నాన్న నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. చుట్టుపక్కల వాళ్ళ, బంధువులు అందరూ ఆడపిల్లకు మృదంగం ఏమిటి నీకేమైనా పిచ్చా అని నాన్నతో అనేవారు. కానీ ఆయన ఎవరి మాటలు ఖాతరు చేసేవారు కాదు. నాన్న ఉద్యోగరీత్యా మేము విజయవాడకు వచ్చేశాం. విజయవాడ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో మొదట భరతనాట్యం విద్యార్థినిగా చేరాను. తర్వాత నేను సంగీత కళాశాలలో శ్రీమహదేవ రాధాకృష్ణరాజుగారి వద్ద మృదంగ విద్యనభ్యసించి, పరీక్షలో ఉత్తీర్ణురాలైనాను. ఒకరోజు మంగళంపల్లి బాలమురళీకృష్ణగారి పాటకచేరి వినటం కోసం నాన్నతో పాటు వెళ్లాను. అక్కడ పక్క వాయిద్యంగా దండమూడి రామ్మోహన్‌రావుగారి వాదనా పటిమచూసి మంత్రముగ్ధురాలినయ్యాను. ఆ క్షణాన్నే నేను నిర్ణయించుకున్నా 'అడ్వాన్స్‌డ్' కోర్సు వారివద్దే నేర్చుకోవాలని. తర్వాత నాన్న ఆయన దగ్గరే శిష్యురాలిగా చేర్చారు. అప్పటికే ఆయనకు 'మృదంగ శబ్ద బ్రహ్మ', 'మృదంగ చక్రవర్తి' అని పేరుంది. ఆయనకంటూ ఓ ప్రత్యేకబాణీ ఉండేది. చాలామంది కళాకారులు ఆ బాణీని అనుసరించేవారు. రోజూ నేను విజయటాకీస్ దగ్గర నుంచి పడమట దుర్గామహల్ దగ్గరకు వెళ్ళి గురువు వద్ద విద్యను అభ్యసించేదాన్ని. చిన్నవయసులోనే పురుషులకే పరిమితమైన ఈ రంగంలో కచేరీలలో మృదంగ వాదనం చేసేదాన్ని. అది అంత సులువైన పని కాదు. పల్లవి, అనుపల్లవి, చరణంలోగల తేడాతో స్వరకల్పనకి వేరేవిధంగా, కొంతమంది రాగమాలికకు అనుకూలంగా వాయించగల సత్తా మనలో ఉండాలి. మా గురువుగారి దగ్గర అనేక మెళకువలు నేర్చుకున్నాను. ఆడపిల్ల మృదంగం వాయించడంలో ప్రతిభ కనబరుస్తుందని, కేవలం నన్ను చూడటం కోసమే ప్రేక్షకులు వచ్చిన సందర్భాలు చాలానే ఉన్నాయి.

కూలీ పనులు చేశా

నాన్న ఒక్కరి సంపాదనతో కుటుంబం జరగడం చాలా కష్టమయ్యేది. మూడుపూటలా అన్నం తినని రోజులు చాలానే ఉన్నాయి. నేను, అమ్మా నాన్నకు తెలియకుండా ఇతరుల ఇళ్లలో పనిచేసి, వారిచ్చే డబ్బుతో కొంతవరకు కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాళ్లం. నాకు 20ఏళ్లప్పుడు నాన్న మరణించారు. ఒక్కసారిగా మేమంతా అగాధంలో కూరుకుపోయినట్లు అనిపించింది. కుటుంబ సభ్యులకు ఒక్కపూట కూడా అన్నం పెట్టడం కష్టమయ్యేది. ఆ సమయంలోనే మా గురువుగారు ఉద్యోగంలో చేరడానికి సహాయ సహకారాలు అందించారు. నేను విజయవాడ ప్రభుత్వ సంగీత కళాశాలలో అధ్యాపకురాలిగా చేరాను. నా సంపాదనతోనే ఇల్లు గడిచేది. నేను పెళ్లి చేసుకుని వెళితే నా కుటుంబ పరిస్థితి ఏమిటి అని ఆలోచించి, ముందుగా నా చెల్లెళ్లకు వివాహాలు చేశాను. అప్పటికి నా వయస్సు 35సంవత్సరాలు. నేను మా గురువుగారి(దండమూడి)ని చాలా కాలం నుంచి ఇష్టపడుతున్నా. ఆ విషయం ఆయనకు చెప్పా. ఆయనకూ, నాకు వయసులో 20 సంవత్సరాలు తేడా. మొదట్లో పెళ్లికి నిరాకరించినా తర్వాత ఒప్పుకున్నారు. అలా మేము గుళ్లో పెళ్లి చేసుకుని ఒక్కటయ్యాం.

మనసుతో వింటారు

కళాకారులకు విదేశాలలో ఉన్న విలువ ఇక్కడ అంతగా లేదు. అది నన్ను ఎప్పుడూ బాధిస్తుంటుంది. 'మనం చెవులతో వింటాం కానీ, వారు మనసుతో వింటారు.' కచేరీ జరుగుతున్న సమయంలో వేలాదిమంది ఉన్నా చిన్న శబ్దం కూడా చేయరు. అందువల్ల కచేరీని ఏకాగ్రతతో చేస్తాం. అదే మన దగ్గర కొద్దిమంది ఉన్నా ఎక్కువ శబ్దాలు చేస్తారు. దానివల్ల కళాకారుల ఏకాగ్రత అదుపు తప్పే అవకాశం ఉంది. ఇదే విషయాన్ని బాలమురళీకృష్ణ గారు ఒక కీర్తనలో చెప్పారు. "అన్నానికి ఆంధ్రదేశం-ఆదరణకు అరవదేశం" అని. ప్రస్తుతం అన్ని కళలు అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్నాయి. కానీ గాత్రానికన్నా పక్క వాయిద్యాల శబ్దం ఎక్కువైనందున ప్రేక్షకులు ప్రశాంతతను కోల్పోయి, ఆ మధురస్మృతులు అక్కడే మర్చిపోతున్నారు. పోటీలవేవి అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయి. పోటీల వల్ల కళాకారులలో సాధించాలనే కసి, పట్టుదల పెరుగుతుంది. ఈ తరం కళాకారులకు ఆ అవకాశం ఉంది. అప్పట్లో పోటీలు ఉండేవి కాదు.

సున్నితమనేది భ్రమే

మహిళల చేతివేళ్ల సున్నితం అనేది 'భ్రమ' మాత్రమే. ఏ కళ అయినా ప్రారంభంలో కష్టంగా ఉంటుంది. సాధన చేసే కొద్దీ తేలికవుతుంది. మహిళలు ఈ రంగంలో రాణించలేకపోవడానికి చాలా కారణాలు ఉన్నాయి. తల్లిదండ్రుల ప్రోత్సాహం లేకపోవడం, పెళ్ళి తర్వాత భర్త సహకరించకపోవడం, కుటుంబ బాధ్యతలు, సాధన చేసుకోవడానికి అనుకూల వాతావరణం లేకపోవడం ఇలా ఎన్నో.... వీటిలో ఏ ఒక్కటి లోపించినా ఆడపిల్లలు ఈ రంగంలో రాణించలేరు. నాకన్నా ముందు కొంతమంది మహిళలు వచ్చినా ఇలాంటి కారణాల వల్లే ఈ రంగంలో శాశ్వతంగా నిలవలేకపోయారు. ఈ రంగంలో రాణించాలంటే మృదంగం వాయించడం ఒక్కటే కాదు. దానిని బాగుచేసుకోవడం కూడా నేర్చుకోవాలి. 'నేను ఈ రంగంలో విజయం సాధించగలిగానంటే ముందుగా నా తల్లిదండ్రులకు, తర్వాత నా భర్తకు కృతజ్ఞతలు తెలుపుతున్నా'. ఈరోజు నాకు పేరు ప్రతిష్టలు వచ్చాయంటే వారి సహకారమే కారణం. భారతదేశంలోనే టాప్ 'ఎ' గ్రేడ్ కళాకారులుగా మా దంపతులం రికార్డులకెక్కాం. ఆయన ఏడు సంవత్సరాల క్రితం మరణించారు. మాకు ఒక కుమార్తె ఉంది.

ఎన్నో అనుభూతులు

మంగళంపల్లి బాలమురళీకృష్ణ, చిత్తూరు సుబ్రహ్మణ్యం, ఉప్పలపాటి అంకయ్య, డాక్టర్ శ్రీపాద పినాకపాణి, ఎం.ఎస్.సుబ్రహ్మణ్యశర్మ, పండిత భీంసేన్ జోష్(జుగల్ బంధీలో)లాంటి సంగీత దిగ్గజాల కచేరీలలో వాయిద్య సహకారం అందించడం నా అదృష్టంగా భావిస్తున్నా. నేను, మా శ్రీవారితో కలిసి కొన్ని కార్యక్రమాలలో మృదంగాన్ని వాయించాం. ఇప్పటికీ నాకు ఒక సంఘటన గుర్తుంది. వైజాగ్‌లో ఒక ప్రోగ్రాంచేసి బయటకు వస్తున్నప్పుడు 80 సంవత్సరాల వృద్ధురాలు నా దగ్గరకు వచ్చి నన్ను కౌగిలించుకుంది. 'మీ పేరు తెలుసు. మీ గురించి నేను చాలా విన్నాను. నేను బతికుండగా మిమ్మల్ని చూస్తాననుకోలేదు. ఈరోజు మీ వాయిద్యం వినటానికే నేను వచ్చా' అని చెప్పింది. ఏ కళాకారుడుకైనా అంతకన్నా ఏమి కావాలి.

ఇంటర్వ్యూ: స్వర్ణలత నూకరాజు



మహిళలు ఏ రంగంలోనైనా రాణించగలరు

మృదంగం కేవలం పురుషులు మాత్రమే రాణించగల రంగం అని చాలామంది భావిస్తుంటారు. ఆడవాళ్లు ఈ రంగానికి పనికిరారనే భావన తప్పనేది నా ఉద్దేశ్యం. మహిళల్లో ఎవరైనా కొంతమందైనా ఈ విద్యలో కళాకారులుగా తయారవ్వాలనేది నా కోరిక. ఆసక్తి గల మహిళలు మృదంగం నేర్చుకోవడానికి ముందుకు వస్తే ఉచిత శిక్షణ ఇస్తా.

- దండమూడి సుమతీ రామ్మోహన్,
ఫోన్ : 9399986648

ఇంట్లోనే పార్లర్

వారానికోసారి ముఖానికి ఆవిరి, పదిహేనురోజులకోసారి పెడిక్యూర్, నెలకోసారి మేనిక్యూర్, క్రమం తప్పకుండా చేయించుకుంటే ఆ సౌందర్యమే వేరు. కానీ అన్నిసార్లు పార్లర్‌కు వెళ్లే తీరిక ఉండదు. ఇంట్లోనే సౌందర్య చికిత్సలకు సంబంధించి తక్కువ ధరల్లో లభ్యమయ్యే చిన్నచిన్న వస్తువులను కొని పెట్టుకోవచ్చు.




ఆవిరి మెషీన్: ముఖానికి పూత వేసుకునే ముందు, వారానికోసారి ఆవిరిపడితే చర్మగ్రంథులు ఆరోగ్యంగా ఉంటాయి. కానీ నాణ్యమైన రకాన్ని ఎంచుకోకపోతే నీళ్ల వేడయ్యాక ఆవిరిపట్టే సమయంలో నీటి బుడగలు ముఖంపైకి చిమ్ముతాయి. ఫలితంగా ముఖంపై మచ్చలు పడతాయి. అందుకే నాణ్యమైన రకాన్ని ఎంచుకోవాలి. బదులుగా మరో పని చేయవచ్చు. వెడల్పాటి స్టీలు పాత్రలో సగం దాకా నీళ్ల తీసుకుని బాగా మరిగించి, తరువాత బల్లపై ఉంచి దుప్పటి కప్పుకొని ఆవిరి తీసుకోవచ్చు.

కొమెడాన్: ఇది చిన్న పరికరం. ఆవిరి తీసుకున్నాక దీంతో బ్లాక్‌హెడ్స్, వైట్‌హెడ్స్‌ను సులువుగా తొలగించుకోవచ్చు. కానీ సాధ్యమైనంత వరకు స్టీల్ కొమెడాన్‌కే ప్రాధాన్యమివ్వాలి. అలాగే దాన్ని చాలా నెమ్మదిగా బ్లాక్‌హెడ్స్‌ను తీయాల్సి ఉంటుంది. లేకపోతే ముక్కు, నల్లగా మారిపోతుంది. గట్టిగా నొక్కినట్లు చేస్తే చర్మకణాలు దెబ్బతింటాయి.

దూది : స్టెరిలైజ్ చేసిన దూదిని ఇంట్లో ఉంచుకోవడం మంచిది. ముఖానికి వేసుకున్న మేకప్‌ను తొలగించుకునేందుకే కాదు. అలంకరణ సమయంలో చోటు చేసుకున్న చిన్న చిన్న పొరబాట్లను కూడా సరిదిద్దుకోవచ్చు. ఈ ఉత్పత్తులన్నీ దాదాపు రెండు వందల నుంచి మూడు వందల రూపాయల్లో అన్ని కాస్మోటిక్ దుకాణాల్లో లభిస్తాయి. అవసరం అనుకున్నప్పుడు హడావుడిగా పార్లర్‌కు పరిగెత్తకుండా అప్పటికప్పుడు ఇంట్లోనే సౌందర్యచికిత్స చేసుకోవచ్చు.

గోళ్ల అందానికి: కొందరు కాలిగోళ్లకు, చేతులకు ఒకే నెయిల్ కట్టర్‌ను వాడుతుంటారు. కానీ విడివిడిగా ఉండేలా చూసుకోవాలి. అలాగే మరీ చిన్నది లేదా పెద్దది కాకుండా మధ్యస్థంగా ఉన్న కట్టర్‌ను ఎంచుకోవడం మంచిది. ఇక, గోళ్లల్లో ఉండే మట్టిని, దుమ్మునూ తొలగించేందుకు ఆరెంజ్ స్టిక్స్ లభిస్తాయి. వీటితో క్యూటికల్స్‌ను వెనక్కి నెట్టే ప్రయత్నం చేస్తే సమస్యలు ఎదురుకావచ్చు. వీటిని కేవలం మట్టిని తీయడానికి మాత్రమే వాడాలి. గోటికి తీరైన ఆకృతినివ్వడానికి చిన్నగా ఉండే నెయిల్‌ఫైల్‌ను ఎంచుకోవాలి. పెద్దది వాడితే గోళ్ల ఆకృతి సరిగ్గా రాదు. ✦



మీ కోసం

ఆహారంలో శనగల్ని తీసుకుంటే రక్తహీనత, జుట్టు రాలడం, నిద్రలేమి వంటి సమస్యలు తొలగుతాయి.

జీవన సౌరభం

లక్ష్యం కోసం అలుపెరగక శ్రమిస్తుంటే.. నేడు కాకపోయినా రేపైనా విజయం సాధ్యమవుతుంది.



భారత రాజ్యాంగం - ముఖ్య లక్షణాలు

ఇండియన్ పాలిటీ (గ్రూప్స్ ప్రత్యేకం)



కె.ఎస్ లక్ష్మణరావు,
శాసనమండలి మాజీ సభ్యులు
సెల్ : 9440262072

భారత రాజ్యాంగ పరిషత్ భారత రాజ్యాంగాన్ని రూపొందించింది. 1949 నవంబర్ 16న ఆమోదం పొందిన భారత రాజ్యాంగం 1950 జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చింది. రాజ్యాంగ నిర్మాణంలో రాజ్యాంగ నిర్మాతలు ఆధునిక ప్రపంచంలోని తాత్విక పునాదులను అనుసరించారు. ఉదారవాదం, ప్రజాస్వామ్య సామ్యవాదం, లౌకికవాదం, గాంధీవాదం మొదలైన మూల సూత్రాలను రాజ్యాంగంలో పొందుపర్చారు. సమన్యాయ పాలన, ప్రాథమిక స్వేచ్ఛలు ప్రజలకు ఉండాలని భావించారు. ప్రజలందరికీ ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం జరగాలని ప్రతిపాదించారు. వీటన్నింటి ఆధారంగా రాజ్యాంగ మౌలిక లక్షణాలు రూపొందాయి.

1. లిఖిత, విపుల రాజ్యాంగం

ప్రపంచంలో భారత రాజ్యాంగం అతిపెద్ద లిఖిత రాజ్యాంగం. రాజ్యాంగ పరిషత్ రాజ్యాంగ రచనకు రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులపాటు తీసుకుంది. భారతదేశంలోని భిన్నత్వం, అన్ని తరగతుల ప్రయోజనాలు రక్షించాలనే దృక్పథం రాజ్యాంగంలో కనిపిస్తుంది. దళితులు, గిరిజనులు, ఇతర వెనుకబడిన తరగతుల ప్రయోజనాల పరిరక్షణకు రాజ్యాంగంలో అనేక నిబంధనలను పొందుపర్చారు. అనేక విధులను నిర్వహించడానికి రాజ్యాంగ సంస్థలను ఏర్పాటు చేశారు. రాజ్యాంగం రచించినప్పుడు రాజ్యాంగంలో 395 నిబంధనలు, 22 భాగాలు, 8 షెడ్యూళ్లు ఉన్నాయి. ఏడు దశాబ్దాలుగా జరిగిన మార్పుల్లో ప్రస్తుతం రాజ్యాంగంలో 468 నిబంధనలు, 25 భాగాలు, 12 షెడ్యూళ్లు ఉన్నాయి. 1951లో మొదటి రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్‌ను, 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పదో షెడ్యూల్‌ను, 1992లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 11వ షెడ్యూల్‌ను, 1992లో 74వ రాజ్యాంగ సవరణ ద్వారా 12వ షెడ్యూల్‌ను చేర్చారు. వీటన్నింటి వల్ల భారత రాజ్యాంగం పరిమాణంలో పెద్దదిగా రూపొందింది.

2. రాజ్యాంగ పీఠిక

భారత రాజ్యాంగ లక్ష్యాలను పీఠికలో పొందుపర్చారు. పీఠికలోని 'భారతదేశ ప్రజలమైన మేము' అను వ్యాక్యాన్ని ఐక్యరాజ్యసమితి రాజ్యాంగమైన చార్టర్ నుంచి గ్రహించారు. రాజ్యాంగం రచించినప్పుడు పీఠిక 'సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా' పేర్కొన్నారు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా సామ్యవాద, లౌకిక, సమగ్రత అనే పదాలను నూతనంగా చేర్చారు. దీంతో పీఠిక 'సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా' రూపొందింది. ప్రజలందరికీ ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం చేకూరాలని పీఠిక చెప్పింది. ప్రజలకు స్వేచ్ఛ కల్పించడానికి రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను చేర్చారు. ప్రజలకు సమానత్వం కల్పించడానికి రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలను పొందుపర్చారు. భారతదేశంలో రాజ్యాధినేత ఎన్నుకోబడడంతో దేశం గణతంత్ర రాజ్యంగా రూపొందింది. పౌరులకు మత స్వేచ్ఛను కల్పించడంతో లౌకిక రాజ్యంగా ఉంది. భారతదేశంలో అధికారానికి మూలాధారం ప్రజలు అని పీఠిక తెలిపింది.

3. రాజ్యాంగ మౌలిక స్వరూపం

భారత రాజ్యాంగంలో మౌలిక స్వరూపం గురించి పేర్కొనలేదు. కానీ 1973లో కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని వివరించి, దాన్ని కాపాడుకోవాలని చెప్పింది. వివిధ కేసుల్లో జస్టిస్ సిక్రి, జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ హెగ్డే మొదలైనవారు తీర్పులను పరిశీలిస్తే రాజ్యాంగ మౌలిక స్వరూప లక్షణాలు తెలుస్తాయి. రాజ్యాంగ ఆధిక్యత, ప్రజాస్వామ్య, సమాఖ్య విధానం, లౌకిక విధానం, సమన్యాయం, సార్వభౌమాధికారం మొదలైనవాటిని మౌలిక లక్షణాలుగా పేర్కొన్నారు. మినర్వామిల్స్ కేసు (1980), వామన్‌రావ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1981) కేసుల్లో కూడా సుప్రీంకోర్టు రాజ్యాంగ మౌలిక స్వరూప ప్రాధాన్యతను తెలిపింది.

4. ప్రాథమిక హక్కులు

రాజ్యాంగం మూడో భాగంలో 12 నుంచి 35 వరకూ ఉన్న నిబంధనల్లో ప్రాథమిక హక్కులను పొందుపర్చారు. భారత పౌరులకు స్వేచ్ఛను కల్పించడానికి ఈ హక్కులు దోహదపడతాయి. సుప్రీం కోర్టు 32వ నిబంధనల ద్వారా హైకోర్టు 226వ నిబంధన ద్వారా పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడటానికి ఐదు రకాల రిట్‌లు జారీ చేస్తాయి. ఆస్తిహక్కు వివాదం కావడంతో 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక హక్కుల నుంచి తొలగించారు. ప్రస్తుతం ఆస్తి హక్కు ఒక చట్టబద్ధమైన హక్కు మాత్రమే. 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా 21-ఎ నిబంధన చేర్చి ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా పొందుపర్చారు. అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో ప్రాథమిక హక్కులు తాత్కాలికంగా సస్పెండ్ అవుతాయి.

5. ఆదేశిక సూత్రాలు

రాజ్యాంగం నాలుగో భాగంలో 36 నుంచి 51 వరకూ ఉన్న నిబంధనల్లో ఆదేశిక సూత్రాలను పొందుపర్చారు. వీటిని ఐర్లండ్ రాజ్యాంగం నుంచి గ్రహించారు. ఆదేశిక సూత్రాలు భారతదేశాన్ని ఒక సంక్షేమ రాజ్యంగా రూపొందించడానికి తోడ్పడతాయి. భారత ప్రజల ఆర్థిక, సామాజిక, జీవన ప్రమాణాలు పెంపొందించడానికి ఆదేశిక సూత్రాలను అమలు చేయాలని రాజ్యాంగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. వీటికి న్యాయస్థానాల సంరక్షణ ఉండదు. సంపద పంపిణీ, సమాన పనికి సమాన వేతనం, కార్మికులకు సౌకర్యాలు మొదలైన అనేక అంశాలను ఆదేశిక సూత్రాల్లో పొందుపర్చారు. అధికారంలోకి వచ్చిన రాజకీయ పార్టీలు, తమ రాజకీయ సిద్ధాంతాలతో నిమిత్తం లేకుండా ఆదేశిక సూత్రాలు అమలు చేయాల్సి ఉంటుంది.

6. ప్రాథమిక విధులు

రాజ్యాంగ రచనా సమయంలో ప్రాథమిక విధులు రాజ్యాంగంలో లేవు. స్వర్ణసింగ్ కమిటీ సిఫార్సుల ఆధారంగా 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 10 ప్రాథమిక విధులను రాజ్యాంగం 4-ఎ భాగంలో, 51-ఎ నిబంధనలో చేర్చారు. తర్వాత 86వ రాజ్యాంగ సవరణ ద్వారా మరో ప్రాథమిక విధిని జతచేశారు. ఇప్పుడు రాజ్యాంగంలో 11 ప్రాథమిక విధులున్నాయి. రాజ్యాంగాన్ని, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించడం, హింసను విడనాడడం, ప్రభుత్వ ఆస్తులను కాపాడడం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడం వంటి అంశాలు ప్రాథమిక విధుల్లో ఉన్నాయి. భారత పౌరుల్లో బాధ్యతాయిత ప్రవర్తనను పెంపొందించే ఆశయంతో ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలో చేర్చారు.

7. పార్లమెంటరీ ప్రభుత్వం

భారత రాజ్యాంగం దేశంలో పార్లమెంటరీ తరహా ప్రభుత్వాన్ని ప్రవేశపెట్టింది. ప్రధానమంత్రి నాయకత్వాన ఉన్న మంత్రిమండలి నిజమైన అధికారాలను కలిగి ఉంటుంది. రాజ్యాధినేత అయిన రాష్ట్రపతి నామమాత్ర అధికారాలను కలిగి ఉంటారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ పార్లమెంటరీ తరహా ప్రభుత్వం కొనసాగుతుంది. సమిష్టి బాధ్యత, కార్యానిర్వాహక వర్గం, శాసన నిర్మాణ శాఖకు బాధ్యత వహించడం పార్లమెంటరీ విధానం యొక్క ముఖ్య లక్షణాలు. అయితే బ్రిటిష్ తరహా పార్లమెంటరీ ప్రభుత్వాన్ని భారతదేశం స్వీకరించలేదు. బ్రిటన్‌లో ఇప్పటికీ వారసత్వ రాజరికం కొనసాగుతోంది. కానీ భారతదేశం తనకుతాను గణతంత్ర రాజ్యంగా ప్రకటించుకుంది.

8. స్వతంత్ర న్యాయవ్యవస్థ

భారత రాజ్యాంగం దేశంలో స్వతంత్ర న్యాయవ్యవస్థను ఏర్పాటు చేసింది. న్యాయవ్యవస్థ ఏకీకృత న్యాయవ్యవస్థగా ఉంటుంది. రాజ్యాంగంలో చెప్పనప్పటికీ న్యాయవ్యవస్థ న్యాయ సమీక్ష అధికారాన్ని కలిగి ఉంటుంది. గత నాలుగు దశాబ్దాలుగా న్యాయవ్యవస్థ క్రియాశీలకంగా కొనసాగుతోంది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తితో సహా 31 మంది న్యాయమూర్తులు కొనసాగుతున్నారు. దేశంలో వివిధ రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు 24 హైకోర్టులు ఏర్పడి పనిచేస్తున్నాయి. న్యాయమూర్తుల నియామకానికి కొలీజియం వ్యవస్థ ఏర్పడింది. ఇటీవల జాతీయ న్యాయమూర్తుల నియామక కమిషన్‌ను 99వ రాజ్యాంగ సవరణ ప్రకారం ఏర్పాటు చేసినప్పటికీ సుప్రీంకోర్టు ఆ సవరణను కొట్టివేసింది. దేశంలో పౌరుల ప్రాథమిక హక్కులును కాపాడడంలో న్యాయవ్యవస్థ క్రియాశీలక పాత్ర వహిస్తోంది. ఇటీవల కాలంలో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం ప్రాదాన్యత పొందింది.

9. సమాఖ్య, ఏకకేంద్ర లక్షణాలు

రాజ్యంగ నిర్మాతలు భారతదేశాన్ని సమాఖ్య, ఏకకేంద్ర లక్షణాల సమ్మేళనంగా రూపొందించారు. సమాఖ్య లక్షణాలైన లిఖిత రాజ్యాంగం, అధికార విభజన, ద్విసభా విధానం, స్వతంత్ర న్యాయశాఖ మొదలైనవి భారత రాజ్యాంగంలో ఉన్నప్పటికీ ఇది పూర్తి సమాఖ్య కాదు. సమాఖ్యను అధిగమించే ఏకకేంద్ర లక్షణాలు బలంగా ఉన్నాయి. అందువల్లే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భారతదేశాన్ని ఏకకేంద్ర స్ఫూర్తితో పనిచేస్తున్న సమాఖ్య రాజ్యంగా వర్ణించారు. ప్రముఖ రాజ్యాంగ నిపుణుడు కె.సి.వేర్ భారతదేశాన్ని 'అర్ధ సమాఖ్య' అని వర్ణించాడు. ఏకకేంద్ర లక్షణాలైన ఒకే పౌరత్వం, ఏకీకృత న్యాయవ్యవస్థ, అఖిల భారత సర్వీసుల పాత్ర, కేంద్ర ఆధిక్యత మొదలైనవి కూడా రాజ్యాంగంలో ఉన్నాయి.

10. సార్వజనీన వయోజన ఓటు హక్కు

భారత రాజ్యాంగం పౌరులందరికీ సార్వజనీన ఓటు హక్కు ప్రసాదించింది. రాజ్యాంగ రచనా సమయంలో 21 సంవత్సరాలు నిండిన స్త్రీ, పురుషులందరికీ కుల, మత, వర్గ, లింగ, జాతి బేధాలు లేకుండా ఓటు హక్కు సార్వత్రికంగా ఉండాలని రాజ్యాంగ నిర్మాతలు ప్రతిపాదించారు. అయితే 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థ విజయం సాధించడంలో ఓటు హక్కు ముఖ్యపాత్ర పోషించింది. గత 16 సాధారణ ఎన్నికల్లో భారత ప్రజలు తమకు ఉన్న ఓటు హక్కును విజయవంతంగా వినియోగించుకున్నారు. 16వ సాధారణ ఎన్నికల్లో 83 కోట్ల మంది ప్రజలు ఓటు హక్కును కలిగి ఉండడం ప్రజాస్వామ్య చరిత్రలోనే ఒక అపూర్వమైన విషయం. రాజ్యాంగ నిర్మాతలు ప్రజలందరికీ ఓటు హక్కు ఇవ్వడం ద్వారా ప్రజా సార్వభౌమాధికారం కొనసాగుతుందని విశ్వసించారు.

11. దృఢ, అదృఢ రాజ్యాంగం

భారత రాజ్యాంగం దృఢ, అదృఢ రాజ్యాంగ లక్షణాలను కలిగి ఉంది. రాజ్యాంగంలో 18వ భాగంలో 368వ నిబంధనల ద్వారా రాజ్యాంగ సవరణ జరుగుతుంది. కొన్ని అంశాలను సవరించడానికి అమెరికా వలె దృఢమైన పద్ధతి అనుసరిస్తారు. ఉదాహరణకు రాష్ట్రపతి, సుప్రీంకోర్టు, హైకోర్టు, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలు వంటి అంశాలను సవరించడానికి దృఢమైన పద్ధతిలో సవరణ చేస్తారు. కొన్ని అంశాలను బ్రిటన్ వలె అదృఢమైన పద్ధతిలో సవరిస్తారు. రాష్ట్రాల ఏర్పాటు, పేర్ల మార్పు, దళితులు, గిరిజనుల పాలనకు సంబంధించిన అంశాలు అదృఢమైన పద్ధతిలో సవరిస్తారు. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు మొదలైన వాటిని సవరించడానికి దృఢ, అదృఢ పద్ధతిని అనుసరిస్తారు.

12. స్థానిక సంస్థలు

రాజకీయ వికేంద్రీకరణ ద్వారా అభివృద్ధి సాధ్యమని మహాత్మాగాంధీతో సహా అనేకమంది అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ రచనా సమయంలో స్థానిక సంస్థల గురించి కేవలం ఆదేశిక సూత్రాల్లో మాత్రమే పేర్కొన్నారు. బల్వంతరాయ్ మెహతాకమిటీ, అశోక్ మెహతా కమిటీ మొదలైన వాటి సిఫార్సుల ద్వారా దేశంలో పంచాయితీరాజ్ సంస్థలను ఏర్పాటు చేశారు. 1992లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయితీరాజ్ సంస్థలకు, 74వ రాజ్యాంగ సవరణ ద్వారా మున్సిపల్ సంస్థలకు రాజ్యాంగ హోదా కల్పించారు. రాజ్యాంగంలో 11వ షెడ్యూల్ ద్వారా గ్రామ పంచాయితీలకు 29 అంశాలపై, 12వ షెడ్యూల్ ద్వారా మున్సిపల్ సంస్థలకు 18 అంశాలపై అధికారాలు కల్పించారు.

13. అణచివేతకు గురైన వర్గాలు

భారత సమాజంలో చారిత్రకంగా అణచివేతకు గురైన షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, వెనుకబడిన తరగతుల అభ్యున్నతి కోసం రాజ్యాంగంలో అనేక రక్షణలు, రిజర్వేషన్లు కల్పించారు. రాజ్యాంగం 16వ భాగంలో ఈ వర్గాల కోసం కొన్ని ప్రత్యక నిబంధనలు చేర్చారు. రాజ్యాంగం 5,6 షెడ్యూళ్లలో గిరిజనుల కోసం, వారి అభ్యున్నతి కోసం ప్రత్యేక నిబంధనలు చేర్చారు. మండల్ కమిషన్ నివేదిక అమలులో భాగంగా వెనుకబడిన తరగతులకు జాతీయ స్థాయిలో 27 శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఈ వర్గాల కోసం జాతీయ ఎస్సీ కమిషన్, జాతీయ ఎస్టీ కమిషన్, జాతీయ బిసి కమిషన్, జాతీయ మహిళా కమిషన్, జాతీయ మైనార్టీ కమిషన్, జాతీయ మానవహక్కుల కమిషన్ మొదలైన వాటిని ఏర్పాటు చేశారు. వీటిల్లో కొన్ని కమిషన్లకు రాజ్యాంగ పరమైన హోదా కల్పించారు.

★

ఇన్ఫోసిస్‌లో స్థిరత్వానికి కృషి

- కంపెనీలో భేదాభిప్రాయాలు లేవు
- నూతన సిఇఒ కోసం ప్రయత్నిస్తా
- ఇన్వెస్టర్లతో నందన్ నిలేకని వెల్లడి

ముంబయి : ఇన్ఫోసిస్‌ను గాడిలో పెట్టిన అనంతరమే తాను వైదొలుగుతానని ఆ కంపెనీ సారథి నందన్ నిలేకని స్పష్టం చేశారు. తమ సంస్థలో ఎవరి మధ్యలో కూడా భేదాభిప్రాయాలు లేవని అన్నారు. ఇటీవల ఆ కంపెనీ సిఇఒ, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న విశాల్ సిక్కా అనుహ్యంగా తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో దేశంలోనే రెండో అతిపెద్ద ఐటి కంపెనీ ఇన్ఫోసిస్‌కు నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా నిలేకని బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తొలిసారిగా శుక్రవారం ఇన్వెస్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా తన పాత్ర బోర్డు పర్యవేక్షణ, పాలన, పనితీరు పరంగా కొనసాగుతుందన్నారు. ఇన్ఫోసిస్‌లో స్థిరత్వం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. రాబోయే సవాళ్లను ఎదుర్కొవాలని పేర్కొన్నారు. తాను నారాయణ మూర్తిని ఆరాధిస్తానని తెలిపారు. మూర్తి, కంపెనీ వ్యవస్థాపకుల మధ్య సత్సంబంధాలు ఉన్నాయని భావిస్తున్నానని అభిప్రాయపడ్డారు. కంపెనీలో ఎవరి మధ్య ఎటువంటి భేదాభిప్రాయాలు లేవని హామీ ఇస్తున్నానని చెప్పుకొచ్చారు. కంపెనీకి నూతన సిఇఒను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తానన్నారు. ఇన్ఫోసిస్‌కు తన అవసరం ఉన్నంతకాలం పనిచేస్తానని హామీ ఇచ్చారు. బోర్డు తనను ఏకగ్రీవంగా ఎన్నుకుందని, తన తక్షణ, ప్రధాన కర్తవ్యం సిఇఒ ఎంపిక అని అన్నారు. నూతన సిఇఒ నియామకం కోసం తుది నిర్ణయం తీసుకోవడానికి కొన్ని వారాల సమయం పడుతుందని చెప్పారు. ఇందుకోసం బోర్డు ప్రపంచవ్యాప్తంగా తగిన అభ్యర్థి కోసం శోధిస్తుందని, ఇన్ఫోసిస్ పూర్వ విద్యార్థులతో సహా అంతర్గత, బాహ్య అభ్యర్థులను పరిశీలిస్తానని చెప్పారు. రాబోయే నూతన సారథికి టెక్నాలజీ పరంగా బలమైన పట్టు ఉండాలన్నారు. కొత్త సిఇఒ ఎంపిక కోసం సెర్చ్ కమిటీని త్వరలోనే నియమిస్తామన్నారు. కంపెనీలో ఇటీవలి పరిణామాలపై భయపడాల్సిన అవసరం లేదంటూ పెట్టుబడిదారులకు భరోసా ఇచ్చారు. సిక్కా ఆకస్మిక రాజీనామాపై సంస్థ నిర్వ హణ కార్యకలాపాల్లో ఎలాంటి అంత రాయం ఉండదని నొక్కి చెప్పారు. మరోవైపు సంస్థకు సిక్కా చేసిన కృషిని కూడా ఆయన అంగీకరించారు. తన నేతత్వ ంలో ప్రతిష్టాత్మక మైన ప్రణాళికలను ముందుకు తీసుకువెళతామన్నారు. దీంతోపాటు మేనేజ్‌మెంట్ బోర్డులో నిర్మాణాత్మక మార్పులు చోటు చేసుకుంటాయనే సంకేతాలు కూడా ఇచ్చారు. పనాయా డీల్‌పై స్పందించిన నిలేకని, ఆ విషయాన్ని పరిగణలోకి తీసుకుం టానని, స్వల్పకాలికంగా కంపెనీ పనితీరులో ఎలాంటి ఆటంకాలు ఉండబోవని చెప్పారు. క్లయింట్స్‌తో సంస్థ చేసుకున్న ఒప్పందాలకు తాను కట్టుబడి ఉంటానన్నారు.



ఇన్వెస్టర్ల సమావేశంలో నందన్ నిలేకనీ (మధ్యలో) ఇన్ఫోసిస్ ఉన్నతాధికారులు రవి వెంకటేశన్, ప్రవీణ్ రావు, డిఎన్ ప్రహ్లాద్, రంగనాథ్

జీవితం గుండ్రంగా తిరుగుతోంది..

ఇన్ఫోసిస్‌లో తాను 26 ఏళ్ల వయసులో తొలిసారి చేరా నని, మళ్లీ 62ఏళ్ల వయసులో పునరాగమనం చేస్తున్నానని నిలేకని ట్విట్టర్‌లో ఓ సందేశం ఉంచారు. జీవితం గుండ్రంగా తిరుగుతోందంటూ తన సంతోషాన్ని ట్విట్ చేశారు. ఇన్ఫో సిస్‌కు మళ్లీ తిరిగిరావడం సంతోషంగా ఉందని ఇన్వెస్టర్ల సమావేశంలో పేర్కొన్నారు. క్లయింట్లు, షేర్‌హోల్డర్లు, ఉద్యోగులు మొదలైన వారందరికీ ప్రయోజనాలు చేకూర్చేలా వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా బోర్డులోని నా సహచర సభ్యులతో కలసి పనిచేస్తానని నిలేకని చెప్పారు.

ఆ కంపెనీలో చేరడం లేదు

విశాల్ సిక్కా వెల్లడి

బెంగళూరు : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ చిప్స్‌ల తయారీ కంపెనీ హ్యూలెట్ ప్యాకర్డ్ ఎంటర్‌ప్రైజెస్(హెచ్‌పిఇ)లో చేరుతున్నట్లు వచ్చిన వార్తలను ఇన్ఫోసిస్ మాజీ సిఇఒ విశాల్ సిక్కా శనివారం ఖండించారు. హెచ్‌పిఇలో తాను చేరుతున్నట్లు వస్తున్న కథనాలు తప్పు అని పేర్కొన్నారు. తనను ఎవరో కావాలనే ఇరికిస్తున్నట్లు ఉందన్నారు. ఇన్ఫోసిస్ పగ్గాలు నిలేకని చేపట్టం అద్భుతమైన ఆలోచని అని పేర్కొన్నారు. నీలేకని పూర్తి స్వేచ్ఛగా పనిచేసేందుకు వీలుగా తాను వైస్ ఛైర్మన్ పదవి నుంచి కూడా తప్పుకొన్నట్లు వెల్లడించారు. ఈ నిర్ణయంతో ఇన్ఫోసిస్‌లోకి కొత్త సారథి రావడానికి మార్గం మరింత సులువు అవుతుందన్నారు. తాను గతవారమే ఇన్ఫీ నుంచి పూర్తిగా బయటకు వచ్చేద్దామని అనుకున్నానని తెలిపారు. కాని బోర్డు సూచనల మేరకు కొనసాగినట్లు తెలిపారు.

జియో ఫోన్ ప్రీ బుకింగ్స్ నిలిపివేత!

న్యూఢిల్లీ: రిలయన్స్ జియో ప్రవేశపెట్టిన 4జి ఫోన్ ప్రీ-బుకింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. లక్షల మంది వినియోగదారులు ఈ మొబైల్‌ను బుక్ చేసుకోవడంతో ప్రీ బుకింగ్ వెసులుబాటును తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని జియో తన అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది. 'లక్షల మంది ఇప్పటికే ఫోన్‌ను ముందుగా బుక్ చేసుకున్నారు' అనే మెసేజ్‌ను ఆ సైట్ హోమ్ పేజీలో పెట్టారు. ప్రస్తుతానికి ప్రీ-బుకింగ్‌లను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్టుగా తన అధికారిక సైట్‌లో పేర్కొంది. ఈ నేపథ్యంలో జియో ఫోన్ కావాల్సిన వారు ప్రస్తుతం తమ ఆసక్తిని మాత్రమే రిజిస్టర్ చేసుకోవాలని సూచించింది. ప్రీ-బుకింగ్స్‌ను తిరిగి ఎప్పుడు ప్రారంభినున్నామనే విషయాన్ని త్వరలో వెల్లడిస్తామని జియో సైట్‌లో తెలిపింది. తాత్కాలికంగా అయితే బుకింగ్ ఆప్షన్‌ను తొలగిస్తున్నట్టు పేర్కొంది.

అనుమతి తప్పనిసరి..!

పసిడి దిగుమతులపై ప్రభుత్వ నిర్ణయం

ముంబయి: దక్షిణ కొరియా నుంచి అంతకంతకు పెరిగిపోతున్న పసిడి, వెండి దిగుమతులను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆంక్షలు విధించింది. ఇక ముందు వీటి దిగుమతులపై ప్రభుత్వ అనుమతి తప్పనిసరి చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అదే విధంగా ఈ ఉత్పత్తులను పరిమిత కేటగిరీలోకి చేర్చింది. జూలై 1 నుంచి ఆగస్టు 21 వరకు మధ్య కాలంలో దక్షిణ కొరియా నుంచి దేశంలోకి దాదాపు 1 బిలియన్ డాలర్ల విలువ చేసే బంగారం దిగుమతులు జరగడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.. కాగా నాణేలు, ఆభరణాలతో సహా అన్ని రకాల బంగారం, వెండి వస్తువులపై ఈ పరిమితి వర్తిస్తుందని ప్రభుత్వం పేర్కొంది. దక్షిణ కొరియాకు, భారత్‌కు మధ్య ఉచిత వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) అమల్లో ఉంది. దీంతో ఆ దేశం నుంచి వచ్చే బంగారం దిగుమతిపై ప్రాథ మిక కస్టమ్ సుంకం విధించడానికి వీల్లేదు. ప్రస్తుతం సమీకత జీఎస్టీ కింద బంగారంపై 3 శాతం పన్ను మాత్రమే అమల్లో ఉంది. ఉచిత వాణిజ్య ఒప్పందం లేని దేశాల నుంచి దిగుమతి చేసుకునే బంగారం ఉత్పత్తులపై 10 శాతం కస్టమ్ డ్యూటీ అమల్లో ఉంది. దక్షిణ కొరియాతో ఉన్న ఎఫ్‌టిఎను ఉపయోగించుకుని పలువురు వాణిజ్య వ్యాపారులు పన్ను ఎగొట్టేందుకు ఆ దేశం నుంచి భారీగా పసిడి దిగుమతులు చేసుకుంటున్నారు. దీంతో జులైలో బంగారం దిగుమతులు 95 శాతం పెరిగాయని తెలు స్తోంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో బంగారం, వెండిని దిగుమతి చేసుకోవాలంటే దిగుమతి దారులు ముందస్తుగా ప్రభుత్వం వద్ద నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. చైనా తర్వాత ప్రపంచంలో అతిపెద్ద బంగారం వినియోగదారు నిగా భారత్ ఉంది. ప్రస్తుతం 400 ప్లస్ ఉత్పత్తులు నియంత్రిత దిగుమతుల జాబితాలో ఉన్నాయి. .

సామ్‌సంగ్ వైస్ ఛైర్మన్‌కు ఐదేళ్లు జైలు

ప్రపంచంలోనే అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ గ్రూప్ వైస్ ఛైర్మన్ లిజే యాంగ్‌కు ఐదేళ్ల జైలు శిక్ష పడింది. దక్షిణ కొరియాకు చెందిన ఈ కంపెనీ ఆ దేశ మాజీ అధ్యక్షురాలు పార్క్ గెయిన్ హెయికు లంచం ఇచ్చిన వ్యవహారంలో ఈ శిక్ష పడింది. గ్వెన్ హైకు సంబంధించిన కంపెనీలకు అక్రమంగా ఆయన దాదాపు 36 మిలియన్ డాలర్లు మళ్లించారు. అత్యంత ధనవంతుడిగా పేరొందిన లీపై అవినీతి, లంచం తీసుకున్నట్లు ఆరోపణలు రావడంతో ఆయనను ఫిబ్రవరిలో అక్కడి అధికారులు అరెస్టు చేశారు. లీకు 12ఏళ్ల జైలు శిక్ష విధించాల్సిందిగా ప్రాసిక్యూటర్ న్యాయస్థానాన్ని కోరారు. కానీ కేసు వివరాలను పరిశీలించిన న్యాయస్థానం ఐదేళ్ల జైలు శిక్ష విధించింది.



నోట్లకు అమ్ముడుపోవద్దు : రామకృష్ణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజకీయ పార్టీలు ఇచ్చే నోట్లకు ఓటర్లు అమ్ముడుపోవద్దని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో వార్డులో పోటీ చేయడానికి రూ.50 లక్షలు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని, సామాన్యులు ఎన్నికల్లో ఎలా పోటీ చేయగలుగుతారని ప్రశ్నించారు. డేరా బాబా మద్దతుదారుల దాడులను అడ్డుకోవడంలో పంజాబ్, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు.

దళితులను దళాధిపతులు గా చూడటమే లక్ష్యం : ఆదినారాయణ



ప్రజాశక్తి-జమ్మలమడుగు టౌన్

దళితులను దళాధిపతులుగా చూడాలన్నదే తన లక్ష్యమని, వారి అభ్యున్నతి కోసం కృషి చేస్తామని మార్కెటింగ్ శాఖ మంత్రి ఆది నారాయణరెడ్డి అన్నారు. 'దళితులు సరిగా ఉండరు, చదువుకోరు, ఎన్ని సంవత్సరాలు రిజర్వేషన్లు ఇచ్చినా వారు మారరు' అని ఇటీవల దళితులపై అవమానకర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. శనివారం జమ్మలమడుగులో మంత్రి మాట్లాడుతూ.. ప్రజల కోసం పోర్టర్‌గా మారి పని చేస్తానని అన్నారు.

ప్రభుత్వ రంగం ఏం పాపం చేసింది?

- మోడీ, బాబులకు ప్రయి'వేటు'పైనే ప్రేమ
- రైల్వే, రక్షణ, ఓడరేవుల భూములను చౌకగా కట్టబెట్టే వ్యూహం
- ప్రజా పోరాటాలతోనే రక్షించుకోవాలి
- 'సేవ్ పబ్లిక్ సెక్టార్-సేవ్ విశాఖ' సభలో బివి.రాఘవులు



విశాఖ బహిరంగసభలో మాట్లాడుతున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, వేదికపై నరసింగరావు తదితరులు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

'ప్రభుత్వరంగ సంస్థలు, పరిశ్రమలు ఏం పాపం చేసుకున్నాయి? దేశ సంపదను కొల్లగొట్టకుండా ప్రభుత్వరంగ సంస్థలే కాపాడుతున్నాయి. నేడు ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేసేందుకు నరేంద్రమోడీ, చంద్రబాబు ఏకమయ్యారు. ప్రయివేటు వ్యక్తులపై ప్రేమతోనే ఇదంతా చేస్తున్నారు. దేశంలో రైల్వేలను ప్రయివేటీకరించడానికి తొలుత రైల్వేస్టేషన్ల మీద దెబ్బకొట్టి పిపిపి అమలుకు సిద్ధమయ్యారు.. దేశంలో 42 రైల్వేస్టేషన్లపై వేటుకు రంగం సిద్ధం చేశారు.. స్టేషన్ల ఆధునికీకరణ పేర రైల్వేస్టేషన్ల చుట్టూ ఉన్న భూమలు, ఆస్తులను అమ్మేస్తారు..' అని సిపిఎం పొలిట్ బ్యూరోసభ్యులు బివి.రాఘవులు ఉద్ఘాటించారు. శనివారం ఉదయం విశాఖ నగర కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు అధ్యక్షతన విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 'సేవ్ పబ్లిక్ సెక్టార్-సేవ్ విశాఖ' పేరుతో భారీ బహిరంగ సభ జరిగింది. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన రాఘవులు మాట్లాడుతూ, రూ.లక్షల కోట్ల విలువైన ప్రభుత్వరంగ సంస్థలు, వాటి ఆస్తులను కారుచౌకగా కొట్టేసేందుకు అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీకి చెందిన అరవింద్ పనగారియా (నీతి అయోగ్ వైస్‌ఛైర్మన్) 'బ్లూ ప్రింట్' తయారు చేసి మోడీకి అందజేశారు. దేశభక్తుడినంటూ ప్రచారం చేసుకునే మోడీ ప్రభుత్వరంగాన్ని ధ్వంసం చేసే వ్యూహపత్రాలతో దేశద్రోహానికి పాల్పడుతున్నాడంటూ రాఘవులు ఎద్దేవా చేశారు. దశలవారీగా ప్రభుత్వ రంగాన్ని ఎలా అమ్మేయాలో, ఎలా వాటాలను ఉపసంహరించాలో, కొన్నింటిని ఎలా మూసెయ్యాలో వ్యూహపత్రం ద్వారా మోడీ ప్రణాళిక రూపొందించాడని విమర్శించారు. దేశంలో 235 ప్రభుత్వరంగ సంస్థల్లో వెంటనే ఆరింటిని మూసెయ్యాలని, 20 సంస్థలను అమ్మేయాలని, 74 సంస్థల వాటాలను విక్రయించాలని బ్లూప్రింట్‌లో ఉందని అన్నారు. మూసెయ్యాలనుకున్న పరిశ్రమల్లో దేశంలోని రక్షణ పరిశ్రమలు 9 వరకూ ఉన్నాయని చెప్పారు.

భెల్, హెచ్‌పిసిఎల్, మిలియటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్ (ఎంఇఎస్), ఎన్ఎడి, నేవల్ డాక్‌యార్డు, డిఆర్‌డిఓ, రైల్వేలు, ఇండియన్ రైల్వేలు వీటన్నింటా సుమారు లక్షా 10 వేల మంది వరకూ పర్మినెంట్ ఉద్యోగులు, వేలమంది కాంట్రాక్టు ఉద్యోగులు, మరో 60 వేల మంది పదవీ విరమణ చేస్తున్న వారు ఉన్నారనీ, వీరిపై లక్షలాదిమంది జనం విశాఖలో ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ రంగాన్ని అమ్మడం వల్ల ప్రజలకు, దేశానికి ఏ మాత్రం లాభం లేదని, దేశ సంపద కొల్లగొట్టబడి, స్వావలంబన దెబ్బతింటుందని అన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. రూ.లక్షల కోట్ల విలువగల ప్రభుత్వరంగ పరిశ్రమలను కొనడం దేశంలోని ప్రయివేటు వ్యక్తుల వశం కాదని, కారుచౌకగా కొట్టేయడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కార్మికుల పరిశ్రమ కారణంగానే స్టీల్‌ప్లాంట్, హెచ్‌పిసిఎల్, ఇన్సూరెన్స్ రంగంలో అత్యధిక ప్రగతి సాధన జరిగిందని తెలిపారు.

భారీ ర్యాలీ

సభకు ముందు విశాఖ రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ సిపిఎం ఆధ్వర్యాన భారీ ర్యాలీ నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, మహిళా కార్యకర్తల చిడతలతో ర్యాలీ కోలాహలంగా సాగింది. దాదాపు రెండున్నర కిలోమీటర్ల పొడవునా సాగిన ర్యాలీలో 'సేవ్ పబ్లిక్ సెక్టార్, సేవ్ విశాఖ' అనే ప్లకార్డులు ప్రజలను ఆకర్షించాయి. రైల్వేస్టేషన్ అమ్ముతాం, చౌకబేరం రండి బాబూ రండి.. అంటూ బిజెపి పాలనా విధానాలను తెలుపుతూ తోపుడు బండిపై ప్రదర్శించిన నమూనా అందరినీ ఆలోచింపచేసేలా ఉంది. సేవ్ ఎల్ఐసి పేరిట ఉద్యోగులు చేపట్టిన సంతకాల సేకరణలో రాఘవులు సంతకం చేశారు. ర్యాలీ అగ్రభాగాన ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.నర్సింగరావు తదితరులు ఉన్నారు.

పిడిసిసి బ్యాంకు ఛైర్మన్ ఈదర రాజీనామా

సహకార శాఖ మంత్రికి లేఖ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



ప్రకాశం జిల్లా సహకార కేంద్ర(పిడిసిసి) బ్యాంకు ఛైర్మన్ ఈదర మోహన్‌బాబు తన పదవికి శనివారం రాజీనామా చేశారు. సహకార సంఘాల కమిషనర్ జె.మురళి తీవ్ర వేధింపులతో ఆవేదనకు గురై రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డికి రాజీనామాను ఫ్యాక్స్ ద్వారా పంపించారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి : యండపల్లి

ప్రజాశక్తి - తిరుపతి క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ ఎస్వీయూ వీసీ ఆచార్య ఎ.దామోదరానికి ఎంఎల్‌సి యండపల్లి శ్రీనివాసులు రెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జయచంద్ర వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యండపల్లి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మూడున్నరేళ్ల పాలనలో ఎటువంటి నోటిఫికేషన్ ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య నానాటికీ పెరిగిపోతుంద న్నారు. యూనివర్శిటీలలో ఇప్పటివరకు ఒక్క పోస్టు కుడా రూలాఫ్ రిజర్వేషన్ ప్రకారం ఎందుకు భర్తీ చేయలేదని ప్రశ్నించారు. విశ్వ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వీసీని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఎస్వీయూ ఉపకులపతి స్పందిస్తూ సిఎంకు నివేదించామని, తర్వలోనే నోటిఫికేషన్ ఇస్తామని హామీ ఇచ్చారు.

ప్రజ్ఞ

జవాబులు

1. నందన్ నిలేకని
2. అశ్వని లోహాని
3. ముంబయి,
4. రఘురాం రాజన్
5. గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్

ఫ్లోరైడ్ బాధితులకు సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లా బల్జిపేట మండలం శ్రీరంగరాజపురంలో ఫ్లోరైడ్ సమస్యతో బాధపడుతున్న బాధితులను సిపిఎం నాయకులు పరామర్శించారు. ఫ్లోరైడ్ నీటివల్ల స్థానికులు మంచాన పడుతున్నట్లు ఇటీవల పత్రికల్లో వచ్చిన నేపథ్యంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ శనివారం ఆ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా రోగులు, వారి కుటుంబసభ్యులు సమస్యను తమ్మినేని ఎదుట ఏకరువుపెట్టారు. తాగునీటి కారణంగా పదేళ్లగా వ్యాధుల బారిన పడుతున్నామని, ఎన్నోసార్లు ఉన్నతాధికారులు, మంత్రులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు నీటి నమూనాలు తీసుకెళ్లినా వాటి రిపోర్టులు బయటపెట్టలేదని పలువురు యువకులు తెలిపారు. ఫలితంగా కిడ్నీ, కీళ్లనొప్పుల సమస్యలతో మంచంపట్టి ఏటా మరణాలు సంభవిస్తున్నాయని వాపోయారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ ప్రజారోగ్యంపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతుందనడానికి శ్రీరంగరాజపురమే నిదర్శనమన్నారు.

ఉక్కు ఫ్యాక్టరీ కోసం ఉద్యమాలు తప్పవు

ప్రజాశక్తి - బద్వేలు(కడప)

ఉక్కు ఫ్యాక్టరీ కోసం ఉద్యమాలు తప్పవని సిఐటియు కడప జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.చిన్ని అధ్యక్షతన 'కడప ఉక్కు-ఆంధ్రుల హక్కు' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ముద్దనూరు సమీపంలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 16వేల ఎకరాలు మంజూరు చేసిందన్నారు. ఆ ప్రాంతంలో మైలవరం, గండికోట జల వనరులు, మరోవైపు ముద్దనూరు థర్మల్ కేంద్రం ఉన్నాయనీ, ఓబుళాపురం ఇనుప ఖనిజం సేకరణకు అనువైన కేంద్రమని సూచించారు. ఈ నెల 29, 30వ తేదీలలో జిల్లా వ్యాప్తంగా చేపట్టే నిరవధిక నిరాహారదీక్షలు, మానవహారాలలో ప్రజాసంఘాలు, విద్యార్థులు, మేధావులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కొనసాగుతున్న విఆర్‌ఎ ల నిరాహార దీక్షలు

మూడోరోజు దీక్షల్ని ప్రారంభించిన సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ డిమాండ్ల సాధన కోసం విఆర్‌ఎలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. మూడో రోజు దీక్షల్ని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ విజయవాడలోని అలంకార్ సెంటర్‌లో శనివారం ప్రారంభించారు. వేతనాలు పెంచాలని, రిక్రూట్‌మెంట్ ద్వారా చేరిన, విద్యార్హతలున్న విఆర్‌ఎలను రెగ్యులరైజ్ చేయాలని, నామినీలను విఆర్‌ఏలుగా నియమించాలని, ప్రమోషన్లు ఇవ్వాలని, 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవిన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో దీక్షల్ని చేపట్టారు. ఈ సందర్భంగా సుబ్బరావమ్మ మాట్లాడుతూ వేతనాలు పెంచాలని మూడేళ్లుగా ముఖ్యమంత్రికి, రెవెన్యూ శాఖ మంత్రికి, అధికారులకు అనేక సార్లు విన్నవించినా ఫలితం శూన్యమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విఆర్‌ఎల వేతనాన్ని రూ.10,700లకు పెంచడంతో పాటు ప్రమోషన్లలో 30శాతం, డబుల్ బెడ్‌రూం ప్లాట్ల కేటాయిస్తామని, రిక్రూట్‌మెంట్ విఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేస్తామని ఆ రాష్ట్రప్రభుత్వం హామీనిచ్చిందని గుర్తుచేశారు. విఆర్‌ఏల పట్ల రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రతి నెలా వేతనాలందక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్ నర్సింహారావు దీక్షలను సాయంత్రం విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవిన్యూ సహాయకుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ పెద్దన్న, ఎం బాలకాశి, సహాయ కార్యదర్శి టి నర్సప్ప, నాయకులు టి రామాంజనేయుడు, ఎన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు..

సమస్యలపై సర్కార్‌ను నిలదీయండి

సిపిఎం ప్రచార జాతాలో జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడుబూరు(కర్నూలు)

గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలపై ప్రభుత్వాలను నిలదీయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి ప్రజలను కోరారు. శనివారం కర్నూలు జిల్లా పెద్దకడుబూరు మండలంలోని సమస్యలపై సిపిఎం నిర్వహించిన ప్రచారజాతాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను గాలికి వదిలేశాయని, బిజెపి ప్రభుత్వం ప్రజలను మతం పేరుతో రెచ్చగొడుతోందని అన్నారు. ప్రధాని మోడీ 60 సార్లు విదేశీ యాత్రలు చేసినా ఎక్కడా నిరుద్యోగులకు ఉపాధి చూపించే పరిశ్రమలను రాబట్టలేదన్నారు. మేక్ ఇన్ ఇండియా, స్వచ్ఛభారత్ పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారే తప్పా ఎక్కడా ఆ కార్యక్రమాలు ఉపయోగపడేలా చేయలేదన్నారు. పేదలకు అండగా ఉండే జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో రైతులు, ప్రజల పట్ల రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పులికనుమ ప్రాజెక్టును ఇప్పటికైనా ప్రారంభించి ఈ ప్రాంత రైతులకు సాగు, తాగు నీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. జాతా శనివారం నాటికి పెద్దకడుబూరు మండలంలో 24 గ్రామాలలో పూర్తియింది. కర్నూలు జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను ఎండగడుతూ సిపిఎం ఆధ్వర్యంలో ప్రచార జాతాలు కొనసాగాయి. ఆదోని రూరల్, ఆదోని అర్బన్, కోడుమూరు, పెద్దపాడులో ప్రచార జాతాలు నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు విద్యాసంస్థలను ఎండగట్టారు.

ఇక చావోరేవో తేల్చుకోవడమే!

- మా బతుకులు ఇలా తెల్లారాల్సిందేనా?
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు ఎదుట సుబాబుల్ రైతులు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

'మూడేళ్ల క్రితం బకాయిలు ఇంకా చెల్లించలేదు.. పండిస్తున్న పంటనూ కొనుగోలు చేయటం లేదు.. మా బతుకులు ఇలా తెల్లారాల్సిందేనా?.. గతంలో మాతో కలిసి రోడ్డెక్కిన దేవినేని ఉమామహేశ్వరరావు నేడు మంత్రి పదవిలో ఉన్నా.. సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోయాయి. ఇక చావోరేవో తేల్చుకోవటమే మిగిలింది' అని సుబాబుల్ రైతులు ఆక్రోశం వెళ్లగక్కారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు నాయకత్వంలో ఆపార్టీ ప్రత్యేక బృందం కృష్ణాజిల్లా జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని పొక్కునూరు, కాసరబాద, చందర్లపాడు, ముప్పాళ్ల, నవాబుపేట, నందిగామలో శనివారం పర్యటించింది. ఉదయం ఎనిమిది గంటలకు బృందం పొక్కునూరు చేరుకోగా అప్పటికే రైతులు పెద్దఎత్తున గుమిగూడారు. మిల్లు యాజమాన్యాలు, దళారుల చేతుల్లో మోసపోతున్న తీరు, రాష్ట్ర ప్రభుత్వ ఒంటెద్దు పోకడలపై ఏకరువు పెట్టారు. గిట్టుబాటు ధర కోసం సుదీర్ఘ పోరాటం చేశామని, కుదుట పడుతున్న తరుణంలో జిఓ 143 తీసుకొచ్చారని వాపోయారు. జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని 40 వేల



చందర్లపాడు మండలం కాసరబాదలో పర్యటిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, రైతులు

ఎకరాల్లో సుబాబుల్ పంట కోతకు సిద్ధంగా ఉందని, కొనుగోళ్లు నిలిపేయటంతో రైతులకు ఏం చేయాలో పాలుపోవటం లేదని చందర్లపాడు, ముప్పాళ్ల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు నవాబుపేటకు చేరుకున్న బృందాన్ని రైతులు పెద్దఎత్తున కలిశారు. ఈ రైతులకు రూ.1.80 కోట్లు, ముళ్లపాడు గ్రామస్తులకు రూ.80 లక్షలు ఎస్‌పిఎం పేపరు కంపెనీ బకాయి పడిందని తెలిపారు. సుబాబుల్ కొనుగోళ్లు నిలిపే యటంతో రైతులు రోడ్డున పడే ప్రమాదముందని నవాబు పేట సర్పంచ్ గింజుపల్లి శ్రీవాణి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నవాబుపేటలో రైతుల నుద్దేశించి మధు మాట్లాడుతూ.. ప్రపంచీ కరణతో వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు పెరుగుతాయని, విదేశాలకు ఎగు మతులు చేయొచ్చని పాలకులు నమ్మిం చారని, ఇందులో ఏ మాత్రం వాస్తవం లేదనటానికి రోజురోజుకూ దిగజారుతున్న వ్యవసాయ ఉత్పత్తుల ధరలే నిదర్శనమని అన్నారు. అనంతరం ఆయన వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. అమరావతిలో సోమవారం సంప్రదింపులకు మంత్రి అంగీకరించారని, సమస్య పరిష్కారం కాకపోతే జాతీయ రహదారిని దిగ్బంధం చేస్తామని మధు హెచ్చరించారు. సిపిఐ కృష్ణాజిల్లా కార్యదర్శి అక్కినేని వనజ, పశ్చిమ కృష్ణా కార్యదర్శి డివి.కృష్ణ, ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.కేశవరావు, ఎపి సుబా బుల్ రైతు సంఘం అధ్యక్ష కార్య దర్శులు చుండూరు సుబ్బారావు, యార్లగడ్డ జోయ పాల్గొన్నారు.

ప్రజాధనం దుర్వినియోగం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- నందివాడ(కృష్ణా)

రైతు సమస్యలను తీర్చడానికి ప్రభుత్వానికి తీరికలేదని, అదే నంద్యాల ఉప ఎన్నికల్లో వీధికొక మంత్రి, ఎంపి, ఎమ్మెల్యేలను కేటాయించి రూ.వందల కోట్ల ప్రజా ధనాన్ని వృథా చేశారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అన్నారు. కృష్ణాజిల్లా నందివాడ మండలం జొన్నపాడు గ్రామ సెంటర్‌లో వ్యవసాయ కార్మిక సంఘం నందివాడ మండల కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం డివిజన్ కమిటీ సభ్యులు నీలం మురళీకృష్ణారెడ్డి అధ్యక్షతన కౌలు రైతు, రైతు సమస్యలపై శనివారం బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నంద్యాల్లో రూ.వందల కోట్లు ఖర్చు చేసిన టిడిపి పాలకులకు, రైతులకు రుణమాఫీ, సబ్సిడీపై ఎరువులను అందించాలంటే డబ్బులే లేవని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడుకు పౌరసన్మానం పేరుతో రూ.30 కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారన్నారు. రాష్ట్రప్రభుత్వం ఉపాధి హామీ నిధులను పక్కదారి పట్టించిందని, నీరు-చెట్టు పేరుతో కార్యకర్తలకు దారాదత్తం చేసిందన్నారు. పేదలకు చెల్లించాల్సిన రూ.400 కోట్ల ఉపాధి బకాయిలను చెల్లించడంలో తాత్సర్యం చేస్తోందన్నారు. బుడమేరు ఆధునీకీకరణలో భూములు కోల్పోయిన రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం



సభలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని బాకాలు ఊదుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు జరిగిన అభివృద్ధి ఏమిటో బహిర్గతపరచాలన్నారు. నందివాడ మండలంలో దాదాపు వ్యవసాయ భూమి కనుమరుగైందని, చెరువులుగా మారడంతో పేదలు, దళితులు ఉపాధిని కోల్పోయారన్నారు. వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. సమావేశంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం తూర్పుకృష్ణా కార్యదర్శి మురాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కంపెనీల కోసమే జిఎస్‌టి

వెంటనే రద్దు చేయాలని వైవి డిమాండ్

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) కేవలం బహుళజాతి కార్పొరేట్ కంపెనీల కోసమేనని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పిడిఎం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు అన్నారు. పిడిఎం రాష్ట్ర నాయకులు కనకాచారి 12వ వర్ధంతిని పురస్కరించుకుని 'భారతదేశంపై జిఎస్‌టి ప్రభావం' అనే అంశంపై విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సదస్సులో ఆయన ప్రధాన వక్తగా మాట్లాడారు. 'ఒకే పన్ను ఒకే దేశం' అని ప్రచారం చేస్తున్న బిజెపి ప్రభుత్వం వాస్తవాల్ని ప్రజలకు తెలియజేయటం లేదన్నారు. జిఎస్‌టిలో ఐదు శ్లాబులు ఉన్నాయని, ప్రతి వ్యాపారాన్నీ పన్ను పరిధిలోకి తీసుకువచ్చారని తెలిపారు. చిన్న పరిశ్రమలు మూతపడి దేశంలో అసంఘ టిత రంగంలో పని చేస్తున్న ఐదు కోట్ల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని చెప్పారు.


ప్రజా సమస్యలపై పోరాడిన నాయకులు కనకాచారి

పౌరహక్కుల నాయకుడు కనకాచారి ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ప్రజాసమస్యలపై పోరాటం చేసిన గొప్ప నాయకుడని వక్తలు కొనియాడారు. సామ్రాజ్యవాద దోపిడీ శక్తులు దేశంలో అన్ని రంగాలనూ ప్రభావితం చేస్తున్న సమయంలో పాలకులు దేశాన్ని విదేశీ కంపెనీలకు తాకట్టు పెట్టడాన్ని సహించలేక 2004లో ఎఐపిఆర్‌ఎఫ్‌లో చేరి ఉద్యమం నడిపించారని చెప్పారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా హైదరాబాద్, విజయవాడల్లో జరిగిన అనేక కార్యక్రమాల్లో ఆయన ప్రధాన పాత్ర పోషించారని వివరించారు. సభకు పిడిఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సుబ్బారావు అధ్యక్షత వహించారు.

ప్రార్థనా మందిరంలో బాలిక హత్య

ప్రజాశక్తి - తాడేపల్లి (గుంటూరు)

గుంటూరు జిల్లా తాడేపల్లి డోలాస్‌నగర్‌లోని ఓ ప్రార్థనా మందిరంలో గుర్తుతెలియని దుండగులు బాలికను తీవ్రంగా కొట్టడంతో మృతిచెందింది. శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. డోలాస్‌నగర్‌లో నివాసం ఉండే వెల్లటూరు మరియదాసుకు ముగ్గురు సంతానం. పెద్ద కుమార్తె శ్రావ్య(4) మధ్యాహ్నం 2 గంటలకు ప్రార్థనా మందిరం పైభాగంలో రక్తపు మడుగులో పడి ఉందని తమ్ముడు చరణ్ తల్లిదండ్రులకు చెప్పాడు. కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న శ్రావ్యను తల్లిదండ్రులు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. శ్రావ్యను కొంతదూరం ఈడ్చుకొచ్చి కొట్టినట్లు, మొఖం మీద, ఒంటి మీద గాయాలున్నాయి. స్థానిక యువకుడే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పోలీసులు తెలిపారు.



పంచకుల హింసపై రాజ్‌నాథ్ సమీక్ష

ఛండీగఢ్: పంచకుల అల్లర్లపై శనివారం కేంద్ర హోంశాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వంలో అత్యవసర సమావేశం జరిగింది. ఆ శాఖ ముఖ్య కార్యదర్శి రాజీవ్ మహర్షి మాట్లాడుతూ అల్లర్ల నేపథ్యంలో 31 మంది మృతిచెందారనీ, 250 మంది గాయపడ్డారనీ పేర్కొన్నారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా కూడా ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ అనిల్ జైన్, సీనియర్ నాయకుడు ఖైలేష్ విజయ్‌వార్గియాతో మాట్లాడారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఖత్తార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌ను వారు తోసిపుచ్చారు. బాబాకు భక్తులు ఎక్కువగా ఉండడంతో రాష్ట్రంలో పరిస్థితులు ఉద్రిక్తంగా ఉన్నాయనీ స్థానిక నాయకుడు ఒకరు పేర్కొన్నారు.



పార్టీ పదవి నుంచి రాజేంద్రన్ తొలగింపు

చెన్నై: తమిళనాడు ప్రభుత్వ విప్ ఎస్.రాజేంద్రన్‌ను అన్నాడిఎంకెలో కీలక పార్టీ పదవి నుంచి తొలగిస్తున్నట్లు ఆ పార్టీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి దినకరన్ ప్రకటించాడు. టిటివి దినకరన్‌కు మద్దతుగా నిలిచిన 19 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ రాజేంద్రన్ అసెంబ్లీ స్పీకర్‌ను కలవడంతో దినకర్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. రాజేంద్రన్‌ను ఆర్యలూరు జిల్లా కార్యదర్శి పదవి నుంచి తొలగించి ఆ స్థానంలో ముత్యన్‌ను నియమించినట్లు దినకరన్ ప్రకటించారు. పార్టీ పదవుల్లో మార్పులు కొనసాగుతూనే ఉంటాయని ఆయన పేర్కొన్నారు. దినకరన్ తనకు మద్దతుగా ఉన్న 19 మంది ఎమ్మెల్యేలతో గవర్నర్ విద్యాసాగర్‌ను కలిసి, పళనిస్వామిని ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలని కోరిన సంగతి తెలిసిందే.

నిర్లక్ష్యం ఫలితం 36 ప్రాణాలు



గుర్మీత్‌సింగ్‌ను హెలికాప్టర్‌లో జైలుకు తరలిస్తున్న దృశ్యం

(మొదటి పేజీ తరువాయి)

మనోహర్‌లాల్ ఖట్టర్‌ను తక్షణమే తొలగించాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. 15 ఏళ్ల క్రితం నాటి అత్యాచారం కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న డేరా సచ్చా సౌధ(డిఎస్ఎస్) అధిపతి గుర్మీత్ రామ్ రహీం సింగ్‌ను సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం దోషిగా నిర్ధారిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించింది. ఈ తీర్పు వెలువడిన వెనువెంటనే ఆయన మద్దతుదారులు రెచ్చిపోయారు. అప్పటికే కోర్టు వెలుపల పెద్ద సంఖ్యలో మోహరించిన డేరా మద్దతుదార్లు కనిపించిన వాహనాలను తగులబెట్టారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం వరకు ఈ హింసాకాండ కొనసాగింది. హర్యానాలోని పంచకుల, సిర్సా, తదితర పట్టణాల్లో చెలరేగిన ఈ హింసాకాండకు బలైనవారి సంఖ్య శనివారం నాటికి 36కు చేరింది. 552 మంది పైగా గాయపడ్డారు. హింసాకాండను అరికట్టడంలో ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు కానీ, అటు కేంద్ర ప్రభుత్వం కానీ ఘోరంగా విఫలమయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీరును కూడా తప్పుబడుతూ హర్యానా, పంజాబ్ హైకోర్టు చీవాట్లు పెట్టేంతటి తీవ్ర స్థాయిలో హింస చెలరేగింది. హైకోర్టు చీవాట్లు పెట్టడంతో కార్యాచరణలోకి దిగిన ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దింపింది. సిర్సాలోని బాబా ప్రధాన ఆశ్రమాన్ని సైన్యం అదుపులోకి తీసుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. సిర్సాలోనూ, పంచకులలోనూ సైన్యం మార్చ్ నిర్వహించింది. హర్యానా, పంజాబ్, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఆంక్షలు విధించారు. ప్రస్తుతం ఉద్రిక్తత కొనసాగుతున్నా పరిస్థితి అదుపులోనే ఉందని కేంద్ర హోంమంత్రిత్వశాఖ శనివారం సాయంత్రం ప్రకటించింది.

జైల్లోనే శిక్ష ఖరారు

కాగా అత్యాచారం కేసులో సిబిఐ కోర్టు దోషిగా ప్రకటించిన గుర్మీత్ రామ్ రహీం సింగ్‌కు ఈ నెల 28న సోమవారం శిక్ష ప్రకటించనున్నారు. గుర్మీత్ ఖైదుగా ఉన్న రోహతక్‌లోని సునారియా ప్రత్యేక జైలుకు సిబిఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి వెళ్లి అక్కడే ఈ శిక్షను ప్రకటించనున్నారు. ఈ మేరకు సిబిఐ న్యాయమూర్తి జగదీప్ సింగ్, ఆయనకు సంబంధించిన మరో ఇద్దరు సిబ్బంది వాయుమార్గంలో జైలు వద్దకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని హర్యానా ప్రభుత్వాన్ని పంజాబ్-హైకోర్టు శనివారం ఆదేశించింది.

విధ్వంసంపై నివేదిక

హింసాకాండ ఘటనలపై హర్యానా ప్రభుత్వం హైకోర్టుకు నివేదిక సమర్పించింది. ఇప్పటి వరకు 32 మంది చనిపోయారని తెలిపింది. పంచకులలో 28 మంది చనిపోగా, వీరిలో ఒక్కరినే ఇప్పటి వరకు గుర్తించామని వెల్లడించింది. ఈ కేసుల్లో 524 మందిని అరెస్టు చేశామని, 24 వాహనాలను, 79 రౌండ్లు ఉన్న ఐదు తుపాకులను, 52 రౌండ్లున్న రెండు రైఫిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు నివేదించింది. ఇవేగాక ఇనుప రాడ్లు, హాకీ స్టిక్స్, పది పెట్రోలు బాంబులు కూడా స్వాధీనం చేసుకున్నామని , ఎనిమిది కేసులు నమోదు చేసినట్లు పేర్కొంది.

ఖైదీ నెంబరు.1997

జైలులో ఉన్న గుర్మీత్‌కు ఖైదీ నెంబరు 1997ను కేటాయించారు. అయితే జైలులో అతనిని అధికారులు ప్రత్యేకంగా ట్రీట్ చేస్తున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. జైలు గదిలో ఏసీ సదుపాయంతో పాటు మినరల్ వాటర్ అందిస్తున్నట్టు సమాచారం. అంతేకాక అతనికి ఓ అసిస్టెంటును కూడా ఏర్పాటు చేసినట్టు తెలుస్తున్నది. అయితే.. ఈ వార్తలను హర్యానా ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ డిఎస్ దేశీ కొట్టిపారేశారు. గుర్మీత్‌ను ఓ సాధారణ ఖైదీగానే చూస్తున్నట్టు, భోజనం కూడా అందరు ఖైదీలకు అందిచేదే అతనికీ ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. గుర్మీత్‌కు ఇంతకుముందు ఉన్న జెడ్ ప్లస్ భద్రతను కూడా తొలగించినట్టు దేశీ చెప్పారు.

200 కార్ల కాన్వాయ్‌తో న్యాయస్థానానికి..

కేసులో గుర్మీత్‌ను దోషిగా తెలుస్తూ పంచకులలోని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం తీర్పు వెలువరించింది. కాగా తీర్పు నేపథ్యంలో కోర్టుకు హాజరయ్యేందుకు గుర్మీత్ 200 వాహనాల కాన్వాయ్‌లో సిర్సా నుంచి పంచకులలోని సీబీఐ కోర్టుకు చేరుకున్నారు. తీర్పు వెలువరించిన అనంతరమే ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో గుర్మీత్‌ను రోహ్‌తక్‌కు తరలించి, సనోరియా జైలులో ఉంచారు. కాగా గుర్మీత్‌కు సీబీఐ కోర్టు జడ్జి జగదీప్ సింగ్ సోమవారం శిక్ష ఖరారు చేయనున్నారు.

హైకోర్టుకెళ్తాం: దేరా సచ్చా సౌదా

లైంగికదాడి కేసులో గుర్మీత్‌ను దోషిగా తెలుస్తూ సీబీఐ న్యాయస్థానం వెల్లడించిన తీర్పును వ్యతిరేకిస్తూ హర్యానా, పంజాబ్ హైకోర్టును ఆశ్రయిస్తామని డేరా సచ్చా సౌదా వెల్లడించింది. గుర్మీత్‌ను దోషిగా తేల్చడం అన్యాయమని అభిప్రాయపడింది. కార్యకర్తలు సంయమనం పాటించాలని పిలుపునిచ్చింది. మరోవైపు.. గుర్మీత్‌పై ఉన్న కేసుల పరంగా.. ఆయనకు ఏడేండ్లకు తగ్గకుండా శిక్ష పడే అవకాశాలున్నాయి.

హర్యానాలో పరిస్థితిపై రాజ్‌నాథ్‌సింగ్ అత్యున్నతస్థాయి భేటీ

గుర్మీత్ రామ్ రహీం అత్యాచార కేసు తీర్పు వెలువడిన అనంతరం హర్యానా, పంజాబ్, యూపీతో పాటు ఢిల్లీలో చేలరేగిన హింస నేపథ్యంలో.. కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అత్యున్నతస్థాయి సమావేశం నిర్వహించారు. శనివారం ఢిల్లీలోని రాజ్‌నాథ్‌సింగ్ నివాసంలో జరిగిన ఈ సమావేశానికి జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవల్, హోంశాఖ కార్యదర్శి రాజీవ్‌మెహర్షి, ఇంటలిజెన్స్ బ్యూరో చీఫ్ రాజీవ్‌జైన్, పారామిలటరీ ఉన్నతాధికారులు, హర్యానా డీజీపీ తదితరులు హాజరయ్యారు. హర్యానాతో పాటు పంజాబ్, ఢిల్లీ, రాజస్థాన్, ఢిల్లీ, యూపీలోని పరిస్థితిపై రాజీవ్‌మెహర్షి, రాజీవ్‌జైన్ సమగ్రమైన ప్రజంటేషన్ ఇచ్చినట్టు హోంశాఖ వర్గాల ద్వారా తెలిసింది. ముఖ్యంగా హర్యానాలోని పంచకుల, సీర్సాలో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా ఉందని వివరించారు. అయితే రాష్ట్రంలోని మిగతా జిల్లాలో పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నప్పటికీ ఆధీనంలో ఉందని పేర్కొన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించేందుకు, శాంతిని నెలకొల్పేందుకు చేపట్టిన చర్యలను వివరించారు. సమావేశనంతరం హోంశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. దేశంలోని అంతర్గత భద్రత ప్రధానంగా హర్యానా, దాని సరిహద్దు రాష్ట్రాల్లో, జమ్మూకాశ్మీర్‌లోని పరిస్థితిపై హోంమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారని పేర్కొంది. 'హర్యానాలోని పరిస్థితి ప్రస్తుతం నియంత్రణలో ఉంది' అని తెలిపారు. హర్యానాలో పరిస్థితిని పూర్తిగా నియంత్రణలోకి తీసుకొస్తామన్న ఆ రాష్ట్ర డీజీపీ ఇచ్చిన హామీని రాజ్‌నాథ్‌సింగ్ పరిగణలోకి తీసుకున్నట్టు వివరించారు. ఇక జమ్మూకాశ్మీర్‌లోని పుల్వామాలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై సమీక్ష జరిపినట్టు ఆ ప్రకటనలో తెలిపారు.

ఖట్టర్‌ను తొలగించాలి : సిపిఎం డిమాండ్

హర్యానాలో చెలరేగిన హింసాత్మక ఘటనలపై సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసింది. సిబిఐ కోర్టు డేరా సచ్చా సౌధ అధిపతి గుర్మీత్ రామ్ రహీం సింగ్‌ను దోషిగా ప్రకటించిన అనంతరం హింసాకాండకు చెలరేగిందని, ఈ తీర్పుపై ఆసక్తితో సిబిఐ ప్రత్యేక కోర్టు వద్ద కొద్ది రోజుల నుంచే భారీ స్థాయిలో గుర్మీత్ మద్దతు దారులు మోహరించివున్నారని పేర్కొంటూ గుర్మీత్‌కు వ్యతిరేకంగా తీర్పు వస్తే తీవ్ర స్థాయిలో వీరంతా హింసకు తెగిస్తారనే జ్ఞానం కూడా లేని బిజెపి ప్రభుత్వం, హర్యానా ముఖ్యమంత్రి తగిన చర్యలు తీసుకోవడంలో ఘోరంగా విఫలమయ్యారని సిపిఎం విమర్శించింది. రాష్ట్ర ప్రభుత్వ తీవ్రమైన వైఫల్యం మూలంగా శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని పేర్కొంది. గతంలో ముఖ్యమంత్రి, బిజెపి ఎమ్మెల్యేలు డేరా బాబా వద్దకు వెళ్లి ఆయన ఆశీస్సులు తీసుకొన్నారంటూ కథనాలు వచ్చాయని, ఆ ఆశీస్సుల ప్రభావంతోనే ప్రస్తుత హింసాత్మక పరిస్థితిపై దయార్థంగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోందని పేర్కొంది. అమాయక ప్రజల ప్రాణాలను రక్షించడంలోనూ, ప్రభుత్వ ప్రయివేటు ఆస్తులను రక్షించడంలో బిజెపి ప్రభుత్వం విఫలమవ్వడం ఇది మూడోసారి అని సిపిఎం తెలిపింది. గతంలో రామ్‌పాల్ కేసు, జాట్‌ల ఆందోళన సమయాల్లోనూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల హింసాకాండ చెలరేగిందని గుర్తు చేసింది. శాంతిభద్రతలను పరిరక్షించేం దుకు అవసరమైన అన్ని చర్యలనూ తీసుకోవాలని హైకోర్టు ఆదేశించినా ఖట్టర్ ప్రభుత్వం పెడ చెవిన పెట్టిందని సిపిఎం విమర్శించింది. హర్యానా రాష్ట్ర ప్రభుత్వ గత వైఫల్యాల చరిత్రను గుర్తు చేస్తూ ఇలాంటి తప్పిదాలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని హైకోర్టు హెచ్చరించిందని కూడా పొలిట్‌బ్యూరో పేర్కొంది. హర్యానా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి కొనసాగే నైతికత కోల్పోయారని విమర్శించింది. ముఖ్యమంత్రిని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేసింది.

రాక్ స్టార్ బాబాగా గుర్తింపు పొందిన డేరా సచ్ సౌధ (డిఎస్ఎస్) అధిపతి గుర్మీత్ ఒక అత్యాచారం కేసులో దోషిగా నిర్ధారిస్తూ సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం తీర్పు వెలువరించింది. మూడో తంతు డేరా చీఫ్‌గా 1990లో బాధ్యతలు చేపట్టిన గుర్మీత్ అరాచకాలు అన్నీ ఇన్నీ కాదు. నచ్చిన మహిళనల్లా లోబర్చుకునేవాడన్న ఆరోపణలున్నాయి. గుర్మీత్ తమపై లైంగికదాడికి పాల్పడ్డాడంటూ ఇద్దరు మహిళలు 2002లో అప్పటి ప్రధాని వాజ్‌పేయి, పంజాబ్, హర్యానా హైకోర్టుకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) విచారణ చేపట్టింది. ఈ కేసు వాదనలు ఇటీవలే ముగిశాయి. ఈ కేసులోనే డేరాను దోషిగా ప్రకటిస్తూ సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం తీర్పు వెలువరించింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం వల్లే హింస : ఐద్వా

గుర్మీత్‌పై తీర్పు అనంతరం హర్యానాలో అల్లర్లను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అఖిలభారత ప్రజాస్వామిక మహిళా సంస్థ(ఐద్వా) విమర్శించింది. బెదిరింపులకు భయపడకుండా న్యాయం కోసం పోరాడిన ఇద్దరు మహిళలను ఐద్వా అభినందించింది. బాధిత మహిళలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని ఐద్వా డిమాండ్ చేసింది. ఎన్నికల్లో లబ్ది కోసం పలు రాజకీయ పార్టీలు గుర్మీత్‌ను కాపాడేందుకు యత్నించడం వల్లే బాధిత మహిళలకు న్యాయం జరగడంలో ఆలస్యమైందని ఐద్వా స్పష్టం చేసింది. ప్రధాని మోడీ సైతం డేరా చీఫ్‌ను పొగిడారని ఐద్వా గుర్తు చేసింది. పలువురు దొంగ బాబాలను రాజకీయ పార్టీలు ప్రోత్సహిస్తున్నాయని ఐద్వా దుయ్యబట్టింది.

సాక్షి మహరాజ్ వ్యాఖ్యలు మహిళల పట్ల క్రూరత్వానికి నిదర్శనం : కేరళ సీఎం విజయన్

తిరువనంతపురం:బీజేపీ ఎంపీ సాక్షి మహరాజ్‌పై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మండిపడ్డారు. అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తిని వెనకేసుకు రావడం మహిళల పట్ల క్రూరత్వానికి నిదర్శనమని విజయన్ దుయ్యబట్టారు. మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ నేరస్తుడిది గొప్పఆత్మ అంటూ సాక్షి మహరాజ్ కొనియాడారని విజయన్ గుర్తు చేశారు. దీంతో, సంఘ్‌పరివార్ అమానుషత్వం వెల్లడైందని విజయన్ అన్నారు. ఈ సందర్భంగా జామామసీద్ షాహీ ఇమామ్‌ను ఉద్దేశిస్తూ సాక్షి మహారాజ్ చేసిన వ్యాఖ్యలు మతోన్మాదాన్ని రెచ్చగొట్టేలా ఉన్నాయని విజయన్ అన్నారు. సాక్షి వ్యాఖ్యలపై ప్రధాని మోడీసహా బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలు మౌనంగా ఉండటంతో వారు కూడా ఆయనను సమర్థిస్తున్నట్టుగా భావించాల్సి ఉంటుందని విజయన్ అన్నారు.

ఉగ్రదాడిలో ఎనిమిది మంది భద్రతా సిబ్బంది మృతి

శ్రీనగర్: సాయుధులైన ఉగ్రవాదులు పోలీసు స్టేషన్‌పై దాడి చేయడంతో ఎనిమిది మంది పోలీసులు మృతిచెందిన ఘటన పుల్వామాలో జరిగింది. సాయుధులైన కొందరు ఉగ్రవాదులు పోలీసు భవనంలో ప్రవేశించి విచక్షణా రహితంగా కాల్పులు జరుపుతూ, గ్రెనేడ్‌లు విసిరారన్నారు. ఈ దాడిలో ఇద్దరు సిఆర్‌పిఎఫ్ జవాన్లు, ఒక పోలీసు కానిస్టేబులు మృతిచెందారనీ, ఆరుగురు గాయపడ్డారనీ తెలిపారు. భద్రతా దళాలు పరిస్థితిని అదుపులోకి తీసుకొస్తుండగా, బాంబుదాడుల నేపథ్యంలో స్టేషన్‌లో అగ్నిప్రమాదం జరిగింది ఆ ప్రాంతం నుంచి ప్రజలను తరలిస్తున్నట్లు ఐజి అహ్మద్ ఖాన్ తెలిపారు. వీరిలో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుబెట్టినట్లు సమాచారం.

మధ్యప్రదేశ్‌లో 16 స్వైన్ ఫ్లూ మరణాలు

భోపాల్: మధ్యప్రదేశ్‌ను స్వైన్ ఫ్లూ పట్టి పీడిస్తోంది. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు మొత్తం 16 మంది మృతిచెందినట్లు అధికారులు ప్రకటించారు. అధికారిక లెక్కల ప్రకారం ప్రస్తుతం హెచ్1ఎన్1 వైరస్ ప్రభావంతో 44 మంది చికిత్స పొందుతున్నారు. 18 మంది ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ, 26 మంది ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ చికిత్స పొందుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రకటించారు. జులై 1 నుంచి 455 స్వైన్ ఫ్లూ అనుమానిత కేసులను పరీక్షించగా వీరిలో 101 మందికి స్వైన్ ఫ్లూ పాజిటివ్‌గా వచ్చిందన్నారు. దీనిపై ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని గ్రామస్థాయి వరకు మందులు అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. స్వైన్ ఫ్లూ లక్షణాలు కనిపిస్తే ప్రైవేటు ఆస్పత్రులు కూడా ఎలాంటి అభ్యంతరం తెలపకుండా తక్షణమే చికిత్స అందించాలన్నారు. ఆ వివరాలు ఆరోగ్య సిబ్బందికి అందించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 65 ఆస్పత్రుల్లో ఈ వ్యాధికి చిక్సిత్స అందిస్తున్నట్లు తెలిపారు. భోపాల్, ఇండోర్, జబల్‌పూర్, గ్వాలియర్‌లలో రక్తనమూనాలు పరీక్షిస్తున్నట్లు తెలిపారు.

ముంబయిలో కూలిన భవనం ఒకరు దుర్మరణం

కుర్లా: ముంబయిలో శనివారం ఆరంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ఒకరు దుర్మరణం పాలయ్యారు. శిథిలాల కింద నలుగురు చిక్కుకున్నట్లు అధికారులు తెలిపారు. కుర్లాలోని ఛండీవేలిలో సాయంత్రం ఐదు గంటల 30 నిమిషాల ప్రాంతంలో ఈ ప్రమాదం సంభవించినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కొంతమందిని సమీపంలోని రాజ్‌వాడి ఆసుపత్రిలో చేర్చగా వారిలో గౌరవ్(32) అనే వ్యక్తి మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. అయితే ఇది వరకే ఈ భవంతిని ఖాళీ చేయించామని, కూలుస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుందని అధికారులు పేర్కొన్నారు.

అమెరికా చేతిలో ఆధార్ సమాచారం

వికీలిక్స్ సంచలన ప్రకటన

వాషింగ్టన్ : అనేక రహస్యాలను ఛేదించి వెలుగులోకి తెచ్చిన వికీలిక్స్ తాజాగా మరో సంచలన విషయాన్ని బయటపెట్టింది. భారత్-అమెరికా భాయి భాయీ అని ఇటు భారత ప్రధాని మోడీ, అటు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెబుతున్నా.. ఇది వాస్తవం కాదని వికీలిక్స్ తేల్చేసింది. అంతేకాకుండా భారతీయుల వ్యక్తిగత వివరాలను అమెరికా నిఘా సంస్థ తెలుసుకునే అవకాశం వుందని వికీలీక్స్ ఆధారాలతో సహా బయటపెట్టింది. గురు, శుక్రవారాల్లో దీనికి సంబంధించిన రిపోర్ట్‌ను వెల్లడిస్తూ వరుస ట్వీట్లు చేసింది. వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు కిందకే వస్తుందని సుప్రీంకోర్టు తీర్పును వెల్లడించిన రెండురోజుల్లోనే ఆధార్ గురించి వికీలీక్స్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. అమెరికాకు చెందిన క్రాస్ మ్యాచ్ టెక్నాలజీ అనే సంస్థ ఆధార్ బయోమెట్రిక్‌కు సాఫ్ట్‌వేర్‌ను అందించింది. అదే సంస్థ రూపొందించిన ఒక సాఫ్ట్‌వేర్‌తో ఆధార్ డేటాను అమెరికా నిఘా విభాగం (అమెరికా సెంట్రల్ ఇంటిలిజెన్స్ ఏజెన్సీ-సిఐఎ) తెలుసుకునే అవకాశం వుందంటూ వికీలీక్స్ స్పష్టం చేసింది. భారతీయుల వ్యక్తిగత వివరాలన్నీ అమెరికా చేతుల్లో పడినట్లేనని వికీలీక్స్ తేల్చిచెబుతోంది. సిఐఎ ఇప్పటికే భారతీయుల ఆధార్ డేటాబేస్‌ను దొంగలించిందంటూ ఒక మేగజైన్ ఆర్టికల్‌ను కూడా ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేసింది. ఆధార్ డేటాను చౌర్యం చేసేందుకు సిఐఎలో ఆఫీస్ ఆఫ్ టెక్నికల్ సర్వీసెస్ పేరిట ఒక ప్రత్యేక బ్రాంచ్ కూడా వుందని వికీలీక్స్ స్పష్టం చేస్తోంది. అయితే భారత అధికారులు మాత్రం వికీలీక్స్ ప్రకటనను కొట్టిపారేస్తున్నారు. ఆధార్ డేటాబేస్‌ను అమెరికాకు చెందిన క్రాస్ మ్యాచ్ టెక్నాలజీ అనే సంస్థ చౌర్యం చేసే అవకాశమే లేదని స్పష్టం చేస్తున్నారు. బయోమెట్రిక్ వివరాలను సేకరించేందుకు వాడిన టూల్స్‌ను మాత్రమే ఈ సంస్థ ఇచ్చిందనీ, వీటి ద్వారా డేటాను అమెరికాకు చేరవేయలేరని చెబుతున్నారు. ఆధార్ డేటాను ఏ ఇతర సంస్థ యాక్సెస్ చేయలేదనీ, భారతీయుల వివరాలన్నీ భద్రంగా ఉన్నాయంటున్నారు.



గుర్మీత్ సింగ్ సూట్‌కేస్ మోసిన హర్యానా డిప్యూటీ అడ్వకేట్ జనరల్ తొలగింపు



చంఢీఘర్ : అత్యాచార కేసులో దోషిగా వున్న బాబా గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ సూట్‌కేస్ మోసినం దుకుగానూ హర్యానా డిప్యూటీ అడ్వకేట్ జనరల్ గురుదాస్ సింగ్ సల్వారాను సస్పెండ్ చేశారు. గుర్మీత్ సింగ్‌కు వివిఐపి ట్రీట్‌మెంట్ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో హర్యానా ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. ఈ విషయాన్ని హర్యానా అడ్వకేట్ జనరల్ బాల్‌దేవ్ మహాజన్ ధృవీకరించారు. గుర్మీత్ సింగ్ తన బంధువు అని డిప్యూటీ అడ్వకేట్ జనరల్ తెలిపినట్లు బాల్‌దేవ్ మహాజన్ వెల్లడించారు. కాగా గుర్మీత్ సింగ్‌కు జైలులో ఎలాంటి ప్రత్యేక సదుపాయాలు కల్పించడం లేదని హర్యానా ప్రధాన కార్యదర్శి దేపిందర్ సింగ్ దేశి శనివారం తెలిపారు. హింసాకాండకు పాల్పడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఆర్టికల్ 35(ఎ)పై దీపావళి తర్వాత విచారణ

న్యూఢిల్లీ: జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక హక్కులు కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 35(ఎ)పై దీపావళి తర్వాత విచారించనున్నట్లు శుక్రవారం సుప్రీం కోర్టు తెలియజేసింది. చీఫ్ జస్టిస్ జె.ఎస్.ఖేహర్, జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌ల నేతృత్వంలోని ధర్మాసనం ఆ మేరకు తెలియజేసింది. సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది, షోయబ్ ఆలంలు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. విధానపరమైన ఇబ్బందులు తలెత్తిన పక్షంలో, అవసరమైతే ఐదుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం దృష్టికి తీసుకుపోనున్నట్లు తెలిపారు. వివాహ అనంతరం ఇతర రాష్ట్రాలకు వెళ్లే మహిళలకు, ఆమె పిల్లలకు కూడా హక్కులు లేకపోవడం వంటి అంశాలను ఛాలెంజ్ చేస్తూ న్యాయవాది చౌరువాలి కన్నా సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఆ ఆర్టికల్‌లోని సెక్షన్ 6 జమ్ముకాశ్మీర్‌ని మహిళలకు కనీస హక్కులు కూడా లేకుండా చేస్తోందని పేర్కొన్నారు. మహిళలు కనీసం శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రానికి కూడా దూరంగా ఉండడం తదితర అంశాలపై పిటిషన్ దాఖలైంది. 1954లో రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా ఈ ఆర్టికల్ రాజ్యాంగంలో పొందుపరిచారు. తద్వారా కాశ్మీర్ ప్రజలకు ప్రత్యేక హక్కులు కల్పించారు. రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వపు హక్కులతో కూడా సంబంధం లేకుండా నేరుగా శాసనసభ తీర్మానం ద్వారా నిర్ణయం తీసుకునే హక్కులను ఈ ఆర్టికల్ కల్పిస్తోంది. జమ్ముకాశ్మీర్ నాన్ పర్మినెంట్ రెసిడెన్స్ సర్టిఫికేట్ ఉన్న వారు కనీసం లోక్‌సభ ఎన్నికలు, స్థానిక ఎన్నికల్లో ఓటు వేయడానికి కూడా అవకాశం లేకుండా పోతుందని వారు పిటిషన్‌లో దాఖలు చేశారు.

చెరువులో ఆవు కళేబరం

● మైనార్టీలపై గో గూండాల దాడి ● యుపిలో ఘోరం

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లోని బులందర్‌షా జిల్లా దౌలి గ్రామంలో హిందూత్వ శక్తులు విధ్వంసం సృష్టించాయి. గ్రామానికి చెందిన చెరువులో ఒక ఆవు కళేబరం కనపడటంతో ఆగ్రహించిన హిందూ యువ వాహినికి చెందిన సభ్యులు గ్రామంలోని మైనార్టీలపై విధ్వంసం సృష్టించారు. ఆస్తిని ధ్వంసం చేశారు. ఇళ్ళను తగలబెట్టారు. వారి కంటబడ్డ ప్రతి ఒక్కరిపై దాడి చేశారు. ప్రత్యేకంగా ఒక కమ్యూనిటీకి చెందిన మత కట్టడాలను లక్ష్యంగా చేసుకుని దాడికి పూనుకున్నారు. హిందూ యువ వాహినికి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలో ఉంది. హిందూత్వ శక్తుల దాడుల తరువాత మరిన్ని దాడులు జరుగుతాయన్న భయాందోళనలతో గ్రామంలోని పలు కుటుంబాలు వారి నివాసాలను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్ళాయి. ఒక ప్రముఖ పత్రిక ఈ దాడుల ఘటనకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేసింది. ఈ దాడులపై ఎస్‌పి ప్రవీణ్ రంజన్ మాట్లాడుతూ గ్రామంలో ఏడు పోలీసు స్టేషన్లకు చెందిన సిబ్బందితో పాటు పిఎసి బెటాలియన్‌ను కూడా మోహరించినట్లు చెప్పారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని చెప్పారు. దాడికి పాల్పడిన ఏ ఒక్కరినీ ఉపేక్షించేది లేదన్నారు. ఆవు కళేబరానికి పోస్ట్‌మార్టం నిర్వహించిన తరువాత దానిని పూడ్చిపెడతామని పోలీస్ సూపరింటెండెంట్(గ్రామీణ) ప్రదీప్ కుమార్ తివారి తెలిపారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చి, కొంతమందిని ప్రశ్నించి వదిలివేసిన తరువాత హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయి.

పురోహిత్ దోషే..

న్యూఢిల్లీ: మళ్లీ విధుల్లోకి చేరాలని ఆశపడుతున్న లెఫ్టినెంట్ కన్నల్ శ్రీకాంత్ ప్రసాద్ పురోహిత్ గట్టి ఎదురు దెబ్బతగిలింది. ఆయుధ ఒప్పందాల్లో పురోహిత్ అక్రమాలకు పాల్పడినట్లు సైనిక విచారణలో వెల్లడయింది. లంచాలకు ఆశపడి పురోహిత్ ఆయుధ ఒప్పందాల్లో అక్రమాలు చేశాడని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఇంటెలిజన్స్ (డిజిఎంఐ) తన నివేదికలో తెలిపింది. 2008 మలేగావ్ పేలుళ్ల కేసులో సోమవారం సుప్రీంకోర్టు బెయిల్ మంజారు చేసింది. దీంతో నవీ ముంబయిలో తలోజ జైలు నుంచి పురోహిత్ విడుదలయ్యాడు. మళ్లీ విధుల్లో చేరాలని భావిస్తున్నాడు

బీహార్‌కు రూ. 500 కోట్లు కేంద్ర సహాయం

పూర్ణియా : వరదలతో అల్లాడుతున్న బీహార్‌కు రూ. 500 కోట్ల తక్షణ సహాయాన్ని ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించారు. వరద ముంపునకు గురైన ప్రాంతాలను శనివారం ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తులు కుటుంబానికి రూ. 2 లక్షల పరిహారాన్ని ప్రకటించారు. వరదల నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర బృందాన్ని పంపుతామని తెలిపారు. రైతులకు త్వరగా పరిహారాన్ని చెల్లించాలని బీమా సంస్థలకు ఆదేశాలు ఇచ్చారు.




ఉత్తర కొరియాపై జపాన్ తాజా ఆంక్షలు

టోక్యో : ఉత్తర కొరియాపై తాజా ఆంక్షలు విధించనున్నట్లు జపాన్ తెలిపింది. ఉత్తర కొరియాతో సమీకృత కంపెనీలు చేస్తున్న వ్యాపారాన్ని, చైనా ఆస్తులను నిలిపివేయడం ద్వారా ఉత్తర కొరియాపై ఆంక్షలు విధించనున్నట్లు తెలిపింది. చైనా, రష్యా కంపెనీలతో పాటు ఉత్తర కొరియాతో సంబంధాలున్న వ్యక్తులపై అమెరికా ఆంక్షలు విధించిన కొద్ది రోజుల అనంతరం జపాన్ కూడా ఆంక్షలను పునఃసమీక్షించడం గమనార్హం. అణ్వాయుధాలను విడనాడే దిశగా చర్యలు తీసుకోవాలని ఉత్తర కొరియాను పలు మార్లు హెచ్చరించామని జపాన్ ప్రభుత్వ ప్రతినిధి యోషిదే సుగా తెలిపారు. ఇప్పుడు ఉత్తర కొరియాపై ఒత్తిడి తెచ్చే సమయం వచ్చిందని ఆయన పేర్కొన్నారు.

పాక్ విదేశాంగ మంత్రి మూడు దేశాల పర్యటన

అఫ్గాన్‌పై అమెరికా విధానాన్ని చర్చించేందుకే...

ఇస్లామాబాద్: అఫ్ఘనిస్తాన్, దక్షిణాసియాలపై అమెరికా ఇటీవల ప్రకటించిన నూతన విధానంపై చర్చించేందుకు పాక్ విదేశాంగ మంత్రి ఖవాజా మహ్మద్ మూడు దేశాల్లో పర్యటించనున్నారు. చైనా, రష్యా, టర్కీల్లో వచ్చే వారం పర్యటించనున్నట్లు పాకిస్తాన్ అధికారులు ప్రకటించారు. గురువారం నాటి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. అఫ్ఘనిస్తాన్‌లో శాంతిని స్థాపించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించడమే ఈ పర్యటన లక్ష్యమని విదేశాంగ మంత్రి అధికార ప్రతినిధి నఫీజ్ జకారియా చెప్పారు.




మయన్మార్‌లో 'రోహింగ్యా'ల దాడి 71 మంది మృతి

న్యూఢిల్లీ: మయన్మార్‌లో రోహింగ్యా ముస్లిం తిరుగుబాటుదారులు వరుస దాడులకు పాల్పడ్డారు. గురువారం అర్ధరాత్రి ఒంటి గంట నుంచీ 30 పోలీసు పోస్టులు, రఖైన్‌లోని సైనిక శిబిరంపై రోహింగ్యా తిరుగుబాటుదారులు దాడి చేశారని, ఈ దాడుల్లో 12 మంది భద్రతా దళ సభ్యులు సహా 71 మంది చనిపోయారని మయన్మార్ ప్రభుత్వం ప్రకటించింది. వారిలో ఒక సైనికుడు, ఒక ప్రవాసాధికారి, పది మంది పోలీసులు, 59 మంది తిరుగుబాటుదారులు వున్నట్లు ఆంగ్‌సాన్ సూకీ ప్రభుత్వం వెల్లడించింది. పలుచోట్ల ఇంకా దాడులు కొనసాగుతున్నాయని ప్రకటించింది. అర్కాన్ రోహింగ్యా సాల్వేషన్ ఆర్మీ(అర్సా) (అంతకుముందు హరకా అల్ యాఖీన్‌గా ఈ సంస్థ ప్రాచుర్యం పొందింది) ఈ దాడికి పాల్పడినట్లు పేర్కొంది. గతేడాది అక్టోబరు నుంచీ వాయవ్య మయన్మార్‌లో రోహింగ్యా ముస్లింలు పౌరసత్వ హక్కుల కోసం పోరాడుతున్న సంగతి తెలిసిందే. దీంతో భద్రతా దళాలు వారిపై అణిచివేత చర్యలకు పాల్పడ్డాయి. ఈ నేపథ్యంలో తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘన జరిగినట్లు పలు మానవ హక్కుల సంస్థలు తెలిపాయి.

'అనర్హత తీర్పు'ను సవాల్ చేసిన షరీఫ్ కుటుంబ సభ్యులు

ఇస్లామాబాద్ : బహిష్కృత పాక్ ప్రధాన మంత్రి నవాజ్ షరీఫ్‌పై అనర్హతా వేటు వేస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఆయన కుటుంబం సవాల్ చేసింది. నవాజ్ షరీఫ్‌పై అనర్హతా వేటు వేయడమే కాకుండా, పనామా పేపర్ల కుంభకోణంలో ఆయన పిల్లలతో సహా ఆయనపై అవినీతి ఆరోపణలు చేయడాన్ని కూడా సవాల్ చేసింది. అవినీతి కేసు దర్యాప్తు నేపథ్యంలో ప్రధాన మంత్రిగా షరీఫ్ అనర్హుడని కోర్టు తీర్పునిచ్చిన తరువాత ఆయన జులై 28న పదవికి రాజీనామా చేశారు.. కాగా షరీఫ్ పిల్లలపై వచ్చిన అవినీతి కేసులను దర్యాప్తు చేయాలని కూడా కోర్టు ఆదేశించింది. దీనికి సంబంధించిన నవాజ్ షరీఫ్ కుమారులు హుస్సేన్, హస్సన్, కుమార్తె మర్యామ్, అల్లుడు కెప్టెన్(రిటైర్డ్) మహ్మద్ సఫ్దార్ పిల్లలు తమ న్యాయవాది సల్మాన్ అక్రమ్ రాజా ద్వారా సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు.

అమెరికా కుట్రల్ని అడ్డుకుంటాం



- వెనిజులాపై ఆంక్షల్ని ఖండించిన మదురో
- ప్రజల మద్దతుతో తిప్పికొడతామని వ్యాఖ్య

కారకాస్/వాషింగ్టన్: వెనిజులాపై ఆర్థిక, వాణిజ్య ఆంక్షలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం ఆదేశాలు జారీ చేయడాన్ని ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో ఖండించారు. ఇప్పుడిప్పుడే ఆర్థిక సంక్షోభం నుంచి తేరుకుంటున్న వెనిజులాను ఆర్థికంగా దెబ్బతీయాలనే అమెరికా కుట్రల్ని ప్రజా మద్దతుతో అడ్డుకుని తీరుతామన్నారు. అమెరికా ప్రకటన అనంతరం ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో శనివారం నుంచి రెండ్రోజుల పాటు సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు మదురో ప్రకటించారు. తాజా ఆంక్షలు ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత దిగజారుస్తాయని ఆయన పేర్కొన్నారు. మదురో నియంతృత్వం పాలన అనే సాకుతో వెనిజులాకు కొత్తగా రుణ సాయాన్ని నిలిపేస్తున్నట్లు అమెరికా శుక్రవారం ప్రకటించింది. దీనిపై స్పందించిన మదురో మీడియాతో మాట్లాడుతూ వెనిజులాపట్ల అమెరికా ప్రవర్తిస్తున్న తీరుపై ఇదివరకే హెచ్చరించినట్లు తెలిపారు. చరిత్రలో ఇరు దేశాల మధ్య ఇంత బలహీన సంబంధాలు ఇరు దేశాల మధ్య ఎప్పుడూ నెలకొనలేదని మూడు రోజుల క్రితమే ఆయన విమర్శించిన సంగతి తెలిసిందే. అయితే ఆ కుట్రల్ని సాగనీయబోమని, భవిష్యత్తులో వెనిజులా మరింత బలంగా, స్వేచ్ఛగా, స్వతంత్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

వెనిజులాపై ఆంక్షల ప్రభావమెంత?

చమురు నిక్షేపాలు ఎక్కువగా వున్న వెనిజులాలో గత కొంతకాలంగా ఆర్థిక సంక్షోభం నెలకొంది. ఆ దేశ ఆదాయంలో 95 శాతం చమురు ఎగుమతుల ద్వారానే వస్తుంది. కొన్ని చమురు బావుల్లో అమెరికా రిఫైనరీ సంస్థలే ఉత్పత్తి చేస్తాయి. అయితే తాజా ఆంక్షల నేపథ్యంలో అమెరికా చమురు శుద్ధి సంస్థ 'సిట్గో' 'పెట్రోలియం ఉత్పత్తిని నిలిపేసింది. వెనిజులా ప్రభుత్వ చమురు సంస్థ 'పిడివిఎస్ఎ'లో 'సిట్గో' భాగస్వామ్య సంస్థ కావడంతో మొత్తం ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడింది. అమెరికాకు తమ దేశం నుంచి చమురు ఎగుమతుల్ని అడ్డుకుని, తద్వారా తమను ఎగవేతదారులుగా ప్రకటించేందుకు ట్రంప్ ప్రభుత్వ లక్ష్యమని మదురో విమర్శించారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వ చమురు సంస్థల్లోని అమెరికా క్లయింట్లతో ఆయన అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మరోవైపు తాజా ఆంక్షలతో అమెరికా నుంచి ఎటువంటి ఆర్థిక సాయం వచ్చే అవకాశం లేదు. అయితే అనూహ్యంగా ఆంక్షల కుట్రతో అమెరికా ముందుకు రావడంతో వెనిజులా చమురు పరిశ్రమలు తీవ్ర సంక్షోభం ఎదుర్కోనున్నాయి. ఈ నేపథ్యంలో ఇది వరకే భారీగా సాయమందించిన మిత్రదేశాలు చైనా, రష్యాల వైపు మదురో సాయం కోసం చూస్తున్నారు.

అమెరికాది యుద్ధ దాహం?

తాజా ఆంక్షలకు అమెరికా యుద్ధ దాహం కూడా కారణమని విశ్లేషకులు పేర్కొన్నారు. నిజానికి చమురు దిగుమతులను దృష్టిలో పెట్టుకునే ఇప్పటివరకూ వెనిజులాపై ఆర్థిక ఆంక్షలు విధించలేదని, అతి త్వరలోనే మరిన్ని ఆంక్షలు ప్రకటించే అవకాశముందని పలువురు అభిప్రాయపడ్డారు. మరోవైపు దేశంపై సైనిక చర్యలకు కూడా దిగే అవకాశముందని పేర్కొన్నారు. అమెరికా భద్రతా సలహాదారు హెచ్ఆర్ మెక్‌మాస్టర్ ఈ వాదనను కొట్టిపారేశారు.

ముందుకొచ్చిన రష్యా

పిడివిఎస్ఎను గట్టెక్కించేందుకు రష్యా ప్రభుత్వం ముందుకొచ్చింది. పిడివిఎస్ఎ ఉత్పత్తిని స్థిరీకరించేందుకు రష్యా చమురు సంస్థ రోజ్‌నెఫ్ట్ సంసిద్ధత వ్యక్తం చేసింది.

టెక్సాస్‌ను అతలాకుతలం చేస్తున్న హరికేన్ హార్వే

టెక్సాస్ : టెక్సాస్‌ను అతలాకుతలం చేస్తున్న హరికేన్ హార్వే శనివారం ఉదయానికి మరింత బలపడే అవకాశాలున్నాయని నేషనల్ హరికేన్ సెంటర్ ప్రకటించింది. హరికేన్ హార్వే శుక్రవారం నాటికి దక్షిణ టెక్సాస్ తీర ప్రాంతాన్ని తాకడంతో భారీ వర్షాలు కురుస్తున్నాయని పేర్కొంది. ఇది శుక్రవారం ఉదయానికి మరింత బలపడి ఉధృతం కానున్నట్లు హరికేన్ సెంటర్ పేర్కొంది. గడిచిన 12 ఏళ్లలో అమెరికాలో సంభవించిన హరికేన్‌లలో ఇదే అత్యంత శక్తివంతమైంది. ఇది శుక్రవారం సాయంత్రానికి గాని, శనివారం ఉదయానికి గాని దక్షిణ టెక్సాస్ నగరాన్ని సమీపిస్తుందని, దీని ప్రభావం వల్ల అక్కడ భారీ వర్షాలతో పాటు ఆకస్మిక వరదలు సంభవించనున్నాయి.. అమెరికాలో 2005లో సంభవించిన విల్మా హరికేన్ తరువాత అత్యంత ప్రమాదకరమైన హరికేన్‌గా దీన్ని పేర్కొంటున్నారు. హరికేన్ తన గమనాన్ని, స్వభావాన్ని మార్చుకుంటున్న సమయంలో పెద్ద ఎత్తున వీస్తున్న ఈదురు గాలులు తాత్కాలికంగా నిలిచిపోవటానికి అనంతరం బలమైన గాలులు వీచే అవకాశముందని పేర్కొంది. ఇప్పటికే తీర ప్రాంతంలోని కొన్ని వందల మైళ్ళ దూరం హరికేన్ ప్రభావాన్ని ఎదుర్కొంటుంది.

క్షిపణులు ప్రయోగించిన ఉత్తర కొరియా

అన్నీ విఫలమయ్యాయి : అమెరికా

సియోల్/టోక్యో: ఓ వైపు అమెరికా, ద.కొరియా భద్రతా దళాలు సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహిస్తుండగా...మరోవైపు ఉత్తర కొరియా ఒకేసారి మూడు క్షిపణులను ప్రయోగించింది. దీంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శాంతి యుద్ధం చేసేందుకే సరిహద్దు వద్ద అమెరికా దళాలు మోహరించాయని గత నెల రోజులుగా ఆరోపిస్తున్న ఉత్తర కొరియా శనివారం వరుసగా మూడు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. అయితే తక్కువపాటి సామర్థ్యం కలిగిన ఈ మూడు క్షిపణులు విఫలమయ్యాయని హవాయిలోని అమెరికా పసిఫిక్ కమాండ్ పేర్కొంటోంది. మొదటి, చివరి క్షిపణులు లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలంకాగా, రెండో క్షిపణి ప్రయోగించిన కొద్ది సేపటికే పేలిపోయినట్లు, విఫలమైన రెండు క్షిపణులు జపాన్ సముద్ర ప్రాంతంలో పడినట్లు అది పేర్కొంటోంది.అయితే ఉత్తర కొరియా మాత్రం అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. ఉత్తరకొరియా తాజా క్షిపణి ప్రయోగాల నేపథ్యంలో జపాన్ ఆకస్మాత్తుగా సైనిక విన్యాసాలు నిర్వహించింది.



ఐరాస సూచన పాలస్తీనా విజయం

స్వాగతించిన బొలీవియా, ఉరుగ్వే

ఐక్యరాజ్యసమితి: ఇజ్రాయెల్, పాలస్తీనా వివాదం పరిష్కారానికి ఐక్యరాజ్యసమితి కీలక సూచన చేసింది. పాలస్తీనా భూభాగాన్ని ఇజ్రాయెల్ ఆక్రమించుకోవడం అడ్డుకట్ట వేసేందుకుగాను ఇరు దేశాలు మధ్య చర్చలు నిర్వహించి సమస్య పరిష్కారానికి మార్గం సుగమం చేయాలని ఐరాస సహ కార్యదర్శి మిరోస్లావ్ జెంకా..భద్రతా మండలికి సూచించారు. దీనిపై పాలస్తీనా హర్షం వ్యక్తం చేసింది. ఇది తమ విజయంగా పేర్కొంది. మరోవైపు ఐరాస సూచనను తాత్కాలిక సభ్య దేశాలైన బొలీవియా, ఉరుగ్వేలు పూర్తిగా సమర్థించాయి. ఐదు శాశ్వత సభ్య దేశాలు, మిగిలిన ఎనిమిది తాత్కాలిక సభ్య దేశాలు కూడా స్వాగతించాయి. ఆ వివాదంపై మిరోస్లావ్ మాట్లాడుతూ "ఇజ్రాయెల్ దురుసుకు చర్యలు రెండు దేశాల మధ్య వివాదానికి ఆజ్యం పోస్తున్నాయి. దీని వల్ల విచ్ఛిన్నకర శక్తులు లబ్ధి పొందుతాయి. కొన్ని నగరాల్లోని జనాభా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోనుంది" అని హెచ్చరించారు. ఇటీవల పాత నగరాల్లో తలెత్తిన ఘర్షణలు, హింసాత్మక దాడులను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. అంతర్జాతీయ శాంతిని దృష్టిలో పెట్టుకుని సామరస్యపూర్వకమైన పరిష్కారం దిశగా అడుగులు వేయాలని ఐరాస భద్రతా మండలికి జెంకా సూచించారు.

మొదటి పేజీ తరువాయి

మేటి నగరంగా కాకినాడ

సమూలంగా అభివృద్ధి చేసి మురుగు నీరు రోడ్లపై లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. రూ.300 కోట్లతో రోడ్లు అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరికీ సొంతిల్లు కట్టించేందుకు ప్రయత్నిస్తున్నామని, అచ్చంపేటలో ఉన్న స్థలంలో రూ.4,500 కోట్లతో ఇళ్లు నిర్మిస్తామన్నారు. రూ.255 కోట్లు ఖర్చు చేసి 2019 నాటికి ప్రతి ఇంటికీ నిరంతరం నీరు ఇచ్చే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కాకినాడను పారిశ్రామిక నగరంగా తీర్చిదిద్దుతామని, విశాఖ నుండి కాకినాడ వరకూ పెట్రో కారిడార్ రానుందని తెలిపారు.

అరాచక శక్తులు అనాలా? వద్దా?

నంద్యాలలో తనను జగన్ కాల్చేయాలని, నడిరోడ్డుపై ఉరి వేయాలని, బట్టలు ఊడదీయాలని, చెప్పుతో కొట్టాలని చెబుతున్నారని చంద్రబాబు అన్నారు. ఇలాంటి భాషవాడే వారిని అరాచక శక్తులు అనాలా? వద్దా? అని ప్రశ్నించారు. రాజకీయాలకు పనికిరానివారికి ఓటేస్తే మురిగిపోతుందని అన్నారు. కాంగ్రెస్, వైసిపిలు అధ్యక్షులు భూకబ్జాలు, ఎటిఎం దొంగలు, క్రికెట్ బుకీలు రాజ్యమేలుతున్నారని అన్నారు. కాకినాడలో రూ.50 వేల కోట్ల ప్రభుత్వ భూమిని మాజీ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మామ గోపాలకృష్ణారెడ్డి దోచుకున్నారని, దానిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పవన్ కళ్యాణ్ ఉద్దానం కిడ్నీ బాధితులను ఆదుకోవాలని కోరారని, వారందరికీ రూ.2,500 చొప్పున పింఛన్లు ఇచ్చి ఆదుకున్నామన్నారు. సీట్ల సర్దుబాటులో కొందరికి అన్యాయం జరిగిందని, వారందరికీ న్యాయం చేస్తామని చెప్పారు.

బిసిలకు 00.1 నష్టం లేకుండా కాపు రిజర్వేషన్లు

కాపులకు రూ. వెయ్యి కోట్లు ఇచ్చిన ఘనత టిడిపిదేనన్నారు. బిసిలకు 00.1 శాతం కూడా నష్టం జరగకుండా కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. త్వరలోనే మంజునాథ కమీషన్ నివేదిక వస్తుందని, ఆ నివేదిక వచ్చిన వెంటనే కేంద్రానికి పంపి రిజర్వేషన్లు కల్పించే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. గత ఎన్నికల మ్యానిఫెస్టోలో కాపుల గురించి హామీ ఇచ్చి ఆ తర్వాత పట్టించుకోని వారు విమర్శిస్తున్నారన్నారు. టిడిపి సభ పెట్టి బిసిని దెబ్బతీయాలని చూశారని అన్నారు. బిసిలు 35 ఏళ్లుగా టిడిపికి వెన్నెముకగా ఉన్నారన్నారు. వారిని ఆదుకునేందుకు బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించానని చెప్పారు. ఎన్నికల సభల్లో రాష్ట్ర మంత్రులు నారాయణ, కళా వెంకటరావు, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు, కాకినాడ ఎంపి తోట నరసింహం, ఎంఎల్‌ఎలు వనమాడి కొండబాబు, పిల్లి అనంతలక్ష్మి, కార్పొరేటర్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల ఫలితంపై ఉత్కంఠ

ఎక్కువ ఓట్లు ఉన్న నంద్యాలలో తామే గెలుస్తామంటూ టిడిపి గట్టిగా చెబుతోంది. దీనికితోడు రోజుకో రకమైన గందరగోళంతో సర్వేలు వెలువడుతున్నాయి. హెచ్‌ఎంటివి చేసిన సర్వేలో వైసిపికి అనుకూలంగా ఉందని మహా టివి చేసిన సర్వేలో టిడిపికి అనుకూలంగా ఉందని వచ్చింది. ఇండిపెండెన్స్ వర్గాల సర్వే కూడా వైసిపి గెలుస్తుందని అంచనా వేసింది. సర్వేలో ప్రత్యేక ఓట్ల గణనలో టిడిపి గెలుస్తుందని చెబుతున్నారు. బరిలో ఉన్న బిజెపి, వైసిపిలకు సర్వేలు గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. మొత్తంగా ఉప ఎన్నిక ఉత్కంఠ సోమవారం వీడిపోతుంది. సోమవారం జరిగే కౌంటింగ్‌కు పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాట్లు చేశారు. ఈ కౌంటింగ్‌కు దాదాపుగా 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. దాదాపుగా 18 రౌండ్లలో కౌంటింగ్‌ను నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఇప్పటికే అధికారులకు కూడా శిక్షణ ఇచ్చారు.

కూకట్‌పల్లి కాలనీల్లోకి నురగ ప్రవాహం

ముందే పసిగట్టిన కొందరు స్థానికులు ఇళ్ల నుంచి బయటకి రాగా మరికొందరు ఇళ్లలోనే చిక్కుకున్నారు. గతంలో కూడా పలుమార్లు ఇటువంటి సమస్య వచ్చిందని, అధికారులు, ఎమ్మెల్యే, కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం కురిసిన వర్షానికి కూడా కలుషితజలాలు వరద కాలనీలకి వచ్చి చేరింది. ఎమ్మెల్యే వివేకానంద, జిహెచ్‌ఎంసీ అధికారులు ధరణినగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పర్యటించారు. చెరువుల్లో పేరుకుపోయిన నురగ ప్రవాహం కాలనీల్లోకి రాకుండా చెరువు అలుగు వద్ద ఇసుక బస్తాలు అడ్డుగా పెడుతున్నట్లు బల్దియా అధికారులు తెలిపారు.

దోమల నియంత్రణ ఉత్తర్వులేమయ్యాయి?

- విభజన ముందొచ్చిన ఆ జీఓ ఊసే లేదు
- 'సిరా' పై మార్గదర్శకాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దోమల వ్యాప్తిని నివారించేందుకు 'దోమల పై దండయాత్ర' వంటి కార్యక్రమాలను చేపట్టినా, 'మస్కిటో బ్రీడింగ్ ప్రివెన్షన్ యాక్ట్' తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నా ఏమాత్రం ప్రయోజనం కనిపించడంలేదు. ఉమ్మడి రాష్ట్రంలో దోమల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టేలా సిద్ధం చేసిన 'సిరా' మార్గదర్శకాలను మాత్రం ప్రభుత్వం మరుగున పడేసింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దోమల నివారణకు ప్రత్యేకంగా చేపట్టాల్సిన చర్యలు వివరిస్తూ సర్వేలెన్స్, ఇన్వెస్టిగేషన్, రెస్పాన్స్, అనాలిసిస్ (సిరా) మార్గదర్శకాలతో ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో చేసిన ఉత్తర్వుల విషయంలో రాష్ట్ర విభజన తరువాత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విడిగా మళ్లీ ఉత్తర్వులు జారీ చేయాలి. విభజనానంతరం ఆ ఉత్తర్వులను ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోవడం మానేసింది. దీంతో ఇప్పటికి ఉన్న దోమల సమస్య, వాటి ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు మరింత ఎక్కువై రోగాల బారిన పడే వారి సంఖ్య కూడా పెరిగింది. గతంలో దోమల నివారణకు ఉన్న ఆ మార్గదర్శకాలను పాటిస్తే దోమల నివారణకు కొంత మేర సాధ్యపడేది.

'సిరా' మార్గదర్శకాలివే

- దోమల నివారణకు గతంలో మున్సిపల్ శాఖ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రధానంగా నాలుగు అంశాలపై దృష్టి పెట్టాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వాటిలో సర్వేలెన్స్ లో భాగంగా దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు యాంటీ లార్వల్ ఆపరేషన్ బృందాలు క్షేత్ర స్థాయిలో పర్యటించి వ్యాధులు ప్రబలే అవకాశమున్న ప్రాంతాలను గుర్తించాలి. ఆ ప్రాంతంలో లార్వా పెరుగుదలకు ఉన్న అవకాశాలు, దోమల సాంద్రత వంటి వివరాలను నమోదు చేయాలి. దోమలు వృద్ధి చెందేందుకు ఆస్కారమున్న నీటి నిల్వ ప్రదేశాలను గుర్తించి, వాటిని తొలగించేందుకు తగిన చర్యలు చేపట్టేలా నివేదిక తయారు చేయాలి.
- దోమల సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అక్కడి ఆరోగ్య అధికారి సమక్షంలో యాంటీ లార్వల్ ఆపరేషన్ సిబ్బంది ద్వారా తరచూ సమీక్షలు నిర్వహించాలి. ఎప్పటికప్పుడు దోమల తీవ్రత నివేదికను కమిషనర్‌కు, ప్రధాన ఆరోగ్యాధికారికి అందజేయాలి. ఆ నివేదిక ప్రకారం ప్రాజెక్ట్ ఆఫీసర్ చర్యలు తీసుకోవాలి. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధుల తీవ్రతపై సామాజిక మాధ్యమాలు, మీడియా ద్వారా వచ్చే సమాచారాన్ని, ఫిర్యాదులను పరిగణలోకి తీసుకొని ఎప్పటికప్పుడు నివారణకు తీసుకుంటున్న చర్యలను విశ్లేషించుకోవాలి. వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలను హాట్ స్పాట్లుగా గుర్తించాలి.
- దోమల సమస్య, వ్యాధుల ప్రభావం పై వివిధ మాధ్యమాలు, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఆ ప్రాంతాల్లో నీరు ఉంటే లార్విసైడ్ గాని, చేప పిల్లల ద్వారాగాని లార్వా పెరగకుండా చూడాలి. వాటితోపాటుగా కెమికల్ (స్ప్రే, ఫాగింగ్ (పొగ) వంటి చర్యలతోపాటు పోస్టర్లు, కరపత్రాలు, డోర్ స్టిక్కర్లు, బృంద సమావేశాల ద్వారా దోమల నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఆరోగ్య అధికారులు ఎప్పటికప్పుడు ఆ కార్యక్రమాలను పర్యవేక్షించాలి.
- దోమల నివారణ చర్యల్లో చేపట్టిన మలేరియా, డెంగ్యూ వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల తీవ్రత ఎలా ఉందో అధికారుల స్థాయిలో ఎప్పటికప్పుడు విశ్లేషించుకోవాలి. ఈ చర్యలన్నీ అమలు చేస్తే దోమలను, వాటి ద్వారా వ్యాపించే రోగాలను కట్టడిగా నియంత్రించవచ్చని పలువురు సామాజిక వేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ మార్గదర్శకాలనే అమలయ్యేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతున్నారు.



పళని సరికొత్త వ్యూహం

(మొదటిపేజీ తరువాయి)

వర్గంలోని దినకరన్ అనుచరగణం 19 మంది ఎంఎల్‌ఎలు, మరో ముగ్గురు భాగస్వామ్య పార్టీలకు చెందిన ఎంఎల్‌ఎలు ఇప్పటికే గవర్నర్‌కు విన్నవించారు. అయితే గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్‌రావు తన అభిప్రాయాన్ని ఇంతవరకూ వ్యక్తీకరించలేదు. మరోవైపు ప్రతిపక్ష నేత స్టాలిన్ (డిఎంకె).. సర్కారు బలనిరూపణ చేసుకోవాలని పట్టిడి తేవడంతో కంగుతిన్న పళనిస్వామి, పన్నీరు సెల్వం ఆలోచనలో పడ్డారు. బిజెపి అగ్రనాయకత్వాన్ని సంప్రదిస్తూ తదుపరి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యుల సంఖ్యను తగ్గించడం ద్వారా తమకు ఉన్న మైనార్టీని మెజారిటీగా మార్చుకునేందుకు వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు గుట్కా ఆరోపణలను తెరపైకి తెచ్చారు. ఈ విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న 20 మంది డిఎంకె ఎంఎల్‌ఎలపై కేసు బనాయించి సస్పెండ్ చేయాలని వ్యూహరచన చేస్తున్నారు. ఆ తరువాత విప్‌ను ధిక్కరించిన 19 మంది దినకరన్ ఎంఎల్‌ఎలకూ, మరో ముగ్గురు భాగస్వామ్య ఎంఎల్‌ఎలను సస్పెండ్ చేయాలన్నది వీరి ఆలోచన. 234 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను జయలలిత మృతితో 233 అయ్యింది. నిషేధిత గుట్కా ఆరోపణల్లో ఇరుక్కున్న 20 మంది డిఎంకె ఎంఎల్‌ఎలను, విప్ ధిక్కరించిన 22 మందిని (ప్రస్తుతం దినకరన్ శిబిరంలో ఉన్నవారిని) సస్పెండ్ చేసే అవకాశం ఉంది. ఇంకా 191 మందిలో మెజార్టీ బలనిరూపణ చేసుకుని పాలన కొనసాగించాలన్నది వీరి వ్యూహం. అయితే శాసనసభాపక్ష క్రమశిక్షణ కమిటీ 17 మందితో ఉంది. ఇందులో 10 మంది అన్నాడిఎంకె (వీరిలో ముగ్గురు దినకరన్ పక్షాన ఉన్నారు), కాంగ్రెస్, డిఎంకె కలిపి మరో ఏడుగురు ఉన్నారు. అన్నాడిఎంకెకి ఏడు, డిఎంకె, కాంగ్రెస్‌కు ఏడు ఉన్నారు. శాసనసభ క్రమశిక్షణా కమిటీలో సమాన బలాబలాలు ఉండడంతో వీరి వ్యూహం పారుతుందా, లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.

చంద్రబాబు కేబినెట్‌పై వ్యాజ్యాన్ని కొట్టివేసిన హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్ట నియమనిబంధనలకు అనుగుణంగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఆయన మంత్రివర్గ సహచరులు ప్రమాణం చేయలేదని, వారిని ఆ పదవుల్లో కొనసాగించొద్దని దాఖలైన వ్యాజ్యాన్ని హైకోర్టు న్యాయమూర్తులు వి.రామసుబ్రమణియన్, టి.రజనీలతో కూడిన డివిజన్ బెంచ్ కొట్టివేసింది. తెలుగు రాష్ట్రాల్లోని ఎమ్మెల్యేలు రాష్ట్ర విభజన తరువాత గవర్నర్ ద్వారా ప్రమాణం చేయలేదని, కాబట్టి ఏపీ క్యాబినెట్ ప్రమాణ స్వీకారం చెల్లదని పిసిపి ప్రధాన కార్యదర్శి సూరిబాబు వేసిన రిట్ ఆఫ్ కో వారెంటోను హైకోర్టు తోసిపుచ్చింది. మాదిపుల పాలన పునర్వ్యవస్థ కోర్టుకు రావడంలో జాప్యంతో పిటిషనర్‌కు బెంచ్ ప్రశ్నించింది. తీర్పుఇవ్వడంలో కోర్టుకు రావడంతో కోర్టు సమయాన్ని వృధా చేయడమే అవుతుందని హైకోర్టు అభిప్రాయపడింది. పునర్విభజన చట్ట నిబంధనల మేరకు రెండు తెలుగు రాష్ట్రాలు ఎమ్మెల్యేలు అపాయింటెడ్ డే నుంచి ఎన్నికైనట్లు పరిగణించాలని హైకోర్టు స్పష్టం చేసింది. అధికరణ 164(1) ప్రకారం ఎమ్మెల్యేలు, ఆయా పార్టీల పక్ష నేతల ఎంపిక జరిగిందని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది.

గణేష్ మండపాలకు రోడ్లు తవ్వేస్తున్నారు

మంత్రి కెటిఆర్‌కు మంచు లక్ష్మి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో గణేష్ మండపాల కోసం రోడ్లను ఇష్టానుసారంగా తవ్వుతున్నారని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారో చెప్పాలని మంచు లక్ష్మి తెలంగాణ పురపాలక శాఖ మంత్రి కెటీఆర్‌కు శనివారం లేఖ రాశారు. వినాయక చవితి సందర్భంగా నగరానికి జరుగుతున్న నష్టం గురించి ప్రస్తావించారు. వినాయక మండపాలను నిర్మించడానికి రోడ్లను తవ్వుతున్నారని, ఫిల్మ్ నగర్ రోడ్డు నంబరు1లో రోడ్డును తవ్వుతున్నారన్నారు. భారీ గణపతి విగ్రహాలను తరలించడానికి అడ్డంగా ఉన్న కేబుల్ వైర్లను కూడా కట్ చేశారని, దీనిని తిరిగి బాగు చేసే బాధ్యత ఎవరు తీసుకుంటారో ఓ సిటిజన్‌గా తాను తెలుసుకోవాలనుకుంటున్నానని ఆమె పేర్కొన్నారు. వినాయక చవితి పండుగను మతపరంగా భావించకుండా ఓ పోటీగా భావిస్తున్నారన్నారు. వేడుకను ఇతరుల కన్నా వైభవంగా జరపాలని, వ్యయ ప్రయాసలకు వెనకాడటం లేదన్నారు. ఏ ప్రాంతానికి ఒకే మండపం ఉండేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని సలహా ఇచ్చారు. దీని వల్ల ఒకే ప్రాంతంలోని వ్యక్తుల్లో ఐక్యత పెరగడమే కాకుండా పండగను జరుపుకునే సంప్రదాయాన్ని కాపాడగలగే అవకాశం ఉందన్నారు. ఇతర ప్రాంతాల్లోని ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ట్విట్టర్ ద్వారా ఈ సమస్యను తెలుపుతున్నానని కెటిఆర్‌కు వివరించారు.

చట్టసభలు చర్చలకు వేదికలవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీ వద్ద పౌర సన్మానం జరిగింది. ప్రధానమంత్రి గృహ నిర్మాణం కింద 2.5లక్షల ఇళ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో చట్టసభలు జరుగుతున్న తీరుతో ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. ఆకాంక్షలకు, ఆశలకు అనుగుణంగా పనిచేయడం లేదనే భావన ప్రజల్లో నెలకొందన్నారు. చట్టసభల్లో విమర్శలు హుందాగా ఉండాలని, వ్యక్తిగత ద్వేషాలకు వెళ్లకూడదని పేర్కొన్నారు. ప్రభుత్వంలో ఉన్న వారు ప్రతిపక్షానికి అవకాశమివ్వాలని, ఇచ్చిన అవకాశాన్ని ప్రతిపక్షం ఉపయోగించుకోవాలన్నారు. ఎంతో మంది మహనీయుల త్యాగాల ఫలితంగా మన రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నామని, స్వరాజ్యం సురాజ్యంగా మారాలన్నారు. దేశంలో ఆకలి, అవిద్య, అవినీతి, ఆర్థిక అసమానతలను,ఆరాచకం లేనప్పుడే అభివృద్ధి వైపు వేగంగా వెళ్తుందన్నారు. కేంద్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు అతి తక్కువ వ్యవధిలో జరిగిన సహాయం చరిత్రలో ఏ రాష్ట్రానికి జరగలేదన్నారు. తెలుగు భాష కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని,పరిపాలన భాషగా తెలుగును అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పోట్లాడుకోకుండా ఇచ్చి పుచ్చుకునే విధంగా ఉండాలన్నారు. ఉపరాష్ట్రపతిగా సొంత రాష్ట్రంలో తనకు అందిన స్వాగతం అపూర్వమని, జీవితాంతం గుర్తుపెట్టుకుంటానని చెప్పారు. తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్ మాట్లాడుతూ దేశంలోనే అత్యున్నత పదవిని అలంకరించిన వెంకయ్యనాయుడు తెలుగువారు కావడం గర్వకారణమన్నారు. 1972లో జైఆంధ్రా ఉద్యమంలో కీలకపాత్ర పోషించారన్నారు.

తెలుగు జాతి గర్వించదగ్గ వ్యక్తి : సిఎం చంద్రబాబు

తెలుగు జాతి గర్వించదగ్గ వ్యక్తి వెంకయ్యనాయుడు అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆయన అందించిన తోడ్పాటు రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలన్నారు. ఎన్డీఏకు సిఎం పదవి నుంచి తప్పించినందుకు, ఆయన కోసం వెంకయ్య ఒత్తిడి పోరాడారన్నారు. రాష్ట్రవిభజన సమయంలో వెంకయ్య ఒత్తిడి వల్లే ఆనాటి కేంద్రప్రభుత్వం ప్రత్యేక హోదాను ప్రకటించిందన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడును సన్మాన పత్రిక, జ్ఞాపికను ముఖ్యమంత్రి, గవర్నర్ కలిసి అందజేశారు. రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ ప్రారంభోపన్యాసం చేసిన ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు అశోక్ గజపతిరాజు, సుజనా చౌదరి ప్రసంగించారు. శాసన మండలి చైర్మన్ చక్రపాణి, డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, శాసన సభ స్పీకర్ కోడెల శివప్రసాద్, డిజిపి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ రాజకీయ ముఖ్య కార్యదర్శి నాగులపల్లి శ్రీకాంత్ వందన సమర్పణ చేశారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన నమూనా గృహాల్ని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సిఎం చంద్రబాబు, గవర్నర్ నరసింహన్ తదితరులు సందర్శించారు.

సినిమా

యువతకు నచ్చే 'అర్జున్ రెడ్డి'



మరో విషయం ఏంటంటే.. తెలంగాణ యాసను దించేశాడు. హీరో, దర్శకుడు ఇద్దరూ తెలంగాణాకు చెందిన వారు కావడంతో ఆ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకున్నారు. హీరోలోని ఆ స్పీడే యువతకు బాగా కనెక్ట్ అయింది. హీరోకు కష్ట, నష్టాల్లో వెన్నంటి ఉన్న ఓ స్నేహితుడి ప్రాక్టీస్‌పై వేసిన సెటైర్లు ప్రేక్షకులు ఫిదా అయిపోతారు. అదేవిధంగా తెలంగాణ సంస్కృతికి తగినట్లుగానే తండ్రీకొడుకులు మొహమాటం లేకుండా మాట్లాడుకునే విధానం బాగుంది. మన ముందు కొందరు వ్యక్తులు సన్నివేశాన్ని బట్టి సహజంగా మాట్లాడుకుంటున్నట్లుగా అనిపిస్తుంది తప్ప.. ఏ డైలాగ్ కూడా కృత్రిమంగా అనిపించదు.

దేనికైనా మూలధనం యువతే. సినిమాకైతే కాస్తా ఎక్కువ అనే చెప్పాలి. వారికి నచ్చేవిధంగా తీస్తే చాలు థియేటర్లకు క్యూ కడతారు. వారిని అక్కడ వరకూ తీసుకురావాలంటే ఏదో ఆకర్షణీయ అంశం ఉండాలి. అలాంటి ఓ అంశాన్ని పోస్టర్లు, సోషల్ మాధ్యమాల్లో ద్వారా యువతకు చేరువయ్యే ప్రయత్నం చేసింది 'అర్జున్ రెడ్డి' చిత్ర యూనిట్. ఫలితంగా విమర్శలు, ప్రతివిమర్శలు వచ్చాయి. దీంతో చిత్రంలో ఏముందన్న ఆసక్తత యువతలో పెరిగింది. 'పెళ్లిచూపులు' ఫేమ్ విజయ్ దేవరకొండ నటించిన మూడో సినిమా ఇది. వరంగల్‌కు చెందిన మెడికో సందీప్ రెడ్డి వంగ దర్శకత్వం వహించాడు. అతని అనుభవాలనే కథగా రాసుకుని తీశాడు. ఆ చిత్రం ఎలా ఉందో చూద్దాం.

సినిమా : అర్జున్ రెడ్డి
నటీనటులు : విజయ్ దేవరకొండ, షాలిని పాండే, రాహుల్ రామకృష్ణ, కమల్ కామరాజు, సంజయ్ స్వరూప్, అలనాటి నటి కాంచన, ప్రియదర్శి తదితరులు
సాంకేతికత : ఛాయాగ్రహణం – రాజు తోట, సంగీతం – రధాన్, నిర్మాత – ప్రణయ్ రెడ్డి వంగ, రచన, దర్శకత్వం – సందీప్ రెడ్డి వంగ.

కథ : అర్జున్ రెడ్డి (విజయ్ దేవరకొండ) మెడిసిన్ విద్యార్థి. మేధావి. కోపిష్టి కూడా. డాక్టర్ వృత్తి అంటే గౌరవం. సర్దుకుపోవడం అంటే చికాకు. ఓ సందర్భంలో కాలేజీ డీన్ అతనికి సస్పెన్షన్ లెటర్ ఇస్తుంది. అలాంటి సమయంలో తనకంటే నాలుగేళ్ళ జూనియర్ అయిన ప్రీతి (షాలినీ పాండే)ని తొలిసారిగా చూసి ప్రేమించేస్తాడు. ఆమె కోసమే డీన్‌తో సర్దుబాటుకు వచ్చి కాలేజీలో కొనసాగడానికి నిర్ణయించుకుంటాడు. కొన్నాళ్ల తర్వాత ప్రీతి కూడా అతణ్ని ఇష్టపడుతుంది. ఇద్దరూ గాఢంగా ప్రేమించుకుంటారు. విషయం తెలిసిన ప్రీతి తల్లిదండ్రులు వారి ప్రేమను అపార్థం చేసుకుని తిరస్కరిస్తారు. మరోవైపు అర్జున్ రెడ్డి ఇంటిలోనూ అదే పరిస్థితి. సరిగ్గా ఆ సమయంలోనే అర్జున్‌రెడ్డి అన్న కమల్ కామరాజు పెళ్లి జరుగుతుంది. ఈ పెళ్లికి అర్జున్ రెడ్డి హాజరు కాకుండా ప్రీతిపై పిచ్చిప్రేమతో డ్రగ్‌కు బానిసవుతాడు. రెండురోజుల తర్వాత స్పృహలోకి వచ్చాక ప్రీతికి వివాహమైందన్న విషయం తెలిసి దేవదాసుగా మారిపోతాడు. ఆ మార్పు అతని జీవితాన్ని ఎటువంటి మలుపులు తిప్పింది? అన్నది మిగిలిన సినిమా.

విశ్లేషణ : సినిమా అంటేనే వినోదం. అందులో కొన్ని నచ్చుతాయి. వాటిని ఆస్వాదిస్తాం. అనంతరం వదిలేస్తాం. కానీ కొన్ని సినిమాలు మాత్రం మనసుపై ముద్ర వేస్తాయి. చెప్పలేని ఒక అనుభూతిని కలిగిస్తాయి. 'అర్జున్ రెడ్డి' ఈ కోవలోని సినిమానే. ఇప్పటి యువత ఆలోచనలకు నిదర్శంగా చెప్పవచ్చు. ప్రేమ కథల పేరుతో పలు సినిమాలు వచ్చాయి. 'హ్యాపీడేస్'తో శేఖర్ కమ్ముల కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తే.. మెడిసిన్ చదివే విద్యార్థుల పయనాన్ని ప్రదీప్ వంగ 'అర్జున్‌రెడ్డి'తో మరో కోణాన్ని చూపించాడు. తను మెడికో కాబట్టి నాలుగేళ్ళ కోర్సును ఆరేళ్ళ వరకు చదవాల్సివచ్చిందనీ, ఆ అనుభవంతోనే కథను రాసుకున్నానని దర్శకుడు చెప్పడం విశేషం.

ఇది మెడికో ప్రేమకథ. ఆ మెడికోది చిత్రమైన మనస్తత్వం. మేధావులకు తీరుకు తగ్గట్టుగా హీరో పాత్రను డిజైన్ చేశాడు. అర్జున్ రెడ్డి పాత్రకు యువత బాగా కనెక్ట్ అవుతారు. ఏదీ దాచుకోకుండా మొహం మీద మాట్లాడేస్తుంటాడు. ఒకరకంగా భగత్‌సింగ్ భావాలకు దగ్గరగా కన్పిస్తాడు. 2017లో కూడా గాంధీ, నెహ్రూ కాలం లాగా కులం, మతం అంటూ ప్రేమికుల్ని విడదీయడం పిచ్చితనమని ప్రశ్నిస్తాడు. మహిళల పట్ల గౌరవం ప్రదర్శిస్తాడు. తను ప్రేమించిన అమ్మాయితో ప్రకృతిధర్మంగా ప్రవర్తిస్తాడు. ఇక అప్పటి నుంచి వీరిద్దరి ప్రేమకు హద్దులుండవు. ఒకరంటే ఒకరు పడిచచ్చేంతగా కలిసిపోతారు. ఇక్కడే ప్రేమను వ్యక్తం చేసే క్రమంలో పలుసార్లు పెదాలు చుంబిస్తాడు. అసలు అన్నిసార్లు వాటిని చూపించాల్సిన అవసరం లేదు. ఇటువంటి సన్నివేశాలు కొన్ని కుటుంబ సభ్యులతో చూడతగినవిగా ఉండవు. మేధావికైనా, సగటు మనిషికైనా కోరికను వెంటనే తీర్చేసుకోవాలంటూ లాజిక్కుతో నచ్చిన అమ్మాయితో గడపాలనుకుంటాడు. ఆ క్రమంలో ట్రీట్‌మెంట్ కోసం తన వద్దకు వచ్చిన ఓ ప్రముఖ నటిని భౌతికంగా కలవాలనుందని అడిగేస్తాడు. ఇంత బోల్డ్‌గా అతని క్యారెక్టర్‌ను డిజైన్ చేయడానికి కారణం హౌస్ సర్జన్ చేసే వ్యక్తి బ్యాక్‌డ్రాప్ తీసుకోవడమే. అందుకే సెన్సార్ కూడా పెద్దగా అభ్యంతరం చెప్పలేకపోయింది. అప్పటికీ కొన్నింటిని నియంత్రించారు. ఆ పదాలు పలికే సందర్భాన్ని మ్యూట్ చేశారు కూడా.

కథలో చాలా లోపాలు కన్పించినా అవన్నీ అర్జున్ రెడ్డి పాత్ర మర్చిపోయేలా చేసింది. హీరో అమ్మాయిని చూసి తొలి చూపులోనే ప్రేమలో పడిపోవడం ఓకే. కానీ ఆ అమ్మాయికి ఇతనెందుకు నచ్చుతాడన్నది అర్థం కాదు. బహుశా! టాపర్, మేధావి అని తెలిసి ప్రేమలో పడిపోయిందనుకోవాలి. శంగార భావనలేమీ లేకుండా వీళ్ల ప్రేమలోని ఇంటెన్సిటీని చూపించే ఒక్క సన్నివేశాన్నీ తీయలేదు.

సినిమా అంతటా కూడా రాజీ అన్నదే లేకుండా తాను ఏం నమ్మాడో అది చూపిస్తూ వెళ్లిన సందీప్.. ముగింపు విషయంలో మాత్రం కాంప్రమైజ్ అయిపోయాడనిపిస్తుంది. చాలా వాస్తవికంగా సాగే కథ చివర్లో మాత్రం సినిమాటిక్ ముగింపు వైపు మళ్లడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

రధాన్ మ్యూజిక్, రాజు తోట ఛాయాగ్రహణం సినిమాలో ఫీల్‌ను మరింత పెంచడానికి పనికొచ్చాయి. సన్నివేశాల్ని ఎలివేట్ చేయడంలో బ్యాగ్రౌండ్ స్కోర్ కీలక పాత్ర పోషించింది. ముఖ్యంగా ద్వితీయార్థంలో హీరో రోజు రోజుకూ పతనమైపోతున్నపుడు వచ్చే నేపథ్య సంగీతం ప్రత్యేకంగా అనిపిస్తుంది.

– పెండ్యాల మురళీ



ఎన్టీఆర్

'కుశ' హుషారు

ఎన్టీఆర్ త్రిపాత్రాభినయం చేస్తున్న సినిమా 'జై లవ కుశ'. ఇప్పటికే ఇందులో 'జై' ప్రతినాయకుడిగా ఉండే పాత్రను ముందే విడుదల చేసిందీ చిత్రబృందం. దానికి భారీ స్పందనే వచ్చింది. తర్వాత వచ్చిన 'లవ' పాత్ర కూడా విభిన్నంగా ఉంది. ఇతను మంచి బాలుడు అన్నట్టు ఉంది. ఇప్పుడు ఈ చిత్రంలో మిగిలిన 'కుశ' పాత్రను ఎన్టీ అభిమానులకు పరిచయం చేశారు. ఇది మాత్రం కాస్తా ఇప్పుడు యువతలో ఉన్న క్రేజీ బాయ్ గెటప్‌లో దర్శనమిచ్చారు. ఇందులో తారక్ చాలా హుషారుగా కనిపించారు. ఈ సినిమాకు బాబీ దర్శకుడు. ప్రస్తుతం చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జోరుగా జరుగుతున్నాయి. రాశీ ఖన్నా, నివేదా థామస్ కథానాయికలు. దేవిశ్రీ ప్రసాద్ బాణీలు సమకూరుస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై కళ్యాణ్ రామ్ నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 21న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు రానుంది.



మహేష్

రొమేనియాలో 'స్పైడర్'

మహేష్, దర్శకుడు మురుగదాస్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న సినిమా 'స్పైడర్'. ఈ చిత్రంలో ఒక గీతం తప్పా మొత్తం చిత్రీకరణ పూర్తియిపోయింది. ప్రస్తుతం ఆ గీతాన్ని రొమేనియాలో చిత్రీకరిస్తున్నారు. ఈ నెల చివరికి ఇది కూడా పూర్తి పోస్టు ప్రొడక్షన్ పనులు చేపట్టనున్నారు. మహేష్ బాబు పోలీస్ ఆఫీసర్‌గా కనబడనున్న ఈ చిత్రానికి హరీష్ జయ రాజ్ బాణీలు సమకూరుస్తున్నారు. రకుల్ ప్రీత్‌సింగ్ కథానాయికగా చేస్తోంది. తమిళ్, తెలుగు భాషల్లో ఏక కాలంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి ఠాగూర్ మధు నిర్మాత.

జయప్రద నటన చూసి ఎగ్జయిటయ్యాను – చిరు



మిస్తీ చక్రవర్తి, జయ ప్రద, చిరంజీవి, ఆకాష్ కుమార్, నరసింహారావు, అశ్వని కుమార్

ఆకాష్ కుమార్, మిస్తి చక్రవర్తి హీరో హీరోయిన్లుగా జయప్రద ప్రధాన పాత్రలో రూపొందుతోన్న చిత్రం 'శరభ'. యన్.నరసింహారావు దర్శకుడు. అశ్వనికుమార్ సహదేవ్ నిర్మాత. ఈ సినిమా ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను చిరంజీవి శనివారం విడుదల చేశారు.

చిరంజీవి మాట్లాడుతూ "జయప్రద నన్ను కలిసిన సందర్భంలో ఈ 'శరభ' సినిమాకు సంబంధించిన కొన్ని క్లిప్పింగ్స్‌ను చూశాను. నాకు చాలా బాగా నచ్చాయి. జయప్రద, ఆకాష్ నటన అద్భుతంగా ఉంది. డైరెక్టర్ నరసింహారావు ఆషామాషీ సినిమాను తెరకెక్కించలేదని అర్థమైంది. ఇదొక సోషియో ఫాంటసీ మూవీ. దేవుడు, దెయ్యం, మనిషి మధ్య జరిగే కథ. నేను చేసిన సినిమాలతో పోల్చాలంటే 'జగదేకవీరుడు అతిలోక సుందరి' మూవీలా ఉంటుంది. జయప్రద నటన చూసి ఎగ్జయిట్ అయ్యాను. తను గర్భం ధరించి పిల్లవాడిని కనే సమయంలో దెయ్యం జయప్రదను అవహించి బిడ్డను చంపేయాలనుకున్నప్పుడు ఆమె పడే తపన అంతా చూసి గగ్గుర్పొడిచింది. జయప్రద నటన చూసి వావ్ అనకుండా ఉండలేకపోయాను. అలాగే క్లైమాక్స్‌లో ఆకాష్ నరసింహస్వామిగా మారేటప్పుడు తనలో కలిగే మార్పులు, ఆకాష్ నటన చూసి అభినందించకుండా ఉండలేకపోయాను. సినిమా టేకింగ్ చూస్తే దర్శకుడు నరసింహ మాటల మనిషి కాదు, చేతల మనిషి అని అర్థం అయింది. సినిమాటోగ్రఫీ, గ్రాఫిక్స్ అత్యుత్తమంగా ఉన్నాయి" అని అన్నారు. మంచి చెడుల మధ్య పోరాటమే ఈ సినిమా అని సురేష్ కపాడియా అన్నారు. దర్శకుడు ఎన్.నరసింహారావు మాట్లాడుతూ స్నేహితుల మధ్య పోరే ఈ చిత్రమని, తండ్రి సెంటిమెంట్‌తో కథ ముడిపడి ఉంటుందన్నారు.

కళ్యాణ్ రామ్‌కి జోడీగా తమన్నా






తమన్నా

'బాహుబలి' తర్వాత పెద్ద ప్రాజెక్టులేవీ తెలుగులో తమన్నా చేతికి రావడం లేదు. ఇతర భాషా చిత్రాల్లో నటిస్తున్నా తెలుగులో మాత్రం చేయడం లేదు. ఇప్పుడు మాత్రం కళ్యాణ్‌కి జోడీ చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జయేంద్ర దర్శకత్వంలో కళ్యాణ్ రామ్ హీరోగా రూపొందుతోన్న ఓ సినిమాలో ఈమెను కథానాయికగా ఎంపిక చేశారు. మొదట చాలా మంది హీరోయిన్ల పేర్లు వినిపించినా చివరకు తమన్నానే కథానాయికగా ఫైనల్ చేసినట్టు చిత్రబృందం చెప్పింది. కళ్యాణ్ రామ్‌తో తమన్నా చేస్తున్న మొదటి చిత్రమిదే. ఈ చిత్రం ఈస్ట్ కోస్టు ప్రొడక్షన్ బ్యానర్‌లో రూపొందుతోంది. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి కళ్యాణ్ రామ్ రెగ్యులర్ షూటింగ్‌లో పాల్గొననున్నారు. తమన్నా కూడా అప్పటి నుంచే చిత్రీకరణలో జాయిన్ కావచ్చు. పీసీ శ్రీరామ్ ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫీ అందిస్తున్నారు. ప్రస్తుతం కళ్యాణ్ రామ్ 'ఎమ్మెల్యే' చిత్రం చేస్తున్నారు. ఇందులో కాజల్ కథానాయిక. దీంతో పాటు ఎన్టీఆర్ చేస్తున్న 'జైలవ కుశ' నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

రాణి

గబ్బర్‌సింగ్‌కు ముందు అవకాశాల కోసం ఎదురు చూసే కాజల్‌కు ఆ తర్వాత మంచి ఛాన్స్‌లే వస్తున్నాయి. 'నేనే రాజు–నేనే మంత్రి', 'వివేకం' చిత్రాలతో వరుస విజయాలు అందుకుంది. కాజల్ హీరోయిన్‌గా 50 చిత్రాలను పూర్తి చేసింది. తెలుగులో ఇప్పుడు కళ్యాణ్ రామ్‌తో 'ఎమ్మెల్యే' చేస్తోంది. తమిళ్‌లో 'క్వీన్' రీమేక్‌లో నటించబోతుంది. 2014లో విడుదలైన 'క్వీన్' బాలీవుడ్‌లో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇందులో కంగనా రనౌత్ 'రాణి' పాత్రలో మెప్పించింది. ఈ చిత్రాన్ని తమిళంలో రీమేక్ చేయడానికిగానూ టైటిల్ రోల్‌కు తమన్నాను తీసుకున్నట్టు ప్రచారం జరిగింది. ఫైనల్‌గా ఆ పాత్రకు కాజల్‌ను ఎంపిక చేసినట్లు దర్శక నిర్మాతలు తెలిపారు. తమిళ్ నేటివిటీకి సరిపడే విధంగా ఈ కథలో మార్పులు చేస్తున్నారు.




కాజల్

ప్రాణం, గమ్యం తరహాలో ఉంటుంది



నరేష్

అల్లరి నరేశ్, నిఖిలా విమల్ జంటగా నటించిన 'మేడ మీద అబ్బాయ్' సెప్టెంబర్ 8న వస్తున్నాడని చిత్ర నిర్మాత వెల్లడించారు. చిత్ర ట్రైలర్‌ను శనివారం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్మాత బొప్పన చంద్రశేఖర్ మాట్లాడుతూ 'అల్లరి' సినిమాతో కెరీర్‌ను ప్రారంభించిన నరేశ్ 'ప్రాణం', 'గమ్యం', 'శంభో శివ శంభో' వంటి భిన్నమైన పాత్రలను పోషించాడు. ఇవన్నీ కలిపితే వచ్చిందే 'మేడ మీద అబ్బాయ్' అని వివరించారు. హీరో నరేష్ మాట్లాడుతూ 'ఏ సినిమా చేసినా అన్నీ ఒకేలా ఉంటున్నాయని అంటున్నారు. నా నుంచి కొత్తగా చేయాలని నిర్మాత ఎప్పటి నుంచో అడుగుతున్నారు. 'కెవ్వుకేక' ఆయనతో చేశాను. అందుకే ప్రాణం, గమ్యం తరహాలో ఉండేలా కామెడీతోపాటు ఏడిపించేలా ఉండే కథను ఎంచుకున్నాను. 'ఒడకం సెల్ఫీ' అనే మలయాళ చిత్రాన్ని నిర్మాత చూడంటే చూశాను. వినీత్ నటించాడు. అతని శైలికి ఎక్కడ కనెక్ట్ అవుతాననే ఎక్కువసార్లు చూడలేదు. నా స్టయిల్లో చేశాను. ఇందులో కామెడీతో పాటు థ్రిల్లర్ అంశం కూడా ఉంది. ఒరిజిల్ దర్శకుడు ప్రజీత్ కరెక్ట్ అని భావించి ఆయన చేత దర్శకత్వం చేయించాం. మలయాళీ కావడంతో భాష తెలిసిన దర్శకుడు సీతారామరాజు సహకారంతో పూర్తిచేశాం. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు ముగింపు దశలో ఉన్నాయి' అని పేర్కొన్నారు.



దాస్తో... సంగీతాల దోస్తానా!



ఒకసారి సంగీతాన్ని మనసులోకి ఆహ్వానించాక గుండె లోతుల్లో రాగాలు సవ్వడిచేస్తాయి. భావాలన్నీ ఆలాపనల్లో రూపాన్ని సంతరించుకుంటూ, బహిరంగంగా పలకరించాలని ఉవ్విళ్లూరుతూ ఉంటాయి. ఊపిరిలో నుంచి ఉవ్వెత్తున్న ఎగసిపడే కెరటాలై జనావాహాన్ని ముద్దగా తడిపేయాలని ఆశ ఉంటుంది. కానీ వెలవెల బోయే పరిస్థితే వస్తే ఎంత భాదో కదా! అలాంటి సమయంలో తమ సంగీత సామర్థ్యాన్ని ప్రదర్శించే మార్గం కోసం వెతుకులాడే సంగీత యంగ్ తరంగాలను దోస్తులు చేయిచాచి పిలుస్తుంటే... అందరం కలిసి అదరగొట్టే మ్యూజిక్ క్రియేట్ చేద్దామంటే... ఆహా! ఎంత భాగ్యం.. అవును... 'దాస్తా' దోస్తానాలు అందుకే ఏర్పడ్డారు. మ్యాజిక్‌లాంటి మ్యూజిక్ చేద్దామని ఆహ్వానిస్తున్నారు.

సంగీతంలో తెలియాడే యువ కళాకారుల కోసం సుదీర్ఘమైన దారులు చాలానే ఉంటాయి. మ్యూజిక్ బిజినెస్‌లో అయితే ప్రస్తుతం ఎన్నో మార్గాలు యువతను ఆకర్షిస్తున్నాయి. టాలెంట్ మెండుగా ఉండి, ఆసక్తి ఆశించినంత ఉన్నాగానీ చాలామందికి సరైన బేస్ లేక ఇబ్బందిపడుతున్నారు. 'దాస్తా'లో ఉన్న ప్రధాన సభ్యులూ అంతే... ఇప్పటికే ఎన్నో ప్రదర్శనలిచ్చి సంగీత కళాకారులుగా సుపరిచితులయినా కానీ ప్రారంభ దశలో వాళ్లు చాలా కష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. వాటన్నింటికీ సాక్షులుగా ఉన్న వీళ్లు కొత్తగా రాబోయే యువత అలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సహకారం అందించాలని అనుకున్నారు. సాండ్యూన్స్, ఆక్స్7జెన్, ఓషియెనేటెడ్, జోఖుమ, కుమైల్, తర్ఫీబ్‌లు కలిసి దాస్తాను ఏర్పాటుచేయాలనే సంకల్పానికి పూనుకున్నారు. ఒక మ్యూజిక్ కమ్యూనిటీని స్థాపించారు.

అందరిదీ దాస్తా

దాస్తాలో ప్రధాన సభ్యులుగా ఉన్న ఈ ఆరుగురు స్నేహితులు... వేర్వేరుగా వారివారి నగరాల్లో సంగీత ప్రదర్శనలిచ్చేవారు. ప్రోగ్రామ్‌లు పూర్తయిన తర్వాత సర్దాగా తిరుగుతుండేవాళ్లు. అనుకోకుండా ఒకసారి వారంతా మాటల్లో... 'యువ కళాకారులకు సహకారంగా ఉండే ఒక వ్యవస్థ ఉంటే బాగుటుంది కదా!' అనుకున్నారు. వీళ్లంతా ఒంటరి కళాకారులుగా, డీజెలుగా ఉంటూ వివిధ మ్యూజిక్ బ్యాండ్స్‌లో ప్రదర్శనలిస్తూ ఉండేవాళ్లు. అయితే కలిసికట్టుగా పనిచేస్తే మరింత అభివృద్ధి ఉంటుందని ఆశించారు. ఒకరికొకరు సహకరించుకుంటూ, వనరుల్నీ, జ్ఞానాన్నీ పంచుకోవడానికి మనస్ఫూర్తిగా ముందుకు రావాల్సిన అవసరాన్ని గమనించారు. వ్యక్తిగత ప్రయాస కంటే మించిన ఏదో ఒక ఉన్నతమైనది కావాలని వారికి అర్థమైంది. తదనంతర వారాంతంలో, సుదీర్ఘ స్కైప్ కాల్ తర్వాత, 'దాస్తా' రూపుదాల్చింది.

షార్ట్ ఫిల్మే ఆహ్వానం

కొత్తగా ఏర్పడిన ఈ కలెక్టివ్ మొదటి అడుగు... 'అందర్నీ ఒక వేదికపైకి తీసుకురావడమెలా? వనరుల్ని సమకూర్చుకోవడమెలా? విశాలమైన మ్యూజిక్ కమ్యూనిటీని చేరడమెలా..?' ఈ ప్రశ్నలకి మార్గాలను వెదకడం ప్రారంభించారు. వారి ఆలోచనల నుండి నిర్మించిన పాఠ్యాప్రణాళిక, కలిసికట్టుగా రూపొందించాల్సిన సంగీతం కోసం సామాగ్రినంతా మూటగట్టుకుని ముంబాయ్‌కి వెలుపల ఉన్న ఒక ఫామ్ హౌస్‌కి బయలుదేరారు. అక్కడ ఒక మొబైల్ స్టూడియో ఏర్పాటుచేసుకున్నారు. వారికి కావాల్సినట్టుగా ఒక గూడును నిర్మించుకున్నారు. మరి వీరితో



చేయికలిపే యువతకు ఈ విషయాన్ని తెలియజేయాలి కదా...! అందుకే వీరి ప్రణాళికను చెబుతూ ఒక షార్ట్‌ఫిల్మ్ రూపొందించారు. సచిన్ పిళ్లై, జిష్ణు గుహ చేసిన ఈ ఫిల్మ్ https://goo.gl/ ND88xR లింక్‌లో చూడొచ్చు. దీనిలో సంగీత నిర్మాతలూ, కళాకారులతో అనుసంధానం కావడం కోసం 'పవర్ ఇన్ లిమిటేషన్ (పరిమిత శక్తి)', 'మేకింగ్ ది మోస్ట్ ఆఫ్ వాట్ వీ హ్యావ్ గాట్ (మనకున్న దానితోనే ఎక్కువ రూపొందించడం)' అనే అంశాలతో చేసిన ప్రాజెక్ట్ గురించి వివరించారు.

సంగీతమే పరమావధి

దాస్తా వేదికపై కలిసికట్టుగా రూపొందించిన వారి మొదటి ప్రాజెక్ట్ 'ఎస్–ఎస్‌పి వాల్యూమ్ 1' (https://goo.gl /aNcGNv) ఇప్పటికే విడుదలయ్యింది. వారి ప్రణాళిక ప్రకారం పరిమితమైన వనరులతో ఈ ప్రాజెక్ట్ ఒక్క వారంలోనే పూర్తిచేశారు. భవిష్యత్తులో కూడా ఇలాగే కొనసాగాలనే పట్టుదలతో ఉన్నారు. 'ప్రొడ్యూసర్ సర్కిల్స్', 'కొ:ల్యాబ్స్' వంటి కార్యక్రమాలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీనిద్వారా మరింత మందిని కలుపుకోవాలనీ, సంగీత నిర్మాణానికి సంబంధించిన సవాళ్లకు సమాధానాలు వెదకడానికి నడుంకట్టారు. ఒకరికి ఒకరు సహకారం అందించుకుంటూ, తమకున్న వనరులతోనే యువ సంగీత కళాకారుల కోసం పెద్ద కమ్యూనిటీని నిర్మిస్తే, వ్యక్తిగతంగానే కాక సంఘంగా మంచి సంగీతాన్ని రూపొందిచవచ్చు అంటున్నారు. ఈ దాస్తా దోస్తుల జోరు భలేగా ఉంది కదూ! ★

కుక్కలతో క్లిక్

ఫోటో గ్రాఫర్లలో చాలా రకాలు ఉంటారు. కొందరు ప్రకృతిని కెమెరాలో బంధిస్తే, మరికొందరు వైల్డ్ చిత్రాలతో విస్మయం కల్గిస్తారు, ఇంకొందరు పెళ్లిళ్లకూ పేరంటాలకు వెళ్లి ఆనందమైన అనుభూతుల్ని అందంగా క్లిక్‌మనిపిస్తారు. ఫోటోగ్రఫీలో దేనికది చాలా వైవిధ్యమైనది. వారివారి ఆసక్తిని బట్టి ఆయా అంశాల్లో పరిణితి సాధించ గలిగినప్పుడే మంచి ఫోటోగ్రాఫర్ కాగలరు. ఉదాహరణకి చిన్నపిల్లల్ని ఫోటోలు తీయడం అంత సులువేమీ కాదు. అలాగే జంతువుల్ని కూడా... ఫోటోలకు ఫోజులివ్వాలనే ఆలోచన ఉండదు గనుక జంతువుల్ని కెమెరాలో బంధించాలంటే చాలా ఓర్పు ఉండాలి. అందులోనూ కుక్కల్ని ఫోటో తీయడమంటే ఇక చెప్పాల్సిన పనిలేదు. 'కుక్క తోక వంకర' అన్న మాటలో 'తోక' సంగతి పక్కనపెడితే 'వంకర' మాటను ఒప్పుకోక తప్పదన్నట్లు ఉంటుంది వాటిని ఫోటోలో బంధించడం. ఇంతకీ ఈ కథంతా ఎందుకు చెబుతున్నట్లు అనుకుంటున్నారా?! అశోక్ చింతల అభిరుచి ఎంత విన్నూత్నమైనదో తెలియ జేయడానికే ఈ బ్యాక్ గ్రౌండ్ స్టోరీ. ఒక సైన్స్ లాబొరేటరీ నుంచి రెండు కుక్కల్ని రక్షించిన క్షణం నుంచీ కేవలం వాటి జీవితమే కాదు అశోక్ జీవితంలోనూ కొత్త మలుపు సంభవించింది. భీమవరంలో పుట్టిపెరిగిన అశోక్ ప్రపంచ శునకాల ప్రేమికుల దృష్టిని ఆకర్షించాడు. బ్రూనో, జాజ్ అనే శునకాల్ని దత్తత తీసుకున్న తర్వాత అశోక్ సంపాదనా పెరిగింది. అదేనండీ, ఇంతకు ముందు చెప్పిన శునకాల ఫోటో గ్రాఫర్‌గా కొత్త ప్రవృత్తిని చేపట్టాడు మరి. ఐటీ ఉద్యోగం చేస్తున్న అశోక్ చింతల క్ర్యుపా అనే జంతు వసతి గృహంలో స్వచ్ఛంద కార్య కర్తగా ఉండే వాడు. అక్కడే అతనికి ట్రావెలింగ్, ఫోటోగ్రఫీపై ఇష్టం ఏర్పడింది. బ్రూనో, జాజ్‌ను దత్తత తీసుకున్న తర్వాత ఆ ఆర్గనైజేషన్‌లోని జంతువులకు ఫోటోలు తీయడం మొదలుపెట్టాడు. అలా మరికొన్ని సంస్థల్లోనూ పనిచేయడం, అక్కడా ఫోటోలు తీస్తుండటంతో ఆ విషయం ఆ కంట్లో ఈ కంట్లో పడి, జనాలు తమ కుక్కలతో కలిపి ఫోటోలు తీయమని అడిగారు. అది మొదలు చెన్నై, బెంగళూరు నుండీ అశోక్ ఫోటోగ్రఫీకి ఆర్డర్లు రావడం ప్రారంభమయ్యింది. అదే అదునుగా శునకాల్ని ఫోటోలు తీయడం వృత్తిగా మార్చుకున్నాడు. దాని కోసం అతను ఉద్యోగం కూడా బెంగళూరులోనే చేయాలని నిశ్చయించుకున్నాడు.



అయితే అశోక్ కేవలం డబ్బు కోసమే ఈ పని చేస్తున్నాడనుకుంటే పొరపాటే. చెన్నైలో వరదలు ముంచెత్తినప్పుడు నిర్వాసితుల కోసం విరాళాలు సేకరించడానికి ఒక ప్రాజెక్ట్ చేశాడు. పెంపుడు జంతువులకు క్యాలండర్ షూట్‌లు చేసి సేకరించిన 35,000 రూపాయలను విరాళంగా ఇచ్చాడు. ఈ ప్రాజెక్ట్‌లో తీసిన 12 ఫోటోల్లో ఎక్కువ శునకాలవే. ముచ్చటగా మనపైకి గెంతుతు న్నప్పుడూ, ప్రేమతో ముద్దు పెడుతున్నప్పుడూ ఆ క్షణాలను మనం ఫోటోలు తీయలేము. అప్పుడే అశోక్ ఎంట్రీ ఇస్తాడు అలాంటి మధుర క్షణాలను కెమెరాతో క్యాప్చర్ చేస్తాడు. శునకాలతో 'చీజ్' చెప్పించడం చాలా కష్టం. దానికి అశోక్ దగ్గర మంచి చిట్కాలు చాలానే ఉన్నాయి. 'పెంపుడు జంతువుల్ని ప్రేమించగల్గినప్పుడే ఇలాంటి పనిలో ఆనందాన్ని పొందవచ్చు. దీనికి ఓర్పుతో పాటు దయాగుణం కూడా చాలా అవసరం. అంతేకాదు, కుక్కల ప్రవర్తనా, అవి చేసే శబ్దాలకు అర్థాలూ, వాటి మూడ్స్‌లో వచ్చే మార్పులూ తెలుసుండాలి' అంటాడు అశోక్. అందుకే ఫోటోలు తీసేముందు తన కస్టమర్లకు ఒక ప్రశ్నాపత్రం ఇస్తాడు. దాన్లో అవి ఇష్టపడే బొమ్మలూ, విందులూ, మనుషులతో, ఇతర శునకాలతో ఉన్నప్పుడు వాటి నడవడికా తదితరాల వివరాలకు సంబంధించిన ప్రశ్నలుంటాయి. ఫోటోషూట్‌కు ఒకరోజు ముందే యజమానులకు సూచనలు ఇస్తాడు.



ఈ తెలుగు ఫోటోగ్రాఫర్‌కు బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, ముంబయి వంటి నగరాల్లో చాలా మంది కస్టమర్లు ఉన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి కూడా చాలా ఫోన్‌కాల్స్ వస్తున్నాయట. ఎంతైనా విన్నూత్నమైన పనిచేస్తే ఆదరణకు అడ్డేముంటుంది. ★

ఆహ్వానం : యువ పాఠకుల కోసం ప్రతి ఆదివారం ప్రచురితమౌతున్న 'జోష్'లో మీరూ భాగస్వామి కావచ్చు. క్యాంపస్ కబుర్లు, ప్రాజెక్టుల వివరాలు, విజయాలు 'జోష్' పాఠకులతో షేర్ చేసుకోవచ్చు. 'జోష్' వాట్సప్ నంబర్ : 8333818985

పొడుపు కథ

నల్లని నాగి, తెల్లని తిమ్మ, పచ్చని పొడి. బావ నోట్లో వసంతం.

జోక్స్

తండ్రి : ఏరా పరీక్ష ఎలా రాశావు?
బాబి : బాగా రాశాను నాన్నా..!
తండ్రి : ఏట్రా నీ కాన్ఫిడెన్స్..?
బాబి : వందకు వంద వస్తాయని చెప్పాగా..! ఇంకా నామీద డౌటా..!?
తండ్రి : నేను నమ్మను'
బాబి : నువ్వు నమ్మవనే తెలుసు. అందుకే ఆన్సర్ షీట్ తీసుకొచ్చా.
తండ్రి : ఆ ఆ ఆ ..!!! ???




తెలివైన బుజ్జి బాతులు



హాయ్ పిల్లలూ.. ముద్దు ముద్దుగా ఉండే బుజ్జి బాతు పిల్లలు... ఎంతో తెలివైనవట! పుట్టిన మొదటి రోజు నుంచే వాటి మెదళ్లు భేషుగ్గా పనిచేస్తాయట! శాస్త్రవేత్తల పరిశోధనలో ఈ సంగతి తెలిసింది! ఎంత తెలివైనవో తెలుసా? వాటి వయసులో ఉన్న బుల్లి పాపాయిల కంటే కూడా తెలివైనవి. వాటికి జ్ఞాపకశక్తి కూడా ఎక్కువే. రూపాల్నీ, ఆకారాల్నీ, రంగుల్నీ కూడా చూసి గుర్తు పెట్టేసుకుంటాయట. బాతు పిల్లల్ని ఎప్పుడైనా గమనించారా? అవి తమ తల్లినే చకచకా అనుసరిస్తూ సాగిపోతుంటాయి. పుట్టిన వెంటనే తల్లిని చూడని బాతుపిల్లలు కూడా తాము మొదటగా దేన్ని చూస్తే దాని వెంటే తిరగడాన్ని కొందరు శాస్త్రవేత్తలు గమనించారు. అవెందుకలా చేస్తున్నాయో తెలుసుకుందామనుకున్నారు. అప్పుడే వాటి తెలివి గురించి బయటపడింది. పుట్టి 24 గంటలైనా గడవని 152 బాతు పిల్లల్ని ఈ పరిశీలన కోసం ఎంచుకున్నారు. వాటికి వాటి తల్లిని చూపించడం మానేశారు. తల్లికి బదులుగా రకరకాల పరిమాణాల్లో, రంగుల్లో కదులుతున్న బుడగల్ని చూపించారు. అవి మొదట ఏ పరిమాణంలో, ఏ రంగులో ఉన్న బుడగను చూశాయో అలాంటి వాటినే అనుసరించాయి. ఏ బాతుపిల్ల ఏ రంగు, ఆకారం ఉన్న బుడగల్ని చూసిందో ఆ తర్వాత కూడా అలాంటి వాటిని చటుక్కున గుర్తించగలుగుతున్నాయని తేల్చుకున్నారు. మరి పుట్టిన వెంటనే చూసిన వాటి రంగుల్నీ, ఆకారాల్నీ, పరిమాణాల్నీ కూడా ఎంచక్కా గుర్తుంచుకోవడం తెలివే కదా? ఈ పరిశోధనంతా ఆ బాతు పిల్లలు పుట్టిన 24 గంటల్లోపే చేశారు. ★





గుర్తించండి!

పిల్లలూ.! పైనున్న చిత్రంలో కొన్ని బొమ్మలున్నాయి. వాటి పేర్లు ఇక్కడ బాక్స్‌లో ఎక్కడ ఉన్నాయో గుర్తించి సున్నా చుట్టండి.!





ట్రోఫీని ఆవిష్కరించిన గోవా సిఎం సోనోవాల్

ఫిపా అండర్-17 ట్రోఫీ ఆవిష్కరణ

గౌహతి: భారత్‌లో ఈ ఏడాది అక్టోబర్ ఆరు నుంచి ప్రారంభం అయ్యే ఫిఫా అండర్-17 ప్రపంచకప్ ట్రోఫీ, ఆతిథ్య సిటి లోగోను శనివారం ఆవిష్కరించారు. దేశంలోని ఆరు ప్రధాన నగరాల్లో జరిగే ఈ టోర్నీకి గౌహతిలో ఒక సెమీఫైనల్ మ్యాచ్‌కు వేదికగా నిర్ణయించారు. అధికారికంగా విజేతకు అందించే ట్రోఫీని గోవా సిఎం శర్బానంద్ సోనావాల్ ఆవిష్కరించారు. ఈ టోర్నీకి సంబంధించి ట్రోఫీని అవిష్కరణ చేయడం తనకెంతో ఆనందాన్నిచ్చిందని, యువతలో ఉత్సాహాన్ని మరింత రెట్టించేందుకు ఈ టోర్నీ దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచకప్ డైరక్టర్ జేవియర్ సెప్పీ పాల్గొన్నారు. గత వారం ఈ ట్రోఫీని న్యూఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్‌ఖ నేషనల్ స్టేడియం గేటు వద్ద ప్రదర్శనగా ఉంచారు. మొత్తం మీద 2.5లక్షల మంది ట్రోఫీని తిలకించినట్లు అంచనా, గౌహతి రెండో ఆతిథ్య నగరం కావడం గమనార్హం.

శ్రీలంకను చుట్టేస్తారా?

- నేడు పల్లెకలెలో మూడో వన్డే
- సిరీస్‌పై విరాట్ కన్ను..
  శ్రీలంక సిరీస్‌ను నిలబెట్టుకునేనా
- మ్యాచ్ మధ్యాహ్నం 1.30 గంటలకు గ్రౌండ్‌లో





కసరత్తు చేస్తున్న కెప్టెన్ కపుదెగర

పల్లెకలె : శ్రీలంక పర్యటనలో వన్డే సిరీస్ విజయంపై విరాట్ అండ్ కో గురి పెట్టింది. తొలి వన్డేలో సునాయాసంగా గెలిచిన టీమిండియా,రెండో వన్డేలో ఓటమి కోరల నుంచి అనుహ్యంగా శ్రీలంకకు షాకిచ్చింది. దీంతో ఐదు వన్డేల సిరీస్ 2-0తో టీమిండియా ముందంజ వేసింది. ఉరిమే ఉత్సాహంతో భారత్ ఆదివారం పల్లెకలె వేదికగా జరిగే మూడో వన్డేలోను శ్రీలంకతో తలపడనుంది. రెండో వన్డేలో విరాట్ ప్రయోగం బెడిసి కొట్టింది. 131 పరుగులకే కీలకమైన ఏడు వికెట్లను కోల్పోయిన భారత్‌ను ధోనీ, భువి తన అద్భుతమైన బ్యాటింగ్‌తో జట్టుకు అద్వితీయ విజయాన్ని సాధించి పెట్టారు. రాహుల్ 3వ స్ధానంలో,జాదవ్‌ను నాలుగో స్ధానంలో బరిలో దింపడం వలన ఓటమి చెందే పరిస్థితి తలెత్తింది. అనుహ్యంగా బ్యాటింగ్ ఆర్డర్ మార్చడం స్పిన్నర్ అకిలా ధనుంజయ ధాటికి పేకమేడలా ఆరు వికెట్లను సమర్పించేసు కున్న టీమిండియాకే ఖంగారు పుట్టింది. దీంతో ఆదివారం నాటి వన్డేలో ఎలాంటి మార్పుల్లేకుండా జట్టును యథాతథంగా దింపడంతో పాటు పాత బ్యాటింగ్ ఆర్డర్‌లోనే ఆడనున్నారు. స్పిన్నర్లు అక్షర పటేల్, చాహల్, ఫాస్ట్ బౌలర్ బుమ్రాలు తొలి రెండు వన్డేల్లో వికెట్లతో రాణించడంతో వారిపైనే భారత్ మరింత ఆశలు పెట్టుకుంది.వార్ని మూడు వన్డేలోను కొనసాగించనున్నారు. ఈ వన్డేలోను విజయం సాధించేస్తే చివరి రెండు వన్డేల్లోను మళ్లీ ప్రయోగాలు చేయాలన్న దిశగా విరాట్ సంకేతాలు ఇచ్చాడు. రెండో వన్డేలో అనుహ్యంగా విజయపు అంచుల వరకు వెళ్లిన శ్రీలంకకు పెద్ద ఎదురు దెబ్బే తగిలింది. స్లో ఓవర్ రేట్ కారణంగా ఆ జట్టు కెప్టెన్ ఉప్పుల్ తరంగాపై ఐసిసి రెండు మ్యాచ్‌ల నిషేధం విధించింది. దీంతో చమీరా కపుదెగర 3,4 వన్డేల్లో సారథ్యం వహించనున్నాడు. తరంగా స్థానంలో తుది జట్టులోకి దినేష్ చండీమాల్‌ను తీసుకున్నారు.

విరాట్ @ 300

అద్భుత ఫామ్‌లో ఉన్న భారత కెప్టెన్ విరాట్‌కోహ్లీ కెరీర్‌లో 300 వన్డేను ఆడబోతున్నాడు. టీమిండియాను మూడు ఫార్మాట్లలో విజేతగా నిలుపతూ వరుస విజయాలతో దూకుడు మీద ఉన్నాడు. ఆదివారం పల్లెకలెలో జరిగే మూడో వన్డేతో అతనికి 300 వన్డే కావడం గమనార్హం. 2008 శ్రీలంక వన్డే సిరీస్ దంబుల్లాలో ప్రారంభమైన తొలి వన్డేలో ఓపెనర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించాడు. ఇప్పటి వరకు 191 వన్డేలు, 60 టెస్ట్‌లు.. 49 అంతర్జాతీయ టి 20 మ్యాచ్‌ల్లో పాల్గొన్నాడు.



పోరాడి ఓడిన సైనా

ప్రపంచ బ్యాడ్మింటన్ సెమీస్‌లో ఓటమి
కాంస్యం కైవసం

గ్లాస్గో: ఒలింపిక్ కాంస్య పతక విజేత సైనా నెహ్వాల్ మరోసారి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో నిరాశ పర్చింది. కీలకమైన ఫైనల్స్‌కు చేరే క్రమంలో సెమీస్ ఓటమి పాలై కాంస్యంతో సరిపుచ్చుకుంది. ఇక్కడ శనివారం జరిగిన తొలి సెమీఫైనల్లో నొజోమి ఒకుహర(జపాన్) చేతిలో పోరాడి పరాజయం పాలైంది. మూడు సెట్ల పోరులో 21-12, 17-21, 10-21తో కాంస్యంతో సైనా నెహ్వాల్ సరిపుచ్చుకుంది.తొలి సెట్‌ను అద్భుతంగా పోరాడి సాధించిన సైనా నెహ్వాల్, రెండో సెట్లోను ఒకానొక దశలో 17-17 ఒకుహరతో సమ ఉజ్జీగా నిలిచింది. ఆ తర్వాత ప్రత్యర్థి ధాటికి తలవొంచింది. కీలకమైన మూడో సెట్లోను పోరాడినప్పటికీ నొజోమీ ధీటైన ఆటముందు చిత్తయ్యింది. శుక్రవారం నాటి క్వార్టర్స్‌లో సైనా స్కాటిష్ షట్లర్ క్రిస్టీ గిలిమోర్‌పై 21-19, 18-21, 21-15తో జయభేరి మోగించిన విషయం తెల్సిందే.దీంతో రెండో సారి కూడా ఫైనల్స్‌కు చేరే అవకాశాన్ని వదులుకుంది.సుధీర్ఘ ర్యాలీ షాట్లతో సాగిన సైనా రెండో సెట్లో కాలికి గార్డ్ తగిలించుకుని బరిలో దిగింది. 2015 ప్రపంచ బ్యాడ్మింటన్ టోర్నీలో సైనా రజతం సాధించింది. రియో ఒలింపిక్స్ ముందు గాయంతో వైదొలిగి ఈ ఏడాది జనవరిలో రాకెట్ పట్టిన సైనా మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ ఈ ఓటమి నాకు ఏ మాత్రం నిరాశ పర్చలేదు. ఇటీవల కాలంలో ఆడిన టోర్నీలతో పోల్చుకుంటే తాను సెమీస్‌కు చేరానని తెలిపింది.

షరపోవాకు క్లిష్టమైన డ్రా





మళ్లీ సెమీస్‌లో ఫెడరర్ × నాదల్
రేపట్నుంచి యూఎస్ ఓపెన్ ప్రారంభం

న్యూయార్క్ సిటీ: నాలుగో గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్ పోరుకు టెన్నిస్ తారలు సమాయత్తం అవుతున్నారు. ఈ నెల 28 నుంచి 15రోజుల పాటు సాగే హార్డ్‌కోర్టు టోర్నీలో చెమటోడ్చి విజేతలుగా అవతరించాలని పలువురు ఉవ్విళూరుతున్నారు.ఈ సారి టాప్ సీడ్‌లుగా రఫెల్ నాదల్(బ్రిటన్), సిమోని హెలెప్(రొమేనియా)లు టైటిల్ వేటకు పావులు కదుపుతున్నారు. దాదాపుగా రెండేళ్ల తర్వాత గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వైల్డ్‌కార్డ్ ఎంట్రీతో బరిలో దిగుతున్న రష్యన్ టెన్నిస్ భామ మరియా షరపోవాకు తొలి రౌండ్‌లోనే కిష్టమైన డ్రా ఎదురైంది. ఆమె తొలి రౌండ్‌లోనే రొమేనియాకు చెందిన టాప్ సీడ్ సిమోని హెలెప్‌తో తలపడనుంది. ఫ్రెంచ్ ఓపెన్ వైల్డ్‌కార్డ్ ఎంట్రీ దక్కలేదు. వింబుల్డన్‌లో క్వాలిఫికేషన్ ఈవెంట్‌లోనే గాయంతో వెనుదిరిగింది. 2006లో మెరిసిన ఈ తార హెలెప్‌ను ఏ మేరకు నిలువరిస్తుందన్నది ఆసక్తి కరంగా మారంది. మాజీ ఢిపెండింగ్ ఛాంపియన్ కెర్బర్ నోవామి ఒసాకోతోను మరో టాప్ సీడ్ కరోలినా ఫ్లిస్కోవా పోలెండ్‌కుం చెందిన మగ్ద లిన్నెట్టితో తలపడనుంది. వీనస్ విలియమ్స్, కుజినెట్స్‌వా, వోజ్నియాకి, స్విత్లోనా, గార్బిన్ ముగురుజలు కూడా టైటిల్ సాధనపై కన్నేశారు. ఇదిలా ఉండగా పురుషుల డ్రాలో టాప్ సీడ్ రఫెల్ నాదల్, ఐదో సీడ్ రోజర్ ఫెడరర్ అన్ని అనుకూలిస్తే వారిద్దరు మళ్లీ సెమీస్‌లో తలపడే ఛాన్స్ ఉంది. వీరిద్దరికి ఇటీవల జరిగిన వింబుల్డన్ పోరులో ఇదే విధమైన డ్రా పడటం విశేషం.

లక్ష్యంపై అలక్ష్యం

- ఉపాధి నిధులిచ్చినా అభివృద్ధి చెందని ఆట స్థలాలు
- పది జిల్లాలో పనులే మొదలెట్టని అధికారులు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మైదానాలను, అవసరమైన సామాగ్రి, సదుపాయాలను కల్పించాలన్న ప్రభుత్వ మాటలు నీటి మూటలుగా మిగులుతున్నాయి. ఉపాధి హామీ పథకం నిధులతో క్రీడా మైదానాలను అభివృద్ధి చేయాలని, అందుకు వీలుగల పాఠశాలలను గ్రామాల్లో ఎంపిక చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా ఆట స్థలాల్లో (ప్లే- ఫీల్డ్స్) వాలీబాల్, కబడ్డీ, షెటిల్ కోర్టులు, రన్నింగ్, ఖోఖో ట్రాక్‌లను నిర్మిస్తే గ్రామీణ విద్యార్థులు సాధన చేసేందుకు వీలుంటుందని భావించారు. అభివృద్ధి చేసిన ఆయా ఆటస్థలాలకు అవసరమైన క్రీడా సామాగ్రిని అందజేసే బాధ్యతను శాప్‌కు అప్పగించారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3,538 క్రీడా స్థలాలను అభివృద్ధి చేయాలనేది ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఈ లక్ష్యంలో ఆగస్టు చివరి నాటికి 829 క్రీడా స్థలాలను అభివృద్ధి చేయాల్సి ఉంది. కానీ కేవలం ఎనిమిది క్రీడా స్థలాలను మాత్రమే ఇంతవరకు అభివృద్ధి చేశారు. వీటిలో సిఎం సొంత జిల్లా చిత్తూరులో ఐదు ఉండగా, తూర్పుగోదావరి, కడప, కృష్ణా జిల్లాల్లో ఒక్కోటి ఉన్నాయి. రాష్ట్రంలోని మిగిలిన తొమ్మిది జిల్లాల్లో ఒక్కటి కూడా అభివృద్ధి పనులు పూర్తయిన ఆటస్థలం లేకపోవడం ప్రభుత్వ లక్ష్యాలకు, వాటి అమలు తీరుకు అర్థం పడుతోంది. అయితే రాష్ట్రంలో 2,350 క్రీడా స్థలాల అభివృద్ధికి అనుమతులు మంజూరు చేయగా, 1,169 గ్రామాల్లో పనులు పురోగతిలో ఉన్నట్లు అధికారుల నివేదికలు పేర్కొంటున్నాయి. గుంటూరు, ప్రకాశం, శ్రీకాకుళం, పశ్చిమగోదావరి తదితర జిల్లాలు ఈ లక్ష్యసాధనలో బాగా వెనుకబడి ఉన్నాయి. గత నెలలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ నిర్వహించిన సమీక్షా సమావేశంలో క్రీడా స్థలాల అభివృద్ధిపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించినా కదలిక వచ్చినట్లు లేదు.

జిల్లాల వారీగా క్రీడా స్థలాల అభివృద్ధి వివరాలు..

జిల్లా	లక్ష్యం	పురోగతి	పూర్తయినవి
చిత్తూరు	412	220	5
తూర్పుగోదావరి	183	130	1
కడప	323	76	1
కృష్ణా	280	185	1
అనంతపురం	125	48	0
గుంటూరు	250	13	0
కర్నూలు	341	135	0
ప్రకాశం	280	28	0
నెల్లూరు	203	58	0
శ్రీకాకుళం	377	30	0
విశాఖపట్టణం	137	26	0
విజయనగరం	166	118	0
పశ్చిమగోదావరి	461	102	0
మొత్తం	**3,538**	**1,169**	**8**

పాట్నా జయభేరి



పాట్నా, తమిళ్ జట్ల మధ్య మ్యాచ్

తలైవాస్‌కు భారీ ఓటమి

ముంబయి: ప్రొ కబడ్డీ(పికెఎల్) ఐదో సీజన్‌లో పాట్నా ఎట్టకేలకు ఓ అదిత్వీయ విజయాన్ని సాధించింది. ఆ జట్టు టాప్ రైడర్ మోను గోయత్ 11 సార్లు దాడులకు వెళ్లి 11 పాయింట్లతో హవాను చాటాడు. దీంతో తమిళ్ తలైవాస్‌పై పాట్నా 35-24తో జయభేరి మోగించింది తొలి అర్థ భాగం నుంచి ప్రత్యర్థి జట్టుపై విరోచిత దాడులతో పాట్నా ముందంజ వేసింది. తొలుత 16-9తో నిలిచిన ఆ జట్టు చివరకు 11 పాయింట్లతో జయకేతనం ఎగుర వేసింది. పైరేట్స్ జట్టులో జయదీప్ 5, కెప్టెన్ ప్రదీప్ నర్వాల్ ఆరు పాయింట్లతో జట్టు విజయంలో కీలక పాత్రను పోషించారు. తమిళ్ జట్టు కెప్టెన్ అజయ్ ఠాకూర్ 8 రైడ్స్‌తో మొత్తం 10 పాయింట్లను సాధించినా, ఇతర ఆటగాళ్లు తమ సామర్థ్యానికి తగ్గ రీతిలో రాణించకపోవడంతో పాట్నాకు ఎదురు లేకుండా పోయింది.

ముంబాకు షాకిచ్చిన పుణేరి

సొంతగడ్డపై డిఫెండింగ్ ఛాంపియన్ యు ముంబాకు పుణేరి పల్టన్ చివర్లో షాకిచ్చింది. ఆ తర్వాత రెండో మ్యాచ్ యు ముంబా పుణేరి పల్టన్ జట్ల మధ్య సాగింది. ఇరుజట్ల మధ్య హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో చివరి నిమిషంలో పుణేరి 26-24తో ముంబాను మట్టి కరిపించింది. ముంబా జట్టులో కాశిలింగ అదకే ఏడు రైడ్ పాయింట్లు, శ్రీకాంత్ జాదవ్ 5 పాయింట్లు ,కులీదీప్ సింగ్ 3 పాయింట్లను సాధించారు. పుణేరి కెప్టెన్ దీపక్ హుడా సాధించిన 8 పాయింట్లే మ్యాచ్‌లో అత్య ధికం కావడం విశేషం. సందీప్ నర్వాల్ 3, రాజేష్ మండల్ 4 పాయింట్లను సాధించారు.

నేటి మ్యాచ్‌లు

రాత్రి 8 గంటలకు బెంగాల్ వారియర్స్ X బెంగళూరు బుల్స్
రాత్రి 9 గంటలకు యు ముంబా X దంబంగ్ ఢిల్లీ



ఒక్క పతకం దక్కలేదు
ప్రపంచ రెజ్లింగ్‌లో బజరంగ్ నిష్క్రమణ

పారిస్: ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో పతకాలు సాధిస్తారన్న అంచనా వేసిన రెజ్లర్లు ఒక్కొక్కరుగా ప్రి క్వార్టర్స్ దాటకుండా నిష్క్రమించారు. దీంతో భారత్ ఖాతాలో శనివారం నాటి వరకు ఒక్క పతకం దక్కలేదు. శనివారం నాటి ప్రి క్వార్టర్స్‌లో బజరంగ్ పూనియా, ప్రవీణ్ రాణా నిష్క్రమణతో ఇక పతకాలపై ఆశలు వదులుకున్నట్లే.మెగా ఈవెంట్‌లో 65 కేజీల ప్రి స్టయిల్ విభాగంలో బజరంగ్ జురాబి లకోబిస్‌విల్లీ(జార్జియా) చేతిలో 6-5తోను, 74 కేజీల విభాగంలో రాణా హసనోవ్(అజర్‌బైజాన్) బాక్సర్ చేతిలో పోరాడి ఓడాడు. మరో ఇద్దరు సత్యవర్ట్ కడియాన్(97 కేజీలు) అమిత్ ధనకర్ (70 కిలోలు) విభాగంలోనే ఓడారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68